
సోమవారం 26-6-2023


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 95

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సుతీర్థ-ఐహిక జోడీకి టైటిల్

డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీలో మెరిసిన భారత క్రీడాకారిణులు -12లో



చిన్న పెట్టుబడి.. పెద్ద నిధిగా..

స్మాల్‌క్యాప్ కంపెనీల్లో అధిక రాబడులు. పొరపాటు జరిగితే పెట్టుబడికీ నష్టం -13లో



సైన్యాన్ని ముట్టడించిన మహిళలు

మణిపూర్‌లో మిలిటెంట్లను విడిపించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు ఆర్మీని దిగ్బంధించారు.

వివరాలు 6లో ▸



హలో.. ఆస్ట్రోనాట్..!

వ్యోమగాములు ఇకపై ఏదైనా సమాచారం కావాలంటే తాము ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌకను అడిగితే సమాచారం దొరుకుతుంది.

వివరాలు 6లో ▸



'ఒబామా'పై నిర్మల మండిపాటు

మైనారిటీల హక్కుల్ని కాపాడలేకపోతే భారత్ విడిపోయే ప్రమాదం ఉందన్న ఒబామా వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



ప్రధాని కాల్ మిస్సైన ముర్ము

రాష్ట్రపతి పదవికి నామినేషన్ వేయాలని కోరేందుకు స్వయంగా ప్రధాని మోదీయే చేసిన కాల్‌ను ద్రౌపది ముర్ము మిస్సయ్యారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కేసీఆర్ చేతిలో నలిగిపోతున్న రాష్ట్రం: భట్టి



కేసీఆర్ చేతిలో పడి రాష్ట్రం మొత్తం నలిగిపోతోందని.. ధరణి పేరుతో రాష్ట్రంలో నడుస్తున్న అతిపెద్ద ల్యాండ్ మాఫియా కారణంగా రైతులు భూములు కోల్పోతున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తంచేశారు.

- వివరాలు 3లో▶


10 లక్షల జనాభాకు ఓ మెడికల్ కాలేజీ



10 లక్షల జనాభా కలిగిన ప్రాంతంలో కొత్త మెడికల్ కాలేజీ స్థాపన కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఆ ప్రాంతంలో ఎలాంటి మెడికల్ కాలేజీ ఉనికిలో ఉండకూడదని పేర్కొంది.

- వివరాలు 3లో▶

నేటి నుంచి 'రైతుబంధు'



రైతుబంధు సొమ్మును ప్రభుత్వం సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. 70 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని వెల్లడించింది. అలాగే నాలుగు లక్షల ఎకరాలున్న లక్షన్నర మంది పోడు రైతులకు కూడా ఈసారి రైతుబంధు జమ చేస్తారు.

- వివరాలు 5లో▶

బీజేపీ వస్తే ధరణి బంద్!

బీఆర్ఎస్ పోర్టల్ కూడా బంద్ అవుతుంది • నాగర్‌కర్నూల్ సభలో జేపీ నడ్డా



అది బీఆర్ఎస్ కాదు.. భ్రష్టాచార్ రాక్షసుల సమితి

- ప్రజా, రైతు వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి
- బీజేపీ మాత్రమే ప్రజల కోసం పనిచేస్తోంది
- ప్రపంచ దేశాలు ప్రధాని మోదీని హీరో అంటున్నాయి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- తొమ్మిదేళ్లలో ఎంతో చేశాం.. రాష్ట్రంలో బీజేపీ వస్తే మరిన్ని మార్పులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ధరణి పోర్టల్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం రైతుల భూములను గుంజుకుంటోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. రాష్ట్రంలో రైతులను వేధింపులకు గురిచేసేందుకే ఈ పోర్టల్‌ను తెచ్చారని..తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌తో పాటు బీఆర్ఎస్ పోర్టల్ కూడా బంద్ అవుతుందని చెప్పారు. తన కుటుంబాన్ని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పేరుతో కేసీఆర్ కొత్తరాగం ఎత్తుకున్నారని విమర్శించారు. పేరు మారినంత మాత్రాన

మిగతా 2వ పేజీలో ▶

కట్టుతప్పితే చర్యలే..

రాష్ట్ర బీజేపీ నేతలకు నడ్డా స్పష్టీకరణ

- బీఆర్ఎస్‌పై రాజీలేని పోరు!
- గెలుపే లక్ష్యంగా ఐకమత్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు
- రాష్ట్ర పార్టీలో సమష్టి నిర్ణయాలు కొరవడ్డాయన్న నేతలు
- సీనియర్లను సంప్రదించడం లేదంటూ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: అధికార బీఆర్ఎస్‌తో ఎలాంటి రాజీ లేదని, ఆ పార్టీపై రాజకీయంగా తీవ్రస్థాయిలో పోరాడి ఓడించేందుకు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా ఉంటూ తెలంగాణలో అధికార సాధనే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలంటూ దిశానిర్దేశం చేశారు. పార్టీకి నష్టం కలిగించేలా, క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఎవరు వ్యవహరించినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి

మిగతా 2వ పేజీలో ▶

ప్రొ.నాగేశ్వర్‌తో నడ్డా భేటీ

25 నిమిషాలు సాగిన సమావేశం 2లో

నడ్డా సభకు ఈటల, రాజగోపాల్ దూరం

ఆదివారం సాయంత్రం వరకు హస్తినలోనే..

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శనివారం ఢిల్లీకి వచ్చిన బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు ఆదివారం పగలంతా హస్తినలోనే గడిపారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటన ఉన్నప్పటికీ నేతలిద్దరూ ఇక్కడే ఉండడంలోని ఆంతర్యం ఏమిటన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శనివారం నాటి భేటీ సందర్భంగా అమిత్ షా, నడ్డాలు ఏదైనా కీలక పనులు అప్పగించారా? లేక ఇంకా ఎవరైనా కీలక నేతలతో భేటీ అయ్యేందుకు ఆగారా? అన్న దానిపై చర్చలు జరిగాయి. కాగా ఈటల రాజేందర్ పార్టీ అంతర్గత వ్యవహారాలు చూసే కొందరు నేతలతో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఎవరెవరితో సమావేశమయ్యారు? చర్చల సారాంశం ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. మరోపక్క అమిత్‌షా, నడ్డాల సూచనల మేరకు ప్రధాని మోదీతో భేటీ అయ్యేందుకే ఢిల్లీలో ఆగిపోయారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ప్రధానమంత్రి విదేశీ పర్యటన ముగించుకొని సోమవారం ఢిల్లీ చేరుకోనుండగా ఈటల, రాజగోపాల్‌రెడ్డిలు ఆదివారం రాత్రికే హైదరాబాద్‌కు చేరుకున్నారు.



ఈజిప్టులోని కైరోలో జరిగిన సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఈజిప్టు అత్యున్నత గౌరవమైన 'ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును అందజేస్తున్న ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్

ఇండియా హీరో మోదీ

ఆయన నాయకత్వంలో భారత్‌లో అద్భుత ప్రగతి

ప్రధానిపై ఈజిప్టులో ప్రవాస భారతీయుల ప్రశంసలు

అందరికీ హీరో భారత్ అంటూ మోదీ ప్రతిస్పందన


ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్‌తో సమావేశం

పలు కీలక అంశాలపై చర్చలు.. ఒప్పందాలపై సంతకాలు

'ఇండియా హీరో నరేంద్ర మోదీ'అంటూ ఈజిప్టులో నివసిస్తున్న ప్రవాస భారతీయులు భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో మోదీ చరిత్రాత్మక ప్రసంగం అద్భుతంగా ఉందంటూ కొనియాడారు. మోదీ నాయకత్వంలో ఇండియా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అమెరికాలో నాలుగు రోజుల అధికారిక పర్యటన ముగించుకొని శనివారం ఈజిప్టులో అడుగుపెట్టారు. గత 26 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడంఇదే మొదటిసారి. కాగా, ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద నైల్'ను ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్-సీసీ ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రదానం చేశారు. ఈజిప్టు సహా ఇప్పటిదాకా 13 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలతో మోదీని సత్కరించాయి.

- వివరాలు 6లో▶

ప్రవాసంలోకి ప్రిగోజిన్!



- రష్యాలో ప్రైవేటు సైన్యం తిరుగుబాటు ముగిసింది. సైనిక నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి కొద్ది గంటల సేపు అల్లకల్లోలం సృష్టించిన ప్రైవేటు సైన్యం సంస్థ వాగ్నర్ చీఫ్ యెవెగినీ ప్రిగోజిన్ వెనక్కి తిరిగారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉన్న బెలారస్‌కు ప్రవాసం వెళ్లాలని ప్రయాణమయ్యారు. - వివరాలు 6లో▶

దళితబంధుకు దరఖాస్తు ఎలా?

- రెండో విడత అమలుకు అనుమతులు వచ్చినా అధికారుల్లో అస్పష్టతే
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల జోక్యంపై ఇప్పటికే హైకోర్టు ఆక్షేపణ
- మరోవైపు లబ్ధిదారుల నుంచి వసూళ్లపై సీఎం ఆగ్రహం.. అయినప్పటికీ పాతవిధానంలోనే అర్హుల ఎంపికకు ఉత్తర్వులు -5లో▶

రోడ్డు మార్గంలో నేడు మహారాష్ట్రకు..

బీఆర్ఎస్‌కు కొత్త ఊపు లక్ష్యంగా కేసీఆర్ పర్యటన



- 500 వాహనాలతో కూడిన కాన్వాయ్.. 2 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు.. పండరీపూర్‌లో సభ
- సీఎం వెంట మంత్రులు, నేతలు -2లో▶

ఢిల్లీ చేరుకున్న పొంగులేటి, జూపల్లి

నేటి మధ్యాహ్నం 3 గంటలకు ఖర్గే, రాహుల్‌తో సమావేశం



- ఇప్పటికే ఢిల్లీకి 20 మందికిపైగా టీ కాంగ్రెస్ నేతలు
- ఈ భేటీలోనే పార్టీ నేతలకు రాహుల్ దిశానిర్దేశం చేసే అవకాశం
- ఖమ్మంలో సభ నిర్వహించే తేదీ కూడా ఖరారయ్యే చాన్స్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ అసంతృప్త నేతలైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో వారిద్దరూ తమ ముఖ్య అనుచరులతో కలసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీని కలవనున్నారు. ఇందుకోసం ఆదివారం రాత్రి 9 గంటలకు వారు ఢిల్లీ చేరుకున్నారు. ఈ కార్యక్రమం కోసం నలుగురు ఏఐసీసీ ఇన్‌చార్జీలతోపాటు 22 మంది రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం అందింది. దీంతో చాలా మంది నాయకులు ఆదివారం రాత్రే ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. మరికొందరు సోమవారం ఉదయం చేరుకోనున్నారు. పొంగులేటి, జూపల్లి బృందంతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, వి. హనుమంతరావు, రేణుకాచౌదరి, జీవన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, బలరాం నాయక్, శ్రీధర్‌బాబు, మధుయాష్కీ గౌడ్, దామోదర రాజనర్సింహ, పోదెం వీరయ్య,

మిగతా 2వ పేజీలో ▶



తప్పు జరిగింది.. భూమి మున్సిపాలిటీకి రాసిస్తా

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కూతురు తుల్జా భవానీరెడ్డి

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



ప్రాణ రహిత!



కాళేశ్వరం వద్ద ఎడమ వైపున గోదావరి, ఎదురుగా తరలివచ్చే ప్రాణహిత నదులు ఒకే చోట కలిసే ప్రదేశం

- ప్రాణహితలో 65 ఏళ్లలో ఎన్నడూ లేనంత నీటి కరువు
- ఏటా జూన్‌లో కనీసం 5,000 క్యూసెక్కుల వరద
- ప్రస్తుతం 800 క్యూసెక్కులకు మించని ప్రవాహం
- మేడిగడ్డకి వచ్చింది కేవలం 0.1 టీఎంసీనే
- జూలై, ఆగస్టు నాటికి వరద పుంజుకొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి పరీవాహక ప్రాంతంలోని అతిపెద్ద ఉపనది ప్రాణహిత జీవం కోల్పోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గత 65 ఏళ్లలో ఎన్నడూ కనిపించని దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది. సహజంగా ఏటా జూన్ 15 తర్వాత ప్రాణహిత నదిలో కనీసం 5,000 క్యూసెక్కుల నిరంతర వరద ప్రవాహం ఉంటుంది. కానీ ఈ ఏడాది జూన్ 24 దాటినా ప్రాణహితలో 800 క్యూసెక్కులకు మించి వరద లేదు. 800 క్యూసెక్కులు సైతం ఊట నీళ్లేనని (రీజనరేటెడ్ వాటర్) నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్‌లోని

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఆనంద శంకర్ జయంత్ నివాసానికి నడ్డా



ఫిలింనగర్: సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం హైదరాబాద్ ఫిలింనగర్‌లో ప్రముఖ క్లాసికల్ డ్యాన్సర్, పద్మశ్రీ అవార్డుగ్రహీత ఆనంద శంకర్ జయంత్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తొమ్మిదేళ్ల మోదీ పాలనలో సాధించిన విజయాలను ఆమెకు వివరించారు. అనంతరం మోదీ ప్రగతిపై ముద్రించిన పుస్తకాలను అందించారు. జూన్ 18న మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆనంద శంకర్ జయంత్ పేరును ప్రధాని మోదీ ప్రస్తావించిన విషయాన్ని నడ్డా గుర్తుచేసుకున్నారు. అలాగే ఆమె అకాడమీ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణానికి విదేశీ పరిజ్ఞానం

29న సింగపూర్, దక్షిణ కొరియాల్లో అధ్యయన యాత్ర: మంత్రి కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: ప్రపంచ దేశాల్లోని



తెలంగాణ చౌక్ వద్ద వెలుగులు విరజిమ్ముతున్న ఐలండ్

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణానికి వినియోగించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆదేశాలపై ఈనెల 29న సింగపూర్, దక్షిణ కొరియా దేశాల పర్యటనకు మంత్రుల బృందం వెళ్లనుందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో రూ.1.2 కోట్లతో నిర్మించిన ఐలండ్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. విదేశీ పర్యటనలో తనతో పాటు పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, పర్యాటకశాఖ ఎండీ మనోహర్‌రావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్, కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజులపాటు ప్రపంచంలో ఆకర్షణీయమైన నగరాలైన సియోల్, యోసో, సింగపూర్‌లో పర్యటిస్తామని తెలిపారు. అక్కడి దీపాల వ్యవస్థ, స్కై థియేటర్లు, హ్యాపీ థియేటర్లపై అధ్యయనం చేసి వస్తామని వివరించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, కమిషనర్ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భివండీ నేతల చేరిక

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని భివండీకి చెందిన వివిధ పార్టీల నేతలు ఆదివారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఎన్సీపీ మైనారిటీ సెల్ జాతీయ కార్యదర్శి ఆరిఫ్ అజ్మీతో పాటు ఫజిల్ అన్సారీ, భివండీ కాంగ్రెస్ నేత, సామాజిక కార్యకర్త ఇర్ఫాన్ మోమిన్, కాంగ్రెస్ నేత, ఎన్జీవో సీనియర్ నాయకుడు అర్షత్ షేక్, ఎన్సీపీ థానే జిల్లా ఉపాధ్యక్షుడు మక్సూద్ ఖాన్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎ.జీవన్ రెడ్డి, మహారాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఏజెంటు రేవంత్: దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఏజెంటుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. రేవంత్‌రెడ్డి బీజేపీకి అమ్ముడు పోయినందునే గతంలో జరిగిన దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారని స్పష్టం చేశారు. ఆయన తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీ రామారావు ఢిల్లీ పర్యటనను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎందుకు కలిసారో రేవంత్ చెప్పాలన్నారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ముఖ్యమంత్రులు ప్రధాని మోదీని ఎందుకు కలిసారని ప్రశ్నించారు. రాజకీయాలు తెలియని రేవంత్ కేవలం మీడియాలో ప్రచారం కోసమే ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తారని దాసోజు ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే నేతలెవరూ లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నుంచి ప్రజాదరణ కలిగిన నేతలు తమ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని దానం వెల్లడించారు.



నాగర్‌కర్నూల్ సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న నడ్డా, జితేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్, కిషన్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణ

బీజేపీ వస్తే ధరణి బంద్!

▶ మొదటి పేజీ తరువాయి

వారి గుణం మారదని, 'ఆ పార్టీ బీఆర్‌ఎస్ కాదు.. భ్రష్టాచార్ రాక్షసుల సమితి' అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పీఎం ఆవాస్ యోజన కింద మంజూరు చేసిన ఇళ్లలోనూ కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని, ప్రజా, రైతు వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం 'నవ సంకల్ప బహిరంగ సభ'లో ఆయన మాట్లాడారు.

విపక్షాల ప్రయాస ఫొటో సెషన్లకే పరిమితం

దేశంలో ప్రతిపక్ష పార్టీలు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఏకమవుతున్నాయని, వారి ప్రయాస అంతా ఫొటో సెషన్లకే పరిమితమవుతుందని నడ్డా విమర్శించారు. కాంగ్రెస్‌తో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, శాక్రే పార్టీలన్నీ తమ కుటుంబాలను కాపాడుకునేందుకే తహతహలాడుతున్నాయని, ఒక్క బీజేపీ మాత్రమే దేశ ప్రజల హితం కోసం పనిచేస్తోందని చెప్పారు. మోదీ చేసిన అభివృద్ధిపై విమర్శలు చేయలేకనే, ఆయన కులం పేరుతో చాయ్‌వాలా అంటూ విపక్షాలు అక్కసు వెళ్లగక్కుతున్నాయని అన్నారు. ప్రధాని మోదీ మాత్రం విషాన్ని మింగినట్టుగా విమర్శలను మింగుతూ నిరంతరం దేశ ప్రజల కోసం పనిచేస్తున్నారని చెప్పారు.

మోదీ ముందుచూపుతో ఆర్థిక వ్యవస్థ పటిష్టం

కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితులను సైతం తట్టుకుని మోదీ ముందు చూపుతో దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపర్చారని నడ్డా చెప్పారు. ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను నేడు ఐదో స్థానంలో నిలిపారని అన్నారు. గతంలో దేశంలో 28 శాతం ఉన్న పేదరికం, మోదీ ప్రభుత్వ పథకాల ఫలితంగా 10 శాతానికి తగ్గిందని వివరించారు. గతంలో 97 శాతం మొబైల్ ఫోన్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లమని, ఇప్పుడు 97 శాతం ఫోన్లు దేశంలోనే తయారవుతున్నాయని తెలిపారు. 'దునియా మే మోదీ ఈజ్ ది బాస్, యువర్ హీరో, గ్లోబల్ లీడర్' అంటూ మోదీని ప్రపంచ నేతలు కొనియాడుతున్నారని చెప్పారు.

పోరాటవీరుడు నడ్డా: బండి సంజయ్

పదిహేనేళ్ల చిరుప్రాయంలోనే దేశంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు జేపీ నడ్డా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ పేరుతో పోరాడుతూ బీజేపీని ప్రతి గడపకు చేర్చి ప్రపంచంలోనే శక్తివంతమైన పార్టీగా తీర్చిదిద్దారని చెప్పారు. నాగర్‌కర్నూల్‌లో బీజేపీ ఎక్కడుందీ.. అని అంటున్న వాళ్లకు ఇక్కడికి వచ్చిన జనసందోహాన్ని చూపించాలని అన్నారు. సభలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, మహేంద్రనాథ్ పాండే, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, నేతలు జితేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని నడ్డా చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 65 ఏళ్లలో చేయలేని పనులను కేవలం తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిందని చెప్పారు. తెలంగాణలో 65 ఏళ్లలో మొత్తం 2,500 కి.మీ. మేర జాతీయ రహదారులు వేస్తే, బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలోనే 2,500 కి.మీ రహదారులను నిర్మించామని తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో రూ.11 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామంటూ గుర్తు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించడంతో పాటు కొత్తగా ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి, విశాఖలకు రెండు వందే భారత్ రైళ్లను నడిపిస్తున్నట్టు వివరించారు. హైదరాబాద్ – నల్లగొండ, హైదరాబాద్ – వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్లు, రాష్ట్రానికి మెగా టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేశామని చెప్పారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుందని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రాష్ట్రంలో బీజేపీ పాలన వస్తే ఇంకా ఎన్ని మార్పులు ఉంటాయో ఆలోచించాలని కోరారు.

ఢిల్లీ చేరుకున్న పొంగులేటి, జూపల్లి

▶ మొదటి పేజీ తరువాయి

జగ్గారెడ్డి, మల్లు రవి, మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్ కుమార్, చిన్నారెడ్డి, రోహిత్ చౌదరి, పీసీ విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్, వంశీచందర్‌రెడ్డిలను ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. వారిలో 20 మందికిపైగా నేతలు ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలిసింది. పొంగులేటి, జూపల్లి వెంట పాయం వెంకటేశ్వర్లు, మువ్వా విజయ్‌బాబు, బానోతు విజయాబాయి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు వెళ్లనున్నట్లు తెలిసింది. వీరంతా ఖర్గే, రాహుల్ గాంధీని కలసి తెలంగాణ రాజకీయాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ మార్గనిర్దేశం చేయనుంది. ఈ సమావేశంలోనే ఖమ్మంలో పొంగులేటి బృందం పార్టీలో చేరిక, సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించాల్సిన బహిరంగ సభ తేదీలు కూడా ఖరారు కానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసమే: మల్లు రవి

రాష్ట్రాన్ని నియంతలా పాలిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించేందుకే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయని, అదేవిధంగా రాష్ట్రంలోనూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని, అందులో భాగంగానే ఈ చేరికలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పౌర హక్కుల సంఘాలు, కుల సంఘాలు, ప్రజాస్వామికవాదులు చేయిచేయి కలిపి బీఆర్‌ఎస్ నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని మల్లు రవి పిలుపునిచ్చారు.

ఆట మొదలవుతోంది: పొంగులేటి

ఆదివారం రాత్రి ఢిల్లీ ఎయిర్‌పోర్టు వద్ద పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చబోతున్నామని వ్యాఖ్యానించారు. ఆట మొదలవుతోందని.. ఆటను పర్‌ఫెక్ట్‌గా ఆడబోతున్నామంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదని ప్రజలు భావిస్తున్నారని... ఇప్పుడు రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని పొంగులేటి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సహా 4–5 జిల్లాల నుంచి నేతలం కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలకు వచ్చామని చెప్పారు. ఇతర పార్టీల నేతలు, ఇతర ప్రాంతాల నేతలు సైతం పెద్ద ఎత్తున చేరబోతున్నారన్నారు. ఖర్గే, రాహుల్‌తో భేటీ అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి అన్ని వివరాలు వెల్లడిస్తానని పొంగులేటి తెలిపారు.

142 లేఖలు రాసినా..

కృష్ణా బోర్డు తీరుపై తెలంగాణ అసంతృప్తి.. చైర్మన్‌కు ఘాటుగా మరో లేఖ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) అనుసరిస్తున్న వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డుకు 142 లేఖలు రాసినా ఎలాంటి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో నిర్మిస్తున్న అనుమతి లేని ప్రాజెక్టులపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, కృష్ణా ట్రిబ్యునల్–1 నిబంధనల అమలును సైతం గాలికి వదిలేసిందని మండిపడింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ ఈ నెల 23న కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. అనుమతి లేని ప్రాజెక్టులను నిర్మించకుండా ఏపీని నిలువరించాలని కోరుతూ 40 లేఖలు రాశామని, ఆ రాష్ట్రంలో అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టుల విస్తరణ, కొత్త పనులను అడ్డుకోవాలని మరో 32 లేఖలు రాశామని లేఖలో పేర్కొన్నారు. కృష్ణా ట్రిబ్యునల్–1 నిబంధనల అమలుతో పాటు ఇతర అంశాలపై మరో 70 లేఖలు రాశామని గుర్తు చేశారు. ఇన్ని లేఖలు రాసినా కృష్ణా బోర్డు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఏపీ ఉల్లంఘనలను కనీసం కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లలేదని తప్పుబట్టారు. తాము లేఖల్లో ప్రస్తావించిన విషయాలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, కృష్ణా జలాల ఆధారంగా అనుమతి లేని ప్రాజెక్టులను నిర్మించకుండా ఏపీని నిలువరించాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు రాసిన 142 లేఖల జాబితాను తాజా లేఖకు జత చేశారు.

రోడ్డు మార్గంలో నేడు మహారాష్ట్రకు కేసీఆర్

బీఆర్‌ఎస్‌కు కొత్త ఊపు లక్ష్యంగా పర్యటన

- 500 వాహనాలతో కూడిన భారీ కాన్వాయ్
- రెండురోజుల పాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు.. పండరీపూర్‌లో సభ
- సీఎం వెంట పలువురు మంత్రులు, ముఖ్య నేతలు
- మంగళవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో నగరానికి..



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాల్క సుమన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోనూ భారత్ రాష్ట్ర సమితి బలోపేతానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు రెండు రోజుల పాటు ఆ రాష్ట్రంలో పర్యటించనున్నారు. సోమవారం రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లనున్న సీఎం..తిరుగు ప్రయాణంలో ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎంపీ వేణుగోపాలచారి.. మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో కలిసి సమన్వయం చేస్తున్నారు. మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గే, బీఆర్‌ఎస్ కిసాన్ సెల్ మహారాష్ట్ర శాఖ కన్వీనర్ మాణిక్ కదమ్ పర్యవేక్షిస్తున్నారు.

పండరీపూర్, తుల్జాపూర్‌లో ప్రత్యేక పూజలు

షోలాపూర్‌లో రాత్రి బస అనంతరం మంగళవారం ఉదయం స్థానికంగా అధిక సంఖ్యలో ఉండే తెలుగు ప్రజలతో పాటు వివిధ రంగాలు, వర్గాలకు చెందిన ప్రతినిధులతో కేసీఆర్ భేటీ అవుతారు. అనంతరం పండరీపూర్ పట్టణానికి చేరుకుని శ్రీ విఠల రుక్మిణీ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత స్థానికంగా జరిగే బీఆర్‌ఎస్ సభలో ఎన్సీపీ దివంగత ఎమ్మెల్యే భరత్ భాల్కే కుమారుడు భగీరథ్ భాల్కే.. కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరతారు. మధ్యాహ్నానికి తుల్జాపూర్ చేరుకుని భవానీమాత మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడికి సమీపంలోని ఉస్మానాబాద్ (దారాశివ్) ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రానికి హైదరాబాద్‌కు వస్తారు.

భారీ ఏర్పాట్లు

తెలంగాణ ఉద్యమ సమయంలో భారీ కార్ల ర్యాలీతో దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి అందరి దృష్టినీ ఆకర్షించిన కేసీఆర్, బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రస్తుతం అదే తరహా వ్యూహానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో రోడ్డు మార్గాన ప్రయాణించడం ద్వారా దేశం దృష్టిని ఆకర్షించాలని భావిస్తున్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ నేతలు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. 65వ నంబరు జాతీయ రహదారి పొడవునా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ భారీయెత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ వాహన కాన్వాయ్‌లో పలువురు కేబినెట్ మంత్రులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలు సీఎం వెంట వెళ్లనున్నారు.

మహారాష్ట్రలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా..

గత ఏడాదిలో బీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత మహారాష్ట్రలో పార్టీ విస్తరణకు కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే నాందేడ్, కాందార్ లోహ, ఔరంగాబాద్, నాగపూర్‌లో జరిగిన సభలు, సమావేశాల్లో కేసీఆర్ పాల్గొన్నారు. నాగపూర్‌లో పార్టీ తొలి శాశ్వత కార్యాలయాన్ని కూడా ప్రారంభించడంతో పాటు ఔరంగాబాద్, షోలాపూర్, పుణే, ముంబయిలోనూ శాశ్వత కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సభ్యత్వ నమోదుతో పాటు 45 వేల జనావాసాల్లో పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. మహారాష్ట్రలో 50 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పార్టీ యంత్రాంగం పనిచేస్తుండగా, ప్రస్తుతం కేసీఆర్ రెండురోజుల పర్యటన బీఆర్‌ఎస్‌కు మరింత ఊపు తెస్తుందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

రోడ్డు మార్గంలో 315 కిలోమీటర్లు..

సోమవారం ఉదయం ప్రగతిభవన్‌లో మంత్రులు, పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి సీఎం కేసీఆర్ అల్పాహారం చేస్తారు. ఉదయం 10 గంటల సమయంలో సుమారు 500 వాహనాలు అనుసరిస్తుండగా 65వ నంబరు జాతీయ రహదారి మీదుగా మహారాష్ట్రకు బయలుదేరతారు. కూకట్‌పల్లి, పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ పట్టణాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తారు. ఆ రాష్ట్రంలోని హుమ్నాబాద్, బసవకళ్యాణ్ మీదుగా సాయంత్రం నాలుగు గంటలకు మహారాష్ట్రలోని ఒమర్గాకు చేరుకుంటారు. ఒమర్గాలో మధ్యాహ్న భోజనం చేసి షోలాపూర్‌కు బయలుదేరతారు. హైదరాబాద్ నుంచి మొత్తం సుమారు 315 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణానంతరం రాత్రి 10 గంటలకు అక్కడికి చేరుకుంటారు.

కట్టుతప్పితే చర్యలే..

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్‌కు చేరుకున్న నడ్డాకు.. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఇతర నేతలు స్వాగతం పలికారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో భోజనం చేసినపుడు, ఆ తర్వాత.. కిషన్‌రెడ్డి, సంజయ్, లక్ష్మణ్‌తో పాటు ముఖ్య నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, విజయశాంతి, డా.వివేక్ వెంకటస్వామి, ఎం.రఘునందన్‌రావు, తదితరులతో నడ్డా సమావేశమయ్యారు. కాగా రఘునందన్, వివేక్, విజయశాంతి, తదితరులతో ఆయన విడివిడిగానూ మాట్లాడారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

నేతలు సమైక్యంగా లేరనే సంకేతాలు వెళుతున్నాయి..

విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రస్తుతం రాష్ట్ర పార్టీలో ఏర్పడిన గందరగోళ పరిస్థితులతో నాయకులు సమైక్యంగా లేరనే సంకేతాలు ప్రజల్లోకి వెళుతున్నాయని కొందరు నాయకులు నడ్డా వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్టీలో సమష్టి నిర్ణయాలు కొరవడ్డాయని, కొందరు ముఖ్య నేతలు ఏకపక్ష నిర్ణయాలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఒక నేత ఫిర్యాదు చేశారు. పలు సందర్భాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలను సంప్రదించకుండానే ముఖ్య నేతల భేటీలో నిర్ణయమంటూ ప్రకటనలు వెలువడుతున్నాయని చెప్పారు. తాము జాతీయ కార్యవర్గ సభ్యులుగా, మాజీ ఎంపీలుగా, ఉద్యమకారులుగా ఉన్నా తగిన ప్రాధాన్యత, గుర్తింపునివ్వడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. పార్టీకి నష్టం కలుగజేసేలా వ్యవహరిస్తున్న ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ ఒకరిద్దరు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రొ.నాగేశ్వర్ ఇంటికి ఎలా వెళతారు?

వామపక్ష భావజాలంతో నిత్యం మోదీ ప్రభుత్వాన్ని, బీజేపీని విమర్శించే ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ నివాసానికి మీరు వెళితే కార్యకర్తలకు ఎలాంటి సంకేతాలు వెళతాయని రఘునందన్‌రావు ప్రశ్నించినట్టు తెలిసింది. కేరళ సీఎం పినరయి విజయన్ వచ్చినపుడల్లా నాగేశ్వర్ ఎర్రచొక్కా ధరించి స్టేజీపై ఉంటారని, సందర్భం వచ్చినప్పుడల్లా మోదీ పాలనను ఎండగడుతుంటారని ఆయన చెప్పారు. మధ్యాహ్నం నాగేశ్వర్‌ను కలవడానికి ముందే అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పునరాలోచనలో పడిన నడ్డా..ఈ కార్యక్రమాన్ని ఎవరు డిసైడ్ చేశారంటూ కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, సంజయ్‌లను ప్రశ్నించినట్టు సమాచారం. కాగా నాగేశ్వర్ వైఖరిలో మార్పు వస్తున్నట్టు, కేంద్రంపై కొంత సానుకూలత ఉన్నట్టు కనిపిస్తోందని వారు సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అయితే ఇప్పటికే కలవాలని నిర్ణయించినందు వల్ల చివరి నిమిషంలో ఈ భేటీని రద్దు చేస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని నడ్డా అభిప్రాయపడినట్టు తెలిసింది. పార్టీకి సంబంధించి, ఇతర అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను, అసంతృప్తిని వ్యక్తం చేయగా..అన్నీ విన్న జాతీయ అధ్యక్షుడు ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా మౌనం వహించినట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ పాకెట్ మనీ

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు బీఆర్‌ఎస్ యత్నిస్తోందని బండి సంజయ్ అన్నారు. నోవాటెల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ బలహీనంగా ఉన్న 30 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వేల కోట్ల పాకెట్ మనీ ఇచ్చి సీఎం కేసీఆర్ పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పగటి కలలు కంటోందని, కానీ ప్రజలు ఆ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని అన్నారు.

ప్రొ.నాగేశ్వర్‌తో నడ్డా భేటీ

25 నిమిషాలు సాగిన సమావేశం



సాక్షి, హైదరాబాద్/గోల్కొండ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం మధ్యాహ్నం టోలిచౌకిలో మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ, ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌ను కలిశారు. బీజేపీ దేశవ్యాప్తంగా చేపడుతున్న 'సంపర్క్ సే సమర్థన్'లో భాగంగా ఈ భేటీ జరిగింది. షేక్‌పేట్ నాలా సమీపంలోని మాగ్నస్ అపార్ట్‌మెంట్‌లో నాగేశ్వర్ నివాసానికి వచ్చిన నడ్డా.. ఆయనతో 25 నిమిషాల పాటు సమావేశమయ్యారు. ఇరువురి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాగా మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, గతంతో పోల్చితే వివిధ రంగాల్లో రాబట్టిన మంచి ఫలితాలను తెలియజేసేలా తయారు చేసిన పుస్తకాలను నాగేశ్వర్‌కు నడ్డా అందజేశారు. తాను కొంత వామపక్ష భావజాలంతో ప్రభావితమైనా, వాస్తవాల ప్రాతిపదికన వివిధ రంగాల్లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషిస్తుంటానని నాగేశ్వర్ చెప్పినట్టు తెలిసింది. భేటీ అనంతరం నాగేశ్వర్ విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన, ఆయన సాధించిన విజయాలు, తదితర విషయాలపై తాము చర్చించామని చెప్పారు. మోదీ హయాంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందిందీ వంటి విషయాలను నడ్డా తనకు వివరించారని తెలిపారు.

అభివృద్ధి నమూనాతోనే మళ్లీ అధికారంలోకి..

- సీఎం కేసీఆర్ సమర్థ పాలనతో హ్యాట్రిక్ విజయం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్




సాక్షి, హైదరాబాద్: సమ్మిళిత, సమీకృత, సమతుల్యతతో కూడిన తెలంగాణ అభివృద్ధి నమూనానే రాష్ట్రంలో తమను వరుసగా మూడోసారి అధికారంలోకి తీసుకు వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ఢిల్లీలో జరిగిన రెండు రోజుల పర్యటన సందర్భంగా మంత్రి కేటీఆర్ వివిధ అంశాలపై బీఆర్‌ఎస్ వైఖరిని వెల్లడించారు. జాతీయ మీడియాతో తన అభిప్రాయాలను పంచుకుంటూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మాత్రమే సమర్థ పాలన అందిస్తారన్న విషయాన్ని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారం కోసం అర్రులు చాస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నా తెలంగాణతో పోటీ పడే నమూనా ఎక్కడా లేదన్నారు. గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లిన నేపథ్యంలో సుపరిపాలన నమూనాతో దక్షిణాది రాష్ట్రాల్లో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో 90 నుంచి వంద స్థానాలు సాధిస్తామన్నారు.

ఐటీ రంగంలో మేటి

తనవల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలను మంత్రి కేటీఆర్ ఖండించారు. ఐటీ రంగంలో గడిచిన రెండేళ్లలో హైదరాబాద్‌లో 4.50 లక్షల ఉద్యోగాల కల్పన జరగ్గా, బెంగళూరులో కేవలం 1.46 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. కేవలం హైదరాబాద్‌పైనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందనే విమర్శను ఖండిస్తూ.. రాష్ట్రంలో సాధించిన ప్రగతికి సంబంధించి కేంద్రం 126 అవార్డులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఐదు పట్టణాల్లో ఐటీ హబ్‌లు ఏర్పాటు చేశామని, సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ.2.41లక్షల కోట్లకు చేరాయని వివరించారు. తెలంగాణలో మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల కల్పన శరవేగంగా సాగుతోందని కేటీఆర్ అన్నారు.

సీఎం ప్రజలను కలవనక్కర్లేదా?

- కేటీఆర్ ట్వీట్‌పై సీపీఐ నేత సురవరం విస్మయం
- వైఎస్సార్, పీవీ వంటివారే ప్రజలను కలిశారని హితబోధ



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ప్రజలను కలవనక్కర్లేదని (ప్రజా దర్బార్), ప్రభుత్వ యంత్రాంగం పనిచేయకపోతేనే సీఎం కలవాలని అన్నట్లుగా కేటీఆర్ చేసిన ట్వీట్‌పై సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్‌రెడ్డి విస్మయం వ్యక్తంచేశారు. మన అధికార యంత్రాంగం శక్తివంతమైనదే కానీ అనేక సందర్భాల్లో అది నిరంకుశమైనదని వ్యాఖ్యానించారు. సమస్యలు పరిష్కారం కాకుండా చట్టం పేరుతో ఇబ్బంది కూడా పెడతారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రభుత్వ నిబంధనలు లోపభూయిష్టంగా ఉండి తీవ్రమైన అడ్డంకులు సృష్టిస్తాయని, అలాంటప్పుడు ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి? ఎవరు పరిష్కరిస్తారు? అని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ప్రతి ఉత్తరానికి సమాధానం రాసేవారని, పీవీ నరసింహారావు ప్రధానిగా రోజూ ఉదయం గంట, గంటన్నర ప్రజలకు కేటాయించేవారని, ప్రతిరోజు కొన్ని వందల మందిని కలిసేవారని గుర్తు చేశారు. వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ వంటి వారు ప్రజా ప్రతినిధులను, రాష్ట్రాల ప్రతినిధి వర్గాలను కలిసేవారన్నారు. ''దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా ప్రజలను కలిసేవారు. ఎన్టీఆర్ నగర్ స్థలం విషయంలో మేం ఊరేగింపుగా సీఎం వైఎస్‌ఆర్ ఇంటికి వెళ్ళాం. ముప్పై నలభై మందిని మాత్రం లోపలికి పంపించారు. ఆయన దరఖాస్తు తీసుకొని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు కబురు చేశారు. 'ఆ భూమిని నివాస స్థలాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, యజమానికి నష్ట పరిహారాన్ని, మిగిలిన భూమిని ఇవ్వవచ్చు. ఆయనకు నచ్చ చెప్పి రాజీ చేద్దాం'అని సమస్యను పరిష్కారం చేశారు''అని గుర్తు చేశారు. మంత్రులు, సీఎం పరిష్కారం చేయగలిగిన ఇలాంటి అనేక సమస్యలు ఉంటాయని, పీఎం లేక సీఎం ప్రజలను కలవకుండా, బహిరంగ సభల్లో మాట్లాడితే చాలనుకుంటే వారే ప్రజలనుంచి వేరు పడిపోతారని హితవు పలికారు.

కుర్చీ కదులుతుందనే ఢిల్లీలో కేటీఆర్ ప్రదక్షిణలు

- ఐటీదాడుల నేపథ్యంలోనే వెళ్లారన్న టీపీసీసీ చీఫ్ రేవంత్
- కాంగ్రెస్‌లో చేరిన మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు



సాక్షి, హైదరాబాద్: కుటుంబ కుర్చీ కదులుతుందనే భయంతోనే రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఢిల్లీ గల్లీల్లో ప్రదక్షిణలు చేశారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలపై ఆదాయ పన్ను శాఖ దాడుల నేపథ్యంలోనే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని, కంటోన్మెంట్ రోడ్ల కోసమో, మెట్రో రైలు కోసమో, రాష్ట్ర ప్రయోజనాల కోసమో కాదని ఆయన వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పలువురు ఆదివారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణకు పట్టిన గులాబీ చీడను వదిలించే ఏకైక ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనేనని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఎన్ని ప్రదక్షిణలు చేసినా రాష్ట్ర గల్లీల్లో కేసీఆర్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు. రూ.100 కోట్ల లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై విచారణ జరిపిస్తోన్న మోదీ.. లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్‌పై ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ–బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధమని, అది ఎవరో అనుకుంటే తెగిపోయేది కాదని స్పష్టం చేశారు. నడ్డా, అమిత్‌షాలను కలిసి వచ్చిన బీజేపీ నేతలు భ్రమల నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలన నుంచి తెలంగాణ విముక్తి కావాలంటే అందరూ కలిసి రావాలని కోరారు.

క్లుప్తంగా...

దళితబంధు కాదు.. ఎమ్మెల్యేల బంధు

● వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం ఎమ్మెల్యేల బంధులా మారిందని ఎన్నికల వేళ దళితుల పేరు చెప్పి ఎమ్మెల్యేలకు దోచిపెట్టే కుట్రకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెగబడ్డారని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలరెడ్డి ఆరోపించారు. దళితబంధు పథకం ద్వారా ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని సాక్ష్యాధారాలు బయటపెట్టినా వారిపై సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు శూన్యమని ఆదివారం ట్విట్టర్ వేదికగా ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గానికి 11 వందల మంది లబ్ధిదారుల ద్వారా ఒక్కో ఎమ్మెల్యే సగం మేర కమీషన్లు తిన్నా రూ.55 కోట్లు దండుకున్నట్లేనని...ఆ లెక్కన 100 నియోజక వర్గాల లెక్కలు కడితే రూ.5,500 కోట్లు వెనకేసుకోవచ్చని ఆరోపించారు. దళితబంధు పథకం ఎంపిక ప్రక్రియలో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని వెంటనే రద్దు చేసి గ్రామసభలో కలెక్టర్ ఆధ్వర్యంలోనే అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన దళితులకే పూర్తిస్థాయిలో పథకం ప్రయోజనం అందించాలని కోరారు.

ఎమర్జెన్సీలా బీఆర్ఎస్ పాలన

బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ



హన్మకొండ: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన ఇందిరాగాంధీ కాలం నాటి ఎమర్జెన్సీని తలపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ విమర్శించారు. ఆమె ఆదివారం హనుమకొండలో విలేకరులతో మాట్లాడుతూ నాడు.. అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వగా ఆమె 1975 జూన్ 25న దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని విధించారని గుర్తు చేశారు. ఎమర్జెన్సీలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిస్తున్న కాంగ్రెస్‌ను నాడు ప్రజలు ఓడించారని.. అదే నిరంకుశ పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నాడు ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, జనసంఘ్ పోరాడాయని పేర్కొన్నారు. తెలంగాణ సాధన పోరాటంలో అమరులైన ఎందరో త్యాగాల వల్ల అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఉద్యమకారులు, ప్రశ్నించేవారిని అరెస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు.

బీఆర్ఎస్‌తో పొత్తుపై వారంలో స్పష్టత: కూనంనేని



జహీరాబాద్ టౌన్: మునుగోడు ఎన్నికల సమయంలో వచ్చిన అవగాహన ప్రకారం బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుంద ని, వారం రోజుల్లోగా దీనిపై స్పష్టత వస్తుందని సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత ఇన్సాఫ్ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కుదుర్చుకున్న అవగాహన ప్రకారమే బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఒక్కో ఆయుధాన్ని తెచ్చి ఉపయోగిస్తోందని ఆరోపించారు. గతంలో కశ్మీర్ సమస్య, ట్రిపుల్ తలాఖ్ సమస్యలు తీసుకొచ్చారని, ఇప్పుడు కామన్ సివిల్ కోడ్ అంశం తీసుకొస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

తులసి చందు రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

సాక్షి, హైదరాబాద్: బీజేపీ విధానాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడుతున్న స్వతంత్ర జర్నలిస్టు తులసి చందుపై వేధింపులు, ట్రోలింగ్, ప్రాణహాని దాడుల బెదిరింపులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక తమ విధానాలను ప్రశ్నించే వ్యక్తులు, శక్తులపై దాడి చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. గతంలో సల్మాన్ రష్దీ, అరుంధతి రాయ్, తస్లీమా నస్రీన్ తదితరులపైన కొన్ని ముస్లిం ఉగ్రవాద సంస్థలు, ఇతర సంస్థలు ఫత్వా తదితర పద్ధతుల ద్వారా వారి ప్రాణాలు తీయడానికి పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. తులసి చందుకు ఎలాంటి హాని జరిగినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

'రెరా చైర్మన్‌ను అలా ఎలా నియమిస్తారు?'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్ రెరా) చైర్మన్‌గా తగిన అర్హతలు లేని వ్యక్తిని బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిందని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. రెరా చైర్మన్‌గా నియామకానికి రెరా చట్టం, 2016 నిర్దేశించిన నిబంధనల ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రెరా చట్టం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి లేదా కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి లేదా కేంద్ర ప్రభుత్వంలో ఏదైనా సమానమైన పదవిని కలిగి ఉంటే తప్ప చైర్‌పర్సన్‌గా నియమించరాదని ఉందన్నారు.వీటిని ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వంలో సంయుక్త కార్యదర్శిగా పని చేసిన అధికారిని టీఎస్ రెరా చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎలా నియమిస్తుందని ప్రశ్నించారు.


జేఈఈ రాకున్నా... ఐఐటీ చదువు

సాధారణంగా దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో చదవాలంటే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు కొట్టాల్సిందే. కానీ ఇక మీదట సాదాసీదా డిగ్రీ విద్యార్థులు కూడా ఐఐటీల్లో కోర్సులు పూర్తి చేయవచ్చు. జాతీయ స్థాయిలో ఈ తరహా కసరత్తు వేగంగా ముందుకెళ్తోంది. కోవిడ్ కాలంలో మొదలైన ఈ ఆలోచన ఇప్పుడు అనేక రూపాల్లో విద్యార్థులకు అందుబాటులోకి వస్తోంది. దేశంలో ఏటా లక్షల మంది ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉన్న సీట్లు 50 వేల లోపే. అందులోనూ ఐఐటీల్లో ఉన్నవి 16 వేలు మాత్రమే. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండే ఐఐటీల్లో ఏ కోర్సు చేసినా మంచి గుర్తింపు ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్లో అవసరమైన కొన్ని కోర్సులను ఐఐటీల ద్వారా సర్టిఫికెట్ కోర్సులుగా అందించాలని ఐఐటీలు కార్యాచరణ సిద్ధం చేశాయి.

- సాక్షి, హైదరాబాద్

నరికొత్త ఆన్‌లైన్, సర్టిఫికెట్ కోర్సులు

- ఐఐటీల ఉమ్మడి కార్యాచరణ
- డిగ్రీ విద్యార్థులకు చదువుకునే అవకాశం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకూ సరికొత్త విద్య
- ఈ ఏడాది నుంచి మరిన్ని కోర్సులు



కోవిడ్ కాలంలో..

కోవిడ్ సమయంలో విద్యార్థులు ఆన్‌లైన్ విద్యకు అలవాటు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కోర్సులను డిజైన్ చేసినట్లు ఐఐటీలు చెబుతున్నాయి. విద్యార్థులు కూడా ఈ కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని మద్రాస్ ఐఐటీ ఇటీవల తెలిపింది. ఈ సంస్థ ప్రతినిధులు వివిధ రాష్ట్రాలోని కాలేజీలకు వెళ్లి ఆన్‌లైన్ కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. మిగతా ఐఐటీలు సరికొత్త సర్టిఫికెట్ కోర్సులను తెరపైకి తెచ్చాయి.

ఇవీ కోర్సులు..

ఎంటెక్‌లో ఆన్‌లైన్ కోర్సులకు ఐఐటీ హైదరాబాద్ గతేడాది సమగ్ర ప్రణాళిక రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి మార్కెట్ డిమాండ్ కోర్సులను ఈ ఏడాది తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

మరికొన్ని ఐఐటీలు ఈ సంవత్సరం నుంచి మార్కెట్ వర్గాల డిమాండ్‌కు అనుగుణంగా ఎంటెక్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సులను తీసుకొస్తున్నాయి. 2020లో ఐఐటీ మద్రాస్ బీఎస్సీ డేటా సైన్స్ ప్రారంభించింది. ఇప్పటికే ఈ కోర్సులో 18 వేల మంది చేరినట్లు ఆ సంస్థ తెలిపింది. నాలుగేళ్ల బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ కోర్సును ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది.

ఐఐటీ బాంబే డిజిటల్ మార్కెటింగ్ అండ్ అప్లైడ్ అనలిటిక్స్, డిజైన్ థింకింగ్, మెషీన్ లెర్నింగ్ అండ్ ఏఐ విత్ పైథాన్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ అందిస్తున్నట్లు ప్రకటించింది.

పట్నా ఐఐటీ ఎంటెక్ ఇన్ బిగ్ డేటా అండ్ బ్లాక్‌చైన్, ఎంటెక్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సులను మరింత ఆధునీకరిస్తూ అందిస్తోంది. అయితే వాటిని ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు అందించాలని నిర్ణయించింది.

ఢిల్లీ ఐఐటీ కూడా జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న సర్టిఫికెట్ కోర్సులను అందించనుంది. ఇందులో సేల్స్ అండ్ మార్కెటింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఇన్ స్టార్టప్ బూట్‌క్యాంప్, న్యూ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ కోర్సులున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సులువు..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎప్పటికప్పుడూ నైపుణ్యానికి పదును పెట్టాల్సిందే. ఇలాంటి మళ్లీ వారు కాలేజీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే అంతర్జాతీయ ప్రమాణాలున్న ఐఐటీ సంస్థల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయవచ్చు. ఐఐటీ ద్వారా సర్టిఫికెట్ కోర్సు చేస్తే మంచి ఫ్యాకల్టీ ద్వారా పాఠాలు వినడమే కాకుండా ఆ సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లకు విలువ ఉంటుంది. మరింత మెరుగైన ఉపాధికి ఆస్కారం ఉండే వీలుంది.

ట్రెండ్ మంచిదే...



అమెరికాలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు ఇప్పుడు ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్నాయి. ఇదే బాటలో ఐఐటీలు మంచి కోర్సులు ఆఫర్ చేయడం మంచిదే. అయితే ఇవి కేవలం సర్టిఫికెట్ల జారీకే పరిమితం కాకూడదు. కోర్సు నేర్చుకొనే విద్యార్థులు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే అంతర్జాతీయంగా మంచి ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

-ప్రొ.శ్రీరాం వెంకటేష్ (ఓయూ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపల్)

కేసీఆర్ చేతిలో నలిగిపోతున్న రాష్ట్రం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- సూర్యాపేటకు వచ్చే నీళ్లు ఎక్కడివి?
- స్పష్టమైన సమాధానం చెప్పకుండా వంకర మాటలెందుకు?
- జగదీశ్‌రెడ్డి, గుత్తాలపై మండిపాటు



భట్టితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న జగ్గారెడ్డి

సూర్యాపేట: సీఎం కేసీఆర్ చేతిలో పడి రాష్ట్రం మొత్తం నలిగిపోతోందని.. ధరణి పేరుతో రాష్ట్రంలో నడుస్తున్న అతిపెద్ద ల్యాండ్ మాఫియా కారణంగా రైతులు భూములు కోల్పోతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తంచేశారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆదివారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ధరణి మాఫియా సూత్రధారి సోమేశ్ కుమార్, పాత్రధారి కేసీఆర్ అని ఆరోపించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను కొన్ని నిర్దిష్టమైన ప్రశ్నలు అడిగానని, అయితే వారు స్పష్టమైన సమాధానాలు చెప్పడం లేదని అన్నారు. 'మీరు నడిచే రోడ్డు.. పీల్చే గాలి మాదే' అంటూ వంకర మాటలు మాట్లాడుతున్నారని భట్టి దుయ్యబట్టారు. మరి సూర్యాపేటకు వచ్చే నీళ్లు ఎక్కడివని ఆయన ప్రశ్నించారు. 'నీళ్ల పండుగ పేరుతో ఎస్సారెస్పీ కాల్వల వద్ద మీరు చల్లుకునేవి కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటి వైఎస్సార్ కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్న నీళ్లో కాదో చెప్పాలి'అని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మాత్రమేనని.. అయితే అక్కడి నుంచి ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లిచ్చారా.. అన్నది చెప్పాలన్నారు. 'మంత్రులు చల్లుకుంటున్న నీళ్ల కాంగ్రెస్ తెచ్చినవి. మీ కారు వస్తున్న రోడ్డు మేము వేసిందే. ఇక్కడ వెలిగే కరెంటు. వంద రోజుల పని, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్య శ్రీ కార్డులు, సూర్యాపేటలో 5 వేల మంది పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్సే'అని భట్టి అన్నారు. కాగా, సూర్యాపేట జిల్లాలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్కకు సినీ నిర్మాత బండ్ల గణేశ్ మద్దతు తెలిపారు. యాత్రలో ఆయన భట్టిని కలిశారు. రానున్న 150 రోజుల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భూమిలేని పేదలకు 'కూలీబంధు': భట్టి

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు 'కూలీబంధు' పథకాన్ని ప్రవేశపెడతామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆదివారం రాత్రి సూర్యాపేటలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కింద పేదలకు ఏటా రూ.12,500 అందజేస్తామని తెలిపారు. తన పాదయాత్రలో రైతులు, రైతు కూలీల బాధలు విన్నానని, సింగరేణి బొగ్గుబాయిలో దిగితే కార్మికుల గోస కనపడిందన్నారు. పేదలకు భూములను పంచడంతోపాటు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారి బతుకులను బాగు చేస్తుందన్నారు.జనాభాలో 50 %ఉన్న బీసీలకు సబ్‌ప్లాన్ తీసుకొస్తామని చెప్పారు.

సామాన్యులు కేసులు పెడితే పట్టించుకోరా?

జానకీపురం సర్పంచ్ కురుసపల్లి నవ్య




ధర్మసాగర్: సామాన్యులు కేసులు పెడితే పోలీసులు పట్టించుకోవడం లేదని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కురుసపల్లి నవ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై ఆరోపణలతో కేసు పెట్టిన నవ్య... ఆదివారం తన భర్తతో వచ్చి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనపై వేధింపులు, బెదిరింపులకు సంబంధించి కొన్ని ఆధారాలు పోలీస్‌స్టేషన్‌లో అందజేశానని, పూర్తి ఆధారాలు కావాలని పోలీసులు అడిగారని చెప్పారు. అన్ని ఒకేసారి ఇవ్వలేనని, అడ్వకేట్ ద్వారా కోర్టులో సబ్మిట్ చేస్తామని చెప్పినట్టు వెల్లడించారు. మూడు రోజుల కిందట ఫిర్యాదు చేస్తే... ఇంతవరకు కేసు ఎందుకు నమోదు చేయరో చెప్పాలని పోలీసులను నిలదీశారు. సామాన్యులకు ఒక న్యాయం.. ఎమ్మెల్యేకు ఒక న్యాయమా అని మండిపడ్డారు. సర్పంచ్ నవ్య భర్త ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం వ్యక్తిగత విషయాలను సైతం పక్కన పెట్టానన్నారు. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రూ.25 లక్షలు సీడీఎఫ్ నిధులు ఇస్తామని చెప్పి, ఇవ్వలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే వచ్చి మళ్లీ క్షమాపణ చెబితే కేసును వాపసు తీసుకుంటారా అని విలేకరులు ప్రశ్నించగా.. గ్రామాభివృద్ధికి, వ్యక్తిగత కేసులకు సంబంధం లేదని, తక్షణమే ఎమ్మెల్యే ఇస్తానన్న రూ. 25 లక్షల నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐ ఒంటేరు రమేశ్‌ను వివరణ కోరగా.. కురుసపల్లి నవ్య మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారని, ఆధారాలు మాత్రం ఇవ్వలేదని, ఆధారాలు లేనిదే కేసు నమోదు చేయలేమని చెప్పారు.

10 లక్షల జనాభాకు ఓ మెడికల్ కాలేజీ

కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుపై ఎన్ఎంసీ ముసాయిదా మార్గదర్శకాలు

- 50–100–150 సీట్ల వరకే అనుమతి
- గ్రామీణ ప్రాంత ఆసుపత్రులతో అనుసంధానం తప్పనిసరి
- అధ్యాపకులకు ఆధార్ ఆధారిత హాజరు ఉండాలి
- వచ్చే వైద్య విద్యా సంవత్సరం నుంచి అమలు



సాక్షి, హైదరాబాద్: 10 లక్షల జనాభా కలిగిన ప్రాంతంలో కొత్త మెడికల్ కాలేజీ స్థాపన కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఆ ప్రాంతంలో ఎలాంటి మెడికల్ కాలేజీ ఉనికిలో ఉండకూడదని పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీ స్థాపన నిబంధనలు, ఎంబీబీఎస్‌లో సీట్ల పెంపుదలకు సంబంధించి ఎన్ఎంసీ తాజాగా ముసాయిదా మార్గదర్శకాలు జారీచేసింది. 2024–25 వైద్య విద్యా సంవత్సరం నుంచి ఇవి అమలులోకి వస్తాయని పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీలకు 50/100/150 సీట్ల వరకే అనుమతి ఇస్తామని, అంతకంటే ఎక్కువ సీట్లు కేటాయించబోమని పేర్కొంది. అయితే గతంలోనే అధిక సీట్ల కోసం (150కు మించి) దరఖాస్తు చేసుకుంటే దాన్ని పరిగణలోకి తీసుకుంటామంది. కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న కాలేజీలకు మాత్రమే ఎంబీబీఎస్ అడ్మిషన్లు కొనసాగించడానికి అర్హత కలిగి ఉంటాయని పేర్కొంది.

గ్రామీణ ప్రాంత ఆసుపత్రులతో అనుసంధానం

కొత్తగా అనుమతి తీసుకునే మెడికల్ కాలేజీకి అనుబంధంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రాలు/ కమ్యూనిటీ హెల్త్/ అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండాలి. ఒక్కో కేంద్రానికి 15 మంది విద్యార్థులను ఇంటర్న్‌గా పంపేలా ఉండాలి. ఈ కేంద్రాలు మెడికల్ కాలేజీ యాజమాన్యంలో లేదా ప్రభుత్వంలోని ఆరోగ్య కేంద్రానికి చెందినవిగా ఉండాలి. నగరాల్లో మినహా ఈ ఆరోగ్య కేంద్రాలు 30 కిలోమీటర్ల దూరంలో ఉండాలి. అల్పాహారం, సాంస్కృతిక కార్యకలాపాలు, యోగా శిక్షణ, ఇండోర్ గేమ్స్, కౌన్సెలింగ్ సదుపాయాలు ఉండాలి.

బయోమెట్రిక్ హాజరు

మెడికల్ కాలేజీల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీ సూచించింది. దీని పరిధిలోకి అధ్యాపకులు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు వస్తారు. హాజరును సరిగా పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి. అన్ని కాలేజీల బయోమెట్రిక్ మెషీన్లను ఎన్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కి అనుసంధానం చేయాలి. ప్రతీ మెడికల్ కాలేజీ సీసీటీవీ వ్యవస్థ కలిగి ఉండాలి. అధునాతన సౌకర్యాలతో కూడిన లైబ్రరీ ఉండాలి.

కొత్త మార్గదర్శకాలివీ..

- 30 ఏళ్లపాటు లీజుకు తీసుకున్న స్థలమైతే అందులో భవన నిర్మాణాలు చేపట్టాలి.
- కాలేజీ, బోధనాసుపత్రులకు వేర్వేరు భవనాలు ఉన్నట్లయితే వాటి మధ్య దూరం గరిష్టంగా 30 నిమిషాల్లో చేరేలా ఉండాలి.
- ఆసుపత్రిలో కనీసం 220 పడకలుండాలి.
- ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసే కాలేజీలో తప్పనిసరిగా అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, సైకియాట్రీ, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, నేత్ర వైద్యం, గైనకాలజీ, అనస్థీషియాలజీ, డెంటిస్ట్రీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, అత్యవసర వైద్యం, ఇంటిగ్రేటివ్ మెడికల్ రీసెర్చ్ విభాగాలు తప్పనిసరిగా ఉండాలి.

తప్పే జరిగింది.. భూమి మున్సిపాలిటీకి రాసిస్తా

● ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కూతురు తుల్జాభవానీరెడ్డి



ప్రహరీని ధ్వంసం చేస్తున్న తుల్జాభవానీరెడ్డి

చేర్యాల (సిద్దిపేట): తన తండ్రి తప్పు చేశారని, ఊరు భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేశాడని, ఆ భూమి చేర్యాల మున్సిపాలిటీ, ఆసుపత్రికి రాసిస్తానని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూతురు తుల్జాభవానీరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి వద్ద సర్వే నెంబర్ 1402లో తన పేర ఉన్న 1,270 గజాల స్థలం వద్దకు వచ్చిన ఆమె.. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీని ధ్వంసం చేశారు. అనంతరం ఆ స్థలంలో 'నా తండ్రి ఊరి భూమి కబ్జా చేసి నా పేరున రిజిస్ట్రేషన్ చేసినందుకు నేను చేర్యాల ప్రజలను క్షమించమని అడుగుతున్నాను. నా తండ్రి నా పేరున పెట్టిన యావదాస్తి చేర్యాల మున్సిపాలిటీకి, చేర్యాల హాస్పిటల్‌కి రిజిస్ట్రేషన్ చేస్తున్నాను'అని నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి వద్ద ఉన్న ఊరి స్థలాన్ని మా నాన్న నా పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అది తప్పు.. అందుకు చేర్యాల ప్రజలకు క్షమాపణ చెబుతున్నాను. ఆ స్థలం విషయంలో ఇకపై ఎలాంటి సమస్యలు రాకుండా కోర్టు ద్వారా మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసి కలెక్టర్‌కి పత్రాలు అందిస్తా'అని తెలిపారు. కాగా, ఆ స్థలం మీ పేర రిజిస్ట్రేషన్ అయ్యి మూడేళ్లు గడిచిన తర్వాత వచ్చి తప్పు జరిగిందంటున్నారు.. ఇన్ని రోజులు ఎందుకు స్పందించలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు తుల్జాభవానీరెడ్డి సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు.

అది పట్టా భూమి.. కూతురు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా..

పెద్ద చెరువు మత్తడి స్థలం కబ్జా చేశాననడం అవాస్తవమని, అది పట్టా భూమి అని గతంలో రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. ఆదివారం తన కూతురు పట్టణ కేంద్రానికి వచ్చి ఆ భూమి మున్సిపాలిటీకి రాసిస్తానని చెప్పడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. పెద్ద చెరువు మత్తడి నీరు పట్టణ కేంద్రంలోకి వచ్చి వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో ఆ భూమిని కొనుగోలు చేశానని చెప్పారు. కొంత భూమిని కాల్వకు అప్పగించి, మిగతా భూమిని తన కూతురు, మరో ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన మాట వాస్తవం అని అన్నారు. దీనిపై గతంలోనే కొందరు కబ్జా అని ఆరోపిస్తే రెవెన్యూ అధికారులు పట్టా భూమి అని ధ్రువీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏది ఏమైనా తన కూతురు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని, తనను రాజకీయంగా ఎదుర్కోలేని కొందరు కూతురును అడ్డుపెట్టుకుని కుట్రలు చేస్తున్నారని చెప్పారు. కుట్రలను ప్రజలు గమనించాలని కోరారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్ల యుద్ధం

- పేదలకు న్యాయం చేసేందుకు కొత్త రాజకీయపార్టీ
- ప్రజా గాయకుడు గద్దర్ అలియాస్ విఠల్‌రావు
- అల్వాల్ వెంకటాపురంలో 'గద్దర్ ప్రజా పార్టీ'ఆవిర్భావ మేధోమథన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గద్దర్

అల్వాల్: ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్ల యుద్ధంతో చివరి పేదవారికీ న్యాయం జరిగేలా చేద్దామని ప్రజా గాయకుడు గద్దర్ చెప్పారు. అల్వాల్‌లోని వెంకటాపురంలో ఉన్న మహాబోధి విద్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన గద్దర్ ప్రజా పార్టీ ఆవిర్భావ మేధోమథన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గద్దర్.. ప్రజా సంఘాలతో కలిసి తన పోరాటం, కవిగా, రచయితగా తన అనుభవాలను పంచుకున్నారు. 1967–70 దశకంలో సుభాష్‌నగర్‌లో ఏర్పాటు అయిన జననాట్యమండలి అనతికాలంలోనే విస్తరించి పేదల ఆత్మగౌరవ పోరాటాలకు పునాది వేసిందన్నారు. ఆ ప్రజాపోరాటాల్లో అల్వాల్ ప్రాంతంలోని సుభాష్‌నగర్, యాప్రాల్, కౌకూర్, మచ్చబొల్లారం, బొల్లారం, దేవరయంజాల్ యువత ముఖ్య భూమిక పోషించారని, 42 మంది సహచరుల్లో ఇద్దరం మాత్రమే మిగిలామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీ అవసరమని గుర్తించి గద్దర్ అభిమాన సంఘం అభ్యర్థన మేరకు గద్దర్ ప్రజా పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

విద్య, వైద్యం, ఉపాధి, న్యాయం ప్రధాన అంశాలుగా..

అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, అర్హులైన అందరికీ ఉపాధి అవకాశాలు, సత్వర న్యాయం, ప్రజల వెన్నంటే ఉండటం వంటి ఐదు ప్రధాన అంశాలే ఎజెండగా ముందుకు వెళ్తున్నామని గద్దర్ వివరించారు. రాజకీయ పార్టీకి మద్దతుకోసం తానే స్వయంగా ప్రజల వద్దకు వెళ్తానని చెప్పారు. ప్రజల నుంచే సూచనలు, సలహాలు తీసుకొని దానికి అనుగుణంగా నడుచుకుంటామని వివరించారు. పేద వర్గాలకు న్యాయం చేయడం కోసమే గద్దర్ ప్రజాపార్టీ ఏర్పాటును ప్రతిపాదించామని గద్దర్ అభిమాన సంఘం అధ్యక్షులు సీఎల్ యాదగిరి తెలిపారు. గద్దర్ ప్రజా పార్టీకి అధ్యక్షుడిగా గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్, ఉపాధ్యక్షుడిగా జి.రాజయ్య, ప్రధానకార్యదర్శిగా నాగేష్, సంయుక్త కార్యదర్శిగా యాదులయ్య, కోశాధికారిగా విమల గద్దర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

ఆయుష్‌ను బలోపేతం చేస్తాం





ఆదివారం సిద్దిపేటలో కోమటి చెరువు వద్ద మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట వైద్య కళాశాలకు అనుబంధంగా ఆయుర్వేద ఆసుపత్రి

సిద్దిపేటజోన్: ప్రభుత్వం ఆయుష్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, ఆయుర్వేద వైద్య సేవలను మరింతగా విస్తృతం చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉండేలా చూస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీసు కన్వెన్షన్ హాల్‌లో ఆయుష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంతోపాటు పలు ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఆయుర్వేద వైద్యాన్ని నిర్లక్ష్యం చేశాయని అన్నారు. గతంలో కేవలం 400 మంది వైద్యులను నియమిస్తే, తెలంగాణ ప్రభుత్వం ఒకేసారి 1,200 మందిని నియమించిందని పేర్కొన్నారు.

జీవనధార మాకు జీవం అయింది..

ఆయుష్ ఆధ్వర్యంలో కరోనా సమయంలో తయారుచేసిన జీవనధార ఔషధం తమకు జీవం అయిందని, సీఎం కేసీఆర్‌తోపాటు తానుకూడా జీవనధార మందును కరోనా సమయంలో నిత్యం వాడానని హరీశ్‌రావు తెలిపారు. ఆయుర్వేద వైద్య సేవలను మరింతగా విస్తరించడానికి త్వరలో సిద్దిపేట, భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఆసుపత్రులను ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. అలాగే సిద్దిపేట మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిందాల్ ప్రకృతి చికిత్సాలయం తరహాలో వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్‌లో ఔషధమొక్కలతో ఆయుర్వేద ఔషధాలను తయారు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ విద్యార్థులకు అన్యాయం

రాష్ట్రవ్యాప్తంగా పల్లె దవాఖానాల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి హరీశ్ చెప్పారు. ఇందులో భాగంగా రెండు వేల పల్లె దవాఖానాల నిర్మాణం కోసం అనుమతులు ఇచ్చినట్టు వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో జరిగిన ఒప్పందం వల్ల తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇక్కడి మెడికల్ కళాశాలల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఉమ్మడి ఒప్పందం ద్వారా అడ్మిషన్లు తీసుకుంటున్నారని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన 21 మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు కేవలం తెలంగాణ విద్యార్థులకు ఉండేలా జీఓ తెస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఒకప్పటి జర్నలిజానికి, ఇప్పటి జర్నలిజానికి చాలా తేడా ఉందని మంత్రి అన్నారు. తెలంగాణ దళిత జర్నలిస్టులకు దళితబంధు ఇస్తామని చెప్పారు.

కోమటి చెరువు సూపర్

హరీశ్‌కు సహచర మంత్రుల అభినందన

సిద్దిపేటజోన్: సిద్దిపేట కోమటి చెరువు చాలా బాగుందని.. సహచర మంత్రి హరీశ్ రావు చిత్తశుద్ధి, పట్టుదలకు ఇది నిదర్శనమని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కితాబిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గ్యాదరి కిషోర్, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్ పర్యటించారు. ఈ సందర్భంగా వారంతా కోమటి చెరువును సందర్శించారు. తీగల వంతెన, నెక్లెస్ రోడ్, గ్లో గార్డెన్, సింథటిక్ ట్రాక్‌ను తిలకించారు. వారికి మంత్రి హరీశ్ రావు అభివృద్ధి పనుల గురించి వివరించారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం తదితరులు ఉన్నారు.



ఇచ్చిపుచ్చుకోవడం లేనిదే అది ప్రేమా కాదు.
స్నేహమూ అవదు.
– ప్లేటో

సాక్షి

సోమవారం, 26 జూన్ 2023

‘స్వేచ్ఛ’యను రెండక్షరములు...

‘స్వేచ్ఛ’ అంటే కేవలం రెండక్షరాలు కాదు, దిగంతాలను కొలిచే పక్షికి రెండు రెక్కలు; భూమండలాన్ని చుట్టే మనిషికి రెండు పాదాలు; స్వేచ్ఛ అంటే ఒక నిర్నిబంధమైన మాట; ఒక స్వతంత్రమైన చేత. హద్దులేని ఆకాశమూ, అంతులేని భూమండలమూ స్వేచ్ఛాసంచారానికి ప్రకృతి చేసిన ఏర్పాట్లు. ప్రకృతి నిఘంటువులో మొదటి మాటా, చివరి మాటా స్వేచ్ఛే! ఎగిరే పక్షిని ఏ వేటగాడి బాణమో పడగొట్టినప్పుడూ, నడిచే మనిషి కాళ్ళకు ఏ నిరంకుశపు సంకెళ్ళో పడినప్పుడూ, ఏ నిషేధాల కత్తుల బోనులోనో మాట బందీ అయినప్పుడూ అది అక్షరాలా ప్రకృతి మీద జులుము, ప్రకృతి ఏర్పాటు మీద దాడి. స్వేచ్ఛ రెక్క విరిచిన రోజు వచ్చి వెడుతూ, దాని విలువను మరోసారి గుచ్చి చెప్పింది.

చెరబడ్డప్పుడు తప్ప సాధారణ పరిస్థితుల్లో పూర్తిగా గుర్తించలేని విలువ స్వేచ్ఛ. అడవుల పాలైన ధర్మరాజుకు ఆ విలువ తెలుసు. మనిషికి ఆనందమిచ్చేది ఏదని యక్షుడు అడిగినప్పుడు ప్రవాసంలో కాకుండా స్వవాసంలో ఉండడమేనంటాడు. పరాయి పాలనలో వ్యథార్త జీవితాలు గడిపిన నిన్నమొన్నటి మన స్వాతంత్ర్య సమరయోధులకు, ఇతర బుద్ధిజీవులకే కాదు; సామాన్య జనానికి సైతం స్వేచ్ఛ విలువ తెలుసు. ‘స్వేచ్ఛ మన ఊపిరి’ అంటాడు మహాత్మాగాంధీ. ఊపిరి నిలుపుకోవడానికి ఎంత మూల్యమైనా చెల్లించవలసిందే. ‘ఎక్కడ మనసు నిర్భయమవుతుందో, ఎక్కడ తలెత్తుకుని ఉండగలమో, ఎక్కడ జ్ఞానం శృంఖలాబద్ధం కాదో, ఎక్కడ సంకుచితపు గోడలతో ప్రపంచం ముక్కముక్కలు కాదో, ఎక్కడ మాట సత్యపు లోతుల్లోంచి జాలువారుతుందో, ఎక్కడ శ్రమించే చేతులు పరిపూర్ణత వైపు బారలు చాచగలవో, ఎక్కడ హేతుత్వమనే స్వచ్ఛ ప్రవంతి దారి తప్పకుండా ఉంటుందో...’ అలాంటి స్వేచ్ఛాయుత ప్రపంచం కోసం విశ్వకవి టాగోర్ పరితపిస్తాడు. మానసిక స్వేచ్ఛనే నిజమైన స్వేచ్ఛగా బాబా సాహెబ్ అంబేడ్కర్ అభివర్ణిస్తాడు. సంకెళ్లలో లేకపోయినా స్వేచ్ఛాయుత చింతన లేనివాడు బానిసే తప్ప స్వతంత్రజీవి కాడనీ, జీవన్మృతుడనీ అంటాడు.

‘మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి, కానీ ప్రతిచోటా సంకెళ్ళలో చిక్కుకున్నా’డన్న రూసో నిర్వచనం ఎంతైనా నిజం. స్వేచ్ఛా, మనిషీ కలిసే పుట్టారు. ఆధిపత్యాలు, అంకుశాలు, అణచివేతలు తర్వాత వచ్చాయి. దేశాల హద్దులూ, వీసాల నిర్బంధాలూ లేని కాలంలో మనిషి స్వేచ్ఛగా భూమండలమంతా కలయదిరిగాడు. అందుకే ప్రపంచంలోని ప్రతి తావూ అతని చిరునామా అయింది. సంస్కృతీ, నాగరికతలను సంతరించుకున్న తర్వాతా; భాషాభేదాలూ, ప్రాంతాల తేడాలూ, జాతీయతా వాదాలూ పొటమరించిన తర్వాతా అతని స్వేచ్ఛాగమనానికి అడ్డుగోడలు లేచాయి. అదొక విచిత్ర వైరుధ్యం. వేల సంవత్సరాల క్రితం జరిగిన జన్యుపరివర్తన కారణంగా గొంతుముడి వీడి మనిషి మాట్లాడగలిగిన దశకు చేరాడంటారు. అప్పుడు తన ఆనందోద్వేగాలను ఎంత స్వేచ్ఛగా గొంతెత్తి ప్రకటించుకుని ఉంటాడో! క్రమంగా తన మాటను రకరకాల నిషేధాలూ, నిర్బంధాల కత్తివేటూ భయపెట్టినప్పుడు స్వేచ్ఛనుడిగి మూగవోయిన దుఃఖచరిత్ర అతనిది.

పురాణకాలం నుంచి నవీనకాలం వరకూ ఏ ఘట్టంలోనూ స్వేచ్ఛారాహిత్యంతో రాజీపడని ధిక్కారచరిత్రా అతనికుంది. తన సహజస్వేచ్ఛపై అత్యాచారం శ్రుతిమించిన ప్రతిసారీ అగ్గిరవ్వ అయ్యాడు. చండశాసనం ఉన్నచోట దాని అతిక్రమణా ఉండితీరుతుందనడానికి రామాయణమే సాక్ష్యం. హనుమంతుడు సీతను చూసొచ్చిన తర్వాత సంబరం పట్టలేకపోయిన వానర సమూహం కిష్కింధలోని మధువనంలోకి జొరబడి అక్కడి తేనెతో విందు చేసుకుని, మత్తిల్లి వనాన్ని ధ్వంసం చేస్తారు. ఆ క్షణంలో వారిలో పురివిప్పిన స్వేచ్ఛాసహజాతం చండశాసనుడైన తమ ఏలిక సుగ్రీవుడు దండిస్తాడన్న భయాన్ని కూడా జయించింది.

పీడనకూ, పెత్తనానికీ గురవుతున్నాసరే తమ సహజసిద్ధమైన స్వేచ్ఛాదాహాన్ని తీర్చుకునేందుకు మనిషి అవకాశాలు వెతుక్కుంటూనే ఉంటాడు. ఆ మేరకు పెత్తందార్లకూ, పీడితులకూ మధ్య రాజీ ఏర్పాట్లు కూడా ఉండేవి. ఈ సందర్భంలో ప్రసిద్ధ పాత్రికేయుడు, రచయిత రాంభట్ల కృష్ణమూర్తి తన ‘సొంతకథ’లో ‘వాలకం’ అనే ప్రదర్శన రూపాన్ని ప్రస్తావిస్తారు. గౌరమ్మ సంబరాలప్పుడు కొంతమంది గ్రామస్తులు ఊళ్ళోని మోతుబరుల వేషంకట్టి వారి నడకను, నడవడిని అనుకరిస్తూ పాటల రూపంలో వారిపై ఆక్షేపణను చాటుకోవడమే ‘వాలకం’. ఒక్కోసారి ఆగ్రహించి మోతుబరులు దేహశుద్ధి చేయడం గురించీ ఆయన రాస్తారు. ఈ శతాబ్ది ప్రారంభంలో ఇలాంటి ప్రదర్శన అమెరికాలోనూ ఉండేదనీ, దానిని వాడెవిల్ అంటారనీ, చార్లీ చాప్లిన్ ఇందులో ప్రసిద్ధుడనీ ఆయన అంటారు. పురాతన సుమేరు సమాజంలో జనం ఎలాంటి నిర్బంధాలూ, నిబంధనలూ లేని స్వేచ్ఛను అనుభవించడానికి ఏటా వారం రోజులు కేటాయించేవారు.

అలాగని స్వేచ్ఛ అంటే ఎలాంటి అదుపాజ్ఞలూ లేని ఇచ్ఛావిహారం కాదు. సమష్టి శ్రేయస్సు కోసం స్వీయ నియంత్రణలో ఉంచుకోవలసిన బాధ్యత కూడా! పాలకులు, పాలితుల వ్యవహరణలో ఎక్కడ తూకం తప్పినా దెబ్బతగిలేది స్వేచ్ఛకే! నిరంతర అప్రమత్తతే స్వేచ్ఛకు చెల్లించే మూల్యం.

అందుకే ఎప్పటికీ ఆయన ‘గురు’

కామెంట్



కరణ్ థాపర్

1960లలో డూన్ స్కూలు అసమాన ప్రతిభ కలిగిన తన విద్యార్థుల కంటే, ఆ విద్యార్థులలోని క్రీడాకారులకే ఎక్కువ విలువ ఇచ్చింది. ఒక్కసారైనా క్రికెట్ బ్యాట్‌ను ఊపని, ఫుట్‌బాల్‌ను లాగిపెట్టి తన్నని విద్యార్థికి ప్రాముఖ్యం దక్కక పోవడం స్పష్టంగా కనిపించేది. ఇందుకు భిన్నంగా 99 ఏళ్ల వయసులో కన్నుమూసిన ‘గురు’ క్రీడాప్రతిభల కంటే కళాత్మక నైపుణ్యాలు గొప్పవనే భావనను విద్యార్థులలో కలిగించడానికి అనేక మార్గాలను కనిపెడుతుండేవారు. విద్యార్థులు ఆయన వద్ద పాఠ్యాంశంగా చదివిన సబ్జెక్టు భౌగోళిక శాస్త్రమే అయినప్పటికీ, వారు నేర్చుకున్న కొన్ని అత్యుత్తమమైన జీవిత పాఠాలు ఆయన బోధించినవే. ఇలా చేయమని గురు ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదు. అయితే ఆయనొక ఉదాహరణగా కనిపించేవారు.

మేము ఆయన్ని ‘గురు’ అని పిలుచుకోవడం ఆపేక్షతోనే అయినప్పటికీ నిజానికి ఆయనకు అదే కచ్చితమైన మాట. విశ్వగురు అనడం ఫ్యాషన్ ఈ రోజుల్లో. కానీ ఆయన నిజమైన, అంకితభావం కలిగిన, శ్రద్ధాబద్ధుడైన ఉపాధ్యాయుడు. కావాలంటే మీరు ఆయన్ని భారతీయ ‘మిస్టర్ చిప్స్’ అనుకోవచ్చు. డూన్ స్కూల్ అబ్బాయిలకు ‘గురు’ అనే పేరుతోనే గురుదయాళ్ సింగ్ తెలుసు. గురు అన్నది ఆయన పేరుకు సముచితమైన నామకరణ. గత నెలలో ఆయన కన్ను మూసినప్పుడు కూడా అదే పేరుతో మాకు స్మరణీయం అయ్యారు.

నేను గురును మొదటిసారి కలిసినప్పుడు నా వయసు పదేళ్లు. జైపూర్ హౌస్ ‘హౌస్ మాస్టర్’ ఆయన. పొడవాటి మనిషి. నా వయసుకు ఇంకా పొడవుగా, భారీగా కనిపించారు. అయితే ఆయన చిరునవ్వుతో నా భయాలు, ఆందోళనలు అన్నీ తుడిచిపెట్టుకు పోయాయి. ఆయన నవ్వినప్పుడు నేనూ పెద్దపెట్టున నవ్వాను. నవ్వును ఆపుకోలేకపోయాను.

ఆయన వద్ద పాఠ్యాంశంగా నేను చదివిన సబ్జెక్టు భౌగోళిక శాస్త్రమే అయినప్పటికీ, నేను నేర్చుకున్న కొన్ని అత్యుత్తమమైన జీవిత పాఠాలు సైతం ఆయన బోధించినవే. ఆ కొన్నింటిలో మొదటిది అతి కష్టమైనది మాత్రమే కాకుండా, అసలు నేనేమిటన్న దాన్ని నాకు బహిర్గతం చేసినది కూడా!

1960లలో డూన్ స్కూలు అసమాన ప్రతిభ కలిగిన తన విద్యార్థుల కంటే, ఆ విద్యార్థులలోని క్రీడాకారులకే ఎక్కువ విలువ ఇచ్చింది. దీనర్థం ఒక్కసారైనా క్రికెట్ బ్యాట్‌ను ఊపని, ఫుట్‌బాల్‌ను లాగిపెట్టి తన్నని విద్యార్థికి ప్రాముఖ్యం దక్కక పోవడం అన్నది స్పష్టంగా కనిపించేదని! నేను నటనలో, వాదోపవాద చర్చలలో ముందుండే వాడిని. అలాగే, ఆఖరు నిమిషంలో చదివి మార్కుల్ని అదరగొట్టేయడంలో కూడా. కానీ నేను ఆటల్లో లేకపోవడం వల్ల నాలోని ఈ నైపుణ్యాలు చిన్నచూపునకు గురయ్యేవి.

అయితే గురు, క్రీడా ప్రతిభల కంటే కళాత్మక నైపుణ్యాలు గొప్పవనే భావనను నాలో కలిగించడానికి అనేక మార్గాలను కనిపెడుతుండేవారు. నేను పాల్గొన్న చర్చల్లోని నా తెలివైన మాటల్ని గుర్తు చేసుకునేవారు. అదొక ప్రశంసలా ఉండేది నాకు. లేదా చర్చావేదిక మీద అలా స్తంభించిపోయిన నా భంగిమ గురించి మాట్లాడుతూ నవ్వేసేవారు. పైకి అది సున్నితమైన ఎగతాళిగా ఉన్నప్పటికీ నిన్ను నేను శ్రద్ధగా గమనిస్తున్నాను సుమా అనే ఒక అంతర్లీనత కూడా ఆయనలో వ్యక్తం అయి, నేనొక ప్రత్యేకమైన వ్యక్తినన్న భావన నాలో కలిగించేది. జూనియర్స్ క్రికెట్‌లో నేను అత్యుత్తమంగా ఆడినప్పటికీ ఆయన ఉద్దేశం ప్రకారం నా చివరి ఏడాదిలో నేను ‘హౌస్ కెప్టెన్’ అవడానికి తగిన కారణం మాత్రం నాలోని ఆ కళాత్మక నైపుణ్యాలే! ఎందుకంటే, క్రికెట్ గ్రౌండ్‌లో నేనొక్కడినే ఉన్న వైపు నేరుగా వచ్చి నా చేతుల్లో పడిన బంతిని కూడా నేను క్యాచ్ పట్టలేకపోయాను.



గురుదయాళ్ సింగ్

ఆ విధంగా గురు, డూన్ స్కూల్ తానుగా ఎప్పటికీ నాకు అందించని విశ్వాసాన్ని నాలో కలిగించారు. నాలోని ప్రతిభ, నైపుణ్యాలతో సమానంగా, నా పరిమితుల్నీ నేను గుర్తించేలా; నా అపజయాల్ని, వైఫల్యాలను, తప్పుల్ని నేను ఎదుర్కొనేలా నేను ఎదగడానికి గురు తోడ్పడ్డారు. పడిపోతే పైకి లేచి, ముందుకు సాగిపోవడం ఎలాగో నేర్పించారు. అది నాకు ముఖ్యమైన పాఠం. ఎందుకంటే జీవితంలో తరచు నేను పొరపాట్లు చేసి పడిపోతుంటాను.

ఏళ్ల తర్వాత నేను పెద్దవాడిని అయినప్పుడు గురు నాకు చెప్పిన మరొక పాఠాన్ని గుర్తుకు చేసుకున్నాను. తప్పు చేసిన వారిని శిక్షించడం అన్నదొక్కటి మాత్రమే ఉత్తమ మార్గం కాదు. తప్పును మన్నించడం అన్నది ఉత్తమమైన మార్గం అయ్యే సందర్భాలు కూడా ఉంటాయి అంటారు గురు. గురు స్వయంగా ఈ సూత్రాన్ని పాటించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొండితనాన్ని, అబద్ధాలను, ఉద్దేశపూర్వకమైన తెలివితక్కువ వేషాలను ఆయన భరించారు. నా తప్పులన్నీ ఆయనకు తెలుసు. అయినా ఆ తప్పుల్ని పోనిచ్చేవారు. అయితే ఆయన ముఖభావాలను బట్టి, నేను మరికొంత మెరుగ్గా ఉండాలని ఆయన ఆశిస్తున్నట్లు గ్రహించేవాడిని. ఏమీ తెలియని టీనేజ్‌లో ఉన్నప్పటికీ ఆ గ్రహింపు నాకు బాధను కలిగించేది. గురు దృష్టిలో గొప్పగా ఉండటం కన్నా నాకు వేరేదీ అక్కర్లేకపోయేది. అందుకే ఆయన అనిష్టత నా మనసును పిండేసినట్లుగా ఉండేది. ఆ మాత్రం శిక్ష సరిపోతుందని గురుకు తెలుసు.

ఇతరులు తప్పు చేసినప్పుడు నేను ఈ పాఠాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. కానీ అదంత తేలికగా ఉండదు. అందుకు వివేకం, నిగ్రహం రెండూ కావాలి. గురుకు ఆ రెండూ ఉన్నాయి. నాకు తరచు అవి రెండూ ఉండవు. నేను సరిగా నేర్చుకోని ఒక పాఠం ఇది.

మూడవ పాఠం, నేనింకా సాధన చేస్తూనే ఉన్నానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. అది సులభమైనది. కొద్దిపాటి మర్యాదల పాటింపుతో స్పష్టమైన వ్యత్యాసాలను మీరు చూపగలుగుతారు. గదిలోకి ప్రవేశించగానే అక్కడ ఉన్న అందరినీ పలకరించండి. ‘దయచేసి’, ‘ధన్యవాదాలు’ అని చెప్పడాన్ని ఎప్పుడూ విస్మరించకండి.

ఇలా చేయమని గురు స్పష్టంగా నాకెప్పుడైనా చెప్పి ఉంటారని నేను అనుకోను. అయితే ఆయనొక ఉదాహరణగా ఎల్లవేళలా ప్రతి ఒక్కరికీ కనిపించేలా ఉంటారు. జాగ్రత్తగా గమనించవలసింది ఆయన పెంపొందించిన సత్ప్రవర్తన, ఆయన పట్ల మనలో ఉన్న గౌరవ భావన ఆయన్ని మనం అనుకరించేలా చేస్తాయన్నది. ప్రత్యక్షంగా ఆయన ప్రబోధించని విలువలకు మనమంతా అలవాటు అవుతాం. అనుకరణ ద్వారానే నేను నేర్చుకున్నాను.

నా జీవితాన్ని వెనక్కు తిరిగి చూసుకుంటే నాపై గురు ముద్ర పొరపాటున పడినట్లుగా అనిపించదు. వాటర్లూ యుద్ధంలో బ్రిటన్ గెలుపు ఈటన్ (పాఠశాలల) ఆట మైదానాల వల్ల సాధ్యమయిందేమో నాకు తెలియదు కానీ నాలోని మనిషిని మలిచింది మాత్రం కచ్చితంగా జైపూర్ హౌస్ ‘హౌస్ మాస్టర్’ అనే చెప్పగలను. అందుకే ఎప్పటికీ ఆయన నా ‘గురు’.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎవరు అడిగారు?



ఆయన హిందీకి పరిమితం అవాల్సింది. ‘రాజకీయ శాస్త్రం’లో ఎం.ఎ. చేసినవారికైనా టెలీప్రాంప్టర్‌లో ఇంగ్లిష్‌ను చూసి చదవడం కష్టంగానే ఉంటుంది. ‘విశ్వగురు’ అయినంత మాత్రాన, రాని ఇంగ్లిష్‌ను మాట్లాడాలని ఉందా? (అమెరికాలో మోదీ ప్రసంగం గురించి)

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్టు

కథ అడ్డం తిరిగింది



రష్యాలో అంతర్యుద్ధం మొదలైందనీ, పుతిన్ బంకర్‌లో దాక్కున్నాడనీ విన్నాను! పుతిన్‌ను అభిమానించే ఇండియన్ మీడియా నుంచైతే దీనిపై ఒక్క వార్తా కథనం కూడా రాలేదు. అదలా ఉంచితే, ప్రతి హిట్లర్‌కూ అంతిమంగా దుర్గతి తప్పదు.

– కాకా ‘ఆరామ్‌దేవ్’, పేరడిస్ట్

ప్రజాస్వామ్యమా వర్ధిల్లు



మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలలో అజ్మల్ ఫౌండేషన్ నుంచి వచ్చిన వారి ఆధిక్యం ఉండటం మంచిది కాదని బహిరంగ సభలో వ్యాఖ్యానించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత శర్మకు సమాధానం ఇచ్చేవారు తమ ప్రతి వాక్యంలో ‘ప్రజాస్వామ్యం’ అనే మాట ఉండేలా పదే పదే పలుకుతూ ఉండండి.

– రాణా అయూబ్, జర్నలిస్ట్

ఎగతాళి తగదు



మమతా బెనర్జీ మాట్లాడే హిందీని ఎగతాళి చేసినా పట్టించుకోని వారు... మోదీ ఇంగ్లిష్‌ను ట్రోల్ చేస్తే సహించలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎవరైనా సరే తమకు రాని భాషను మాట్లాడక తప్పని పరిస్థితి తలెత్తడం సహజమే కదా!

– షోయబ్ డ్యానియల్, పొలిటిక్ ఎడిటర్

ఇదొక తీరు



మనం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే– నిజ జీవితంలో జనాన్ని కలిసినప్పుడు వాళ్లు అంత చెడ్డగా ఏమీ ఉండరు, ఇక్కడ ట్విట్టర్‌లో ఉన్నట్టుగా. ట్విట్టర్ అనేది చాలావరకూ మన చెడ్డ పార్శ్వం. కఠినంగా, అసహ్యకరంగా ధ్వనించే కొందరు జనాల తర్కంలేనితనానికి చాలాసార్లు ఆశ్చర్యపోతుంటాను.

– అభినందన్ సేఖరీ, జర్నలిస్ట్

అది మరింత ప్రమాదం



సృష్టిలోని చెత్త మనుములుగా కొందరిని ద్వేషించమని చెప్పే గ్రంథాన్ని లేదా దైవాన్ని విశ్వసించే సమూహాన్ని పునర్ విద్యావంతులను చేయాలి. వారిలో మానవీయ విలువల్ని పాదుకొల్పాలి. లేదంటే ఆ సమూహం తమను తాము ప్రత్యేక హక్కులు కలిగినవారిగా పరిగణించుకుంటుంది.

– నీరజ్ అత్రి, రచయిత

ఏమీ మారలేదన్నమాట!



అరుణ్ శౌరీ 1994లో రాసిన ‘మిషనరీస్ ఆఫ్ ఇండియా’ పుస్తకాన్ని మీరు తప్పక చదవాలి. భవిష్యత్ పరిణామాల బీజాక్షరాలను కలిగి ఉన్న ఈ 300 పేజీల పుస్తకాన్ని చదివేందుకు నెల రోజులు కేటాయించుకుని, రోజుకు 1–15 పేజీలు చొప్పున పూర్తి చేయండి. ఇందులోని ప్రతి పదం వర్తమానానికీ తగినది.

– సాయి దీపక్ జె., న్యాయవాది

అరుదైన బహిష్కరణ ఘటన

అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం, తెలంగాణ రాష్ట్రం 2014, జూన్ 2న ఏర్పడినా, రాష్ట్ర హైకోర్టు, దిగువ కోర్టుల న్యాయమూర్తుల విభజన మాత్రం అప్పుడే జరగలేదు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పడినప్పుడు హైకోర్టుల విభజన రాష్ట్రాలతో పాటు జరిగింది. ఉమ్మడి సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తుల విభజన, కేటాయింపుల నిమిత్తం 2016లో ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి... కొందరు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఆ విభజన కమిటీ పొందుపరచిన మార్గదర్శకాల కనుగుణంగా ఉమ్మడి హైకోర్టు దిగువ కోర్టుల న్యాయమూర్తుల నుండి ఆప్షన్లు అడిగింది. వయస్సు తక్కువగా ఉండి, సీనియర్లుగా ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ నేటివిటీకి చెందిన న్యాయమూర్తులు తెలంగాణ రాష్ట్రానికి ఆప్షన్లు పెట్టుకున్నారు.

ఈ ఆప్షన్‌లను ఉమ్మడి హైకోర్టు యథాతథంగా ఖరారు చేస్తూ 2016 మే నెలలో ప్రొవిజనల్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తెలంగాణ న్యాయమూర్తుల్లో అసంతృప్తి రగిలింది. ఆ ఆప్షన్లు అమలు చేస్తే కొంతకాలానికి తెలంగాణలో జిల్లా జడ్జీలుగా, హైకోర్టు న్యాయమూర్తులుగా మొత్తం ఆంధ్ర నేటివిటీ వారే ఉంటారనే దృక్పథంతో, తెలంగాణ న్యాయమూర్తుల సంఘ ప్రతినిధులు ప్రధాన న్యాయమూర్తినీ, ఇతర సీనియర్ న్యాయమూర్తులనూ కలిసి హైకోర్టు తీసుకునే నిర్ణయం వల్ల వివక్ష జరుగుతుందనీ, ప్రొవిజనల్ కేటాయింపులు రద్దు చేయాలనీ వినతి పత్రాలు ఇచ్చారు. నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని ప్రధాన న్యాయమూర్తి తేల్చటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కడా జరుగని రీతిలో దాదాపు 200 మంది తెలంగాణ నేటివిటీ న్యాయమూర్తులు నిరసనగా విధులను బహిష్కరించి మూకుమ్మడిగా సెలవు పెట్టారు. వీరికి తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగులు తోడయ్యారు. తెలంగాణ న్యాయవాదులు, రాజకీయ నాయకుల మద్దతు ప్రకటనలతో తెలంగాణ రాష్ట్రం ఏకమైంది. విధులను బహిష్కరించి మూకుమ్మడి సెలవులు పెట్టడం ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా భావించి ఉమ్మడి హైకోర్టు 11 మంది తెలంగాణ న్యాయమూర్తుల సంఘ ప్రతినిధులనూ, ఆరుగురు న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ప్రతినిధులనూ 2016 జూన్ 28, 29 తేదీల్లో సస్పెండ్ చేసింది. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ప్రతినిధులు ఆనాటి గవర్నర్ నరసింహన్‌ను కలిసి ప్రొవిజనల్ కేటాయింపుల్లో జోక్యం చేసుకోవలసిందిగా కోరారు. అందుకు ఒప్పుకోని గవర్నర్ వెంటనే విధుల్లో చేరాల్సిందిగా సూచన చేశారు. దాదాపు నెలరోజులు గడచిన పిదప సంఘాల ప్రతినిధులు నిరసనను ఉపసంహరించుకున్నట్లు తెలుపడంతో, హైకోర్టు అందరి సస్పెన్షన్ ఎత్తివేసింది. అప్పటికి ఆ అంకం ముగిసింది.


ఈ వ్యవహారానికి ముందే తెలంగాణ న్యాయమూర్తుల సంఘం సుప్రీంకోర్టు ముందు ఒక రిట్ పిటిషన్ 2015లో వేస్తూ న్యాయమూర్తుల విభజన, కేటాయింపులు నేటివిటీ ఆధారంగా జరపాలని ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరింది. 2014 రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్నటువంటి సల్మాన్ ఖుర్షీద్ తెలంగాణ న్యాయమూర్తుల సంఘం తరఫున వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఆగస్టు 2018లో తీర్పిస్తూ రెండు నెలల్లోగా విభజన, కేటాయింపుల తంతు ముగించాలని ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం వేసిన ఆ కేసులోని ఆదేశాలను శిరసావహిస్తూ రెండు రాష్ట్రాల మధ్య న్యాయమూర్తుల విభజన, కేటాయింపులతో పాటు ఉమ్మడి హైకోర్టు విభజన కూడా 2018 డిసెంబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చింది. కానీ మొదట నిర్ణయించిన ప్రొవిజనల్ కేటాయింపుల్లో హైకోర్టు ఎటువంటి మార్పులూ చేయలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాలుగున్నర సంవత్సరాల పిదప, సుప్రీం ఉత్తర్వుల మేరకు హైకోర్టు విభజన, సబార్డినేటు న్యాయమూర్తుల విభజన జరిగింది.

జూన్ 26 నాడు 200 మంది న్యాయమూర్తులు క్రమశిక్షణ పాటిస్తూ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి మౌనం పాటిస్తూ రాజ్ భవన్‌కు వెళ్ళి గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తే, కొన్ని ప్రసార మాధ్యమాలు వక్రీకరించి న్యాయమూర్తులు కోర్టు బయట ఆందోళన చేపట్టినారనీ, పోలీసువారు ఆందోళనకారులను బలవంతంగా తొలగించినారనీ కథనాలు ఇచ్చి తృప్తి పడ్డాయి. రాజ్ భవన్‌కు వెళ్లే దారిలో నినాదాలు చేశారని కూడా కొన్ని పత్రికలు ఊహాగానాలు వండి వార్చాయి. ఏది ఏమైనా ఇప్పటిదాకా దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా న్యాయమూర్తులు విధులు బహిష్కరించిన దాఖలాలు లేవు. ఈ ఘటనకు ఏడేళ్లు నిండాయి. ఇదే మొదటిది, చివరిదిగా ఉండాలని కోరుకుందాం.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి । 98485 45970

డ్రగ్స్ ఉత్పాతాన్ని కలిసికట్టుగా అరికడదాం!

సందర్భం



బండారు దత్తాత్రేయ

మాదకద్రవ్యాల దుర్వినియోగ సమస్య ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా ఉంది. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురైన బాధితులు కుటుంబ, సామాజిక ఒంటరితనానికీ, తిరస్కారణకూ గురవుతున్నారనేది భయంకరమైన వాస్తవం. ఇది వారికి ఎంతో మానసిక, శారీరక బాధలను కలిగిస్తుంది. వారికి కావాల్సిన సహాయం కూడా అందకుండా పోతుంది. ఇది వారి జీవితాన్నీ, వారి కుటుంబ సభ్యుల జీవితాన్నీ దుర్భరంగా మారుస్తుంది. అందువల్ల మానవ హక్కులపై, కరుణపై దృష్టి సారించే ఔషధ విధానాల కోసం ప్రజా కేంద్రక విధానం అవసరం. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురైన బాధితులకు సామాజికపరంగా, భావోద్వేగపరంగా సహాయం చేయడం, అదే సమయంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రభావవంతమైన చెక్ పెట్టడం నిజంగా చాలా పెద్ద పని. కానీ అది అసాధ్యమైన ప్రతిపాదన కాదు.

ఈ సంవత్సరం ప్రపంచ మాదక ద్రవ్యాల దినం మాదకద్రవ్యాలను ఉపయోగించే వ్యక్తులపై, వారి కుటుంబాలపై వివక్షకు సంబంధించిన ప్రతికూల ప్రభావం గురించి అవగాహన పెంచాలని పిలుపునిస్తోంది. మాదకద్రవ్యాలను ఉపయోగించే వ్యక్తులలో ఎయిడ్స్, హెపటైటిస్ మహమ్మారి గురించి అవగాహనను పెంచాలి. మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలకు విధించే జైలు శిక్షకు ప్రత్యామ్నాయాల కోసం కమ్యూనిటీ ఆధారిత చికిత్స, సేవలు వంటివాటిని అందించడం; గౌరవప్రదమైన, విచక్షణారహితమైన భాషను ప్రదర్శించే వైఖరులను ప్రోత్సహించడం ద్వారా డ్రగ్స్ వ్యసనపరులపై వివక్షను ఎదుర్కోవాలి.

పబ్‌లలో నిషేధిత పదార్థాలను వినియోగిస్తూ పట్టుబడుతున్న సంపన్న, ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల పిల్లల గురించి మనం తరచుగా చదువుతూ, వింటూ ఉంటాం. డ్రగ్స్ వినియోగం నివారణకు లైసెన్సింగ్ ప్రక్రియను కఠినం చేయాలి. అటువంటి సంస్థల లైసెన్సు తొలగించడాన్ని వేగవంతం చేయాలి.

మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో సమాజానికి ముఖ్యమైన పాత్ర ఉన్నట్లు నేను భావిస్తున్నాను. డ్రగ్స్ సరఫరా చేసేవారిని సమాజం బహిష్కరించాలి. తమ పిల్లలతో ఎలా వ్యవహరించాలి, మాదకద్రవ్యాల దుర్వినియోగం నుండి వారిని ఎలా దూరంగా ఉంచాలనే దానిపై తల్లిదండ్రులకు కూడా సలహా ఇవ్వాలి. మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక పోరాటంలో బలమైన కుటుంబ విలువలు మనకు ఆస్తి. ఇల్లు, పాఠశాల, ప్రార్థనా స్థలం అనేవి విలువ ఆధారిత సామాజిక వ్యవస్థను నిర్మించడంలో మూడు కీలక భాగాలు.

డ్రగ్ సరఫరాదారులపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో కఠినంగా వ్యవహరించాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేకించి పెద్ద నగరాలలో, సరిహద్దు ప్రాంతాలలో, హాని కలిగించే ప్రాంతాల్లో సమర్థమైన నిఘాను పెంచడంలో పోలీసు బలగాలతో సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయం ముఖ్యం.



మాదక ద్రవ్యాల వినియోగం గురించి 2018లో ఎయిమ్స్, ఘాజియాబాద్‌లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ జాతీయ సర్వే చేశాయి. దీని ప్రకారం, మద్యం, గంజాయి, ఓపియాయిడ్లు, మత్తుమందులు, కొకైన్, ఏటీఎస్, హ్యాలూసినోజెన్‌ల బారినపడుతున్న చిన్నారులు, 10–17 ఏళ్ల వారు 6.06 శాతం అని అంచనా వేశారు. 18 నుంచి 75 సంవత్సరాల మధ్య వయసు వారిలో 24.71 శాతం మంది మాదకద్రవ్యాల దుర్వినియోగానికి పాల్పడినట్లు కనుగొన్నారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మాదక ద్రవ్యాల డిమాండ్ తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఏపీడీడీఆర్) అమలు చేయడం సంతోషించదగిన విషయం. దీని కింద డ్రగ్స్ నివారణ విద్యను, జాగరూకతను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలకు ఆర్థిక సహాయం అందించబడుతుంది. నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణతోపాటు మాదకద్రవ్యాల వ్యసనపరులకు జీవనోపాధికి మద్దతు కల్పించబడింది. 2021–22లో ఎన్‌ఏపీడీడీఆర్ కింద 2,85,559 మంది లబ్ధిదారులు ఉన్నారు.

అదేవిధంగా, నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్‌ఎమ్‌బీఏ) పథకాన్ని ఆగస్టు 2020లో ప్రారంభించారు. దీని కింద ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యే మహిళలు, పిల్లలు, విద్యా సంస్థలు, పౌర సమాజ సంస్థలు మొదలైన వాటాదారుల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకు 12 కోట్ల మంది ప్రజలకు చేరువయ్యారు. నాలుగు వేలకు పైగా యువ మండలాలు, నెహ్రూ యువ కేంద్రాలు (ఎన్‌వైకేలు), ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, యూత్ క్లబ్‌లను కూడా ఎన్‌ఎమ్‌బీఏతో అనుసంధానించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు, మహిళా మండలాలు, మహిళా ఎస్‌హెచ్‌జీల రూపంలో విస్తృత సామాజిక బృందాలను చేరుకోవడంలో 2.05 కోట్ల మంది మహిళల సహకారం కూడా చాలా ముఖ్యమైనది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1.19 లక్షల విద్యాసంస్థలు విద్యార్థులు, యువతకు మాదక పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు కార్యకలాపాలు నిర్వహించాయి.

బాధితులను సామాజికంగా ఒంటరిగా ఉంచే బదులు, వారు తమ తప్పులను గుర్తించి సాధారణ జీవితానికి తిరిగి వచ్చేలా కరుణతో, సహాయ దృష్టితో వారిని చేరుకోవాలి. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, శాంతియుత భవిష్యత్తు కోసం మాదకద్రవ్యాల దుర్వినియోగ ముప్పును అంతం చేయాలి.

వ్యాసకర్త హరియాణా గవర్నర్
(నేడు ‘వరల్డ్ డ్రగ్ డే’)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.అష్టమి రా.9.34 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.9.28 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.6.28 నుండి 8.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.21 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.4.44 నుండి 6.26 వరకు (తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

వర్గీకరణ కోసం ఎంఎస్‌పీకే ఓటేద్దాం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణపై అన్ని పార్టీలు మాట తప్పాయని, వర్గీకరణకు కట్టుబడి ఉన్న మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ)కే ఓటు వేసుకుందామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సిద్దిపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 14శాతం ఉన్న మాదిగలను అన్ని పార్టీలు కేవలం ఓటు బ్యాంక్‌గానే పరిగణిస్తున్నాయన్నారు. వర్గీకరణకు సహకరించని పార్టీల జెండాలు మోయొద్దు, ఓట్లు వేయొద్దని పిలుపునిచ్చారు. కనీసం రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్కరికి కూడా చోటు ఇవ్వకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఒక్క శాతం జనాభా లేని కులాలకు మంత్రి పదవులు ఇచ్చి మాదిగలను విస్మరించారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. వర్గీకరణతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నిరంతర పోరాటం చేస్తాయని తెలిపారు. ఇందులో భాగంగా జూలై మూడోవారంలో హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లిగాలి యాదగిరి, లింగంపల్లి శ్రీనివాస్, పెర్క పరుశురాములు, కొలిమి మల్లేశం, ముంజ్రాతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి గుండెపోటు

- ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు.. నిలకడగా ఆరోగ్యం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అమీర్‌ఖాన్ (18) ఆదివారం గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే స్పందించిన వైద్యులు ఆయనకు ప్రాథమిక వైద్య చికిత్స అందించి కరీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన అమీర్‌ఖాన్ శరీరం ఒక్కసారిగా చెమటలు పట్టి దుస్తులు తడిసి పోయాయి. కార్డియాలజిస్ట్ సుధీర్, వైద్యులు వెంటనే స్పందించి విద్యార్థికి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివరాంప్రసాద్ మాట్లాడుతూ.. అవసరమైతే అమీర్‌ఖాన్‌ను హైదరాబాద్ నిమ్స్‌కు తరలిస్తామన్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ



యాదాద్రి ఆలయ వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణ కట్ట ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి సుమారు మూడున్నర గంటల సమయం, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.46,93,411 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

అది నగరానికి దగ్గరగా ఉన్న గ్రామం. ఊరు మొత్తం రైతు కుటుంబాలు. పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవాలని వేలకు వేల ఫీజులు కట్టి ప్రైవేట్ బడుల్లో చేర్పించారు. విద్యార్థులెవరూ లేకపోవడంతో ఊర్లోని సర్కారు బడి మూతబడింది. ఒకసారి రాలేగావ్ సిద్ధి నుంచి వచ్చిన ఓ వ్యక్తి చెప్పిన మాటలు వారిలో ప్రేరణ రగిలించాయి. ప్రైవేట్ స్కూళ్లకు కట్టే డబ్బులతో మన ఊరి పాఠశాలను తెరిపించుకోవాలనుకుని నిశ్చయించుకుని స్కూల్‌ను తెరిపించుకున్నారు. ఇప్పుడు ఆ పాఠశాల.. నో అడ్మిషన్ బోర్డు పెట్టేవరకు చేరుకుంది. ఇదీ.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి పాఠశాల విజయగాథ.

- సాక్షి, వరంగల్ డెస్క్

ఒంటిమామిడి.. నిల'బడి'ంది!



కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు

మూతబడిన సర్కారు పాఠశాలను స్వచ్ఛందంగా తెరిపించిన గ్రామస్తులు

- ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు ఇంగ్లిష్ మీడియం
- జీరో నుంచి నో అడ్మిషన్ బోర్డు పెట్టేస్థాయి వరకు..
- ప్రభుత్వ పాఠశాల అయినా తల్లిదండ్రుల ఆర్థిక సహకారం
- హనుమకొండ జిల్లా పాఠశాల విజయగాథ

ఒంటిమామిడి గ్రామస్తులందరూ తమ పిల్లలను వరంగల్‌లోని ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. 2005లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరుకోవడంతో పాఠశాల మూతపడింది. 2014–15లో ఆ గ్రామం నీటి సంరక్షణలో రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచింది. బాల వికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామస్తులు మహారాష్ట్రలోని రాలేగావ్ సిద్ధి గ్రామానికి వెళ్లి నీటి సంరక్షణలో అన్నా హజారే చేపడుతున్న చర్యలను గమనించారు. వాటిని గ్రామస్తులకు వివరించేందుకు కంపచెట్లతో నిండిపోయిన ఆ

మూతబడినా...

పాఠశాల ఆవరణను శుభ్రం చేసి సమావేశమయ్యారు. రాలేగావ్‌సిద్ధి నుంచి వచ్చిన ఓ వక్త మాట్లాడుతూ నీటి సంరక్షణలో మీ గ్రామం బేషుగ్గా ఉంది.. మరి మీ పాఠశాల ఎందుకు మూతపడింది అన్న మాటలు గ్రామస్తులను ఆలోచనలో పడేశాయి. దీంతో ఎంతమంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారో సర్వే చేశారు. 270 మంది పిల్లలు ఏటా చదువు కోసం రూ.35 లక్షలు కడుతున్నట్లు గుర్తించి అవాక్కయ్యారు. ఆ డబ్బులో కొంత మన పాఠశాల నిర్వహణకు పెట్టుకుని తెరిపించుకుందామని గ్రామసభలో తీర్మానం చేశారు. దీన్ని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం అనుమతి ఇచ్చారు. దీంతో పాఠశాల 270 మంది విద్యార్థులతో పునఃప్రారంభమైంది. తర్వాత టెన్త్ వరకు అనుమతులు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 496 మంది విద్యార్థులు ఉన్నారు. అయినా 9 మంది ఎస్జీటీలే ఉండటంతో మరో 11 మంది ప్రైవేట్ టీచర్లను పెట్టుకుని పాఠశాలను నిర్వహిస్తున్నారు.

స్వచ్ఛందంగా ఫీజు చెల్లింపు

పాఠశాల నిర్వహణ కోసం ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఏడాదికి కొంత ఫీజు రూపంలో విరాళం ఇస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులు సంవత్సరానికి రూ.5 వేలు, హైస్కూల్ విద్యార్థులు రూ.6 వేలు ఇస్తుంటారు. ప్రైవేట్‌గా పెట్టుకున్న టీచర్లకు నెలకు రూ.2.20 లక్షలు వేతనం చెల్లిస్తుండటం గమనార్హం. పాఠశాల నిర్వహణలో చైర్మన్ పొన్నాల రాజు ఆధ్వర్యంలోని 24 మంది సభ్యులున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) కీలకపాత్ర పోషిస్తోంది. ఇక్కడ ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులు ఇన్‌చార్జీలుగా ఉంటారు. ఆ తరగతికి సంబంధించి అన్ని అంశాలను వారే చూసుకుంటారు.

పాఠశాల ప్రత్యేకతలివీ..

- ప్రతి తరగతి గది సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుంది.
- మధ్యాహ్న భోజనం వండేందుకు ముగ్గురు వంట మనుషులను పెట్టి ఒక్కొక్కరికి రూ.4,500 వేతనం ఇస్తున్నారు.
- ముగ్గురు స్కావెంజర్లను నియమించుకున్నారు.
- మంచినీటి కోసం ప్రత్యేకంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు.
- అన్ని హంగులతో డీజీ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ
- ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహణ
- మండలంలో టెన్త్‌లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన ఏకైక పాఠశాలగా గుర్తింపు పొందింది. పలువురు విదేశీయులు పాఠశాలను సందర్శించారు.



ఒంటిమామిడి పల్లి పాఠశాల

ఏకతాటిపై నిలబడ్డాం



గ్రామస్తులందరం ఒక్కతాటిపై నిలబడి పాఠశాలను నిలబెట్టుకున్నాం. పిల్లలు బాగా చదువుతున్నారు. ఉపాధ్యాయుల సహకారం కూడా ఎంతో ఉంది. కానీ ఇప్పుడు విద్యార్థుల సంఖ్యకు తగినట్లు టీచర్లు లేరు. రేషనలైజేషన్, బైఫర్‌కేషన్ కాలేదని స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వడం లేదు. ఐదు అదనపు తరగతి గదులు కావాలి. స్థలం కూడా సరిగా లేకపోవడంతో ఇరుకుగా ఉంది.

– పొన్నాల రాజు, ఎస్ఎంసీ చైర్మన్

పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి బోధిస్తాం



విద్యార్థులు ఉదయం 8 గంటలకు వస్తే సాయంత్రం 6 గంటలకు బడినుంచి వెళ్తారు. స్టడీ అవర్స్‌లో టీచర్లు దగ్గరుండి చదివించడంతో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి అంశంలో పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి బోధన సాగుతుంది. ఇప్పటికే నో అడ్మిషన్ బోర్డు పెట్టాం. – ఆరోగ్యమ్మ గోపు, హెచ్ఎం

అర్థమయ్యేలా చెబుతారు



బట్టీ విధానం ఉండదు. ప్రతి పాఠం సులభంగా అర్థమయ్యేలా చెబుతారు. కంప్యూటర్ తరగతులు కూడా ఉన్నాయి. స్టడీ అవర్స్ వల్ల మేము బాగా చదవగలుగుతున్నాం. మధ్యాహ్న భోజనం కూడా బాగుంటుంది.

– పరకాల సాత్విక, టెన్త్ విద్యార్థిని

దళితబంధుకు దరఖాస్తు ఎలా?

- రెండో విడత అమలుకు అనుమతులు వచ్చినా అధికారుల్లో అస్పష్టతే
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల జోక్యంపై ఇప్పటికే హైకోర్టు ఆక్షేపణ
- మరోవైపు లబ్ధిదారుల నుంచి వసూళ్లపై సీఎం ఆగ్రహం
- అయినప్పటికీ పాతవిధానంలోనే అర్హుల ఎంపికకు ఉత్తర్వులు
- ఇది అక్రమాలకు దారితీస్తుందని విమర్శలు

సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం రెండో విడత అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో ఆశావహుల్లో ఉత్సాహం రెట్టించింది. ఈ పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.17,700 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ.. పథకం అమలుకు మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ఎంపిక ప్రక్రియ ముందుకు సాగలేదు. కాగా, ఈ ఏడాది కూడా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో తాజాగా నియోజకవర్గస్థాయిలో పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ.. తదితరాలకు సంబంధించి అనుమతులిస్తూ ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలంటూ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఈ పథకానికి ఎస్సీ కుటుంబాలను గుర్తించి వారి అర్హతను నిర్ధారించాలని ఉత్తర్వుల్లో తెలిపినప్పటికీ అధికారుల్లో మాత్రం స్పష్టత లేదని తెలుస్తోంది.

ఎంపికపై స్పష్టత కరువు..!

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ.. ప్రత్యేకంగా దళితబంధు పోర్టల్‌ను రూపొందించింది. దీంతోపాటు మొబైల్ యాప్‌ను కూడా తయారు చేయించిన ప్రభుత్వం.. పథకం అమలులో పారదర్శకత కోసం లబ్ధిదారుల వివరాలు, యూనిట్ల ఏర్పాటు, పథకం పురోగతి తదితరాలన్నీ పోర్టల్, యాప్‌ల ద్వారానే నిర్వహించనుంది. ఈ అంశాలన్నీ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ లబ్ధిదారుల ఎంపికపైన మాత్రం ఉత్తర్వుల్లో వివరణ ఏమీ లేదని చెపుతున్నారు. నియోజకవర్గస్థాయిలో ప్రజాప్రతినిధి సహకారంతో ఎస్సీ కుటుంబాలను గుర్తించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే ఉండడంతో ఆయన సహకారంతో అర్హులను ఎంపిక చేసే వీలుంటుంది. కానీ క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులు స్వీకరించాలా? లేక ఎమ్మెల్యే సూచించిన పేర్లతో కూడిన జాబితాను ఆమోదించాలా? అనే అంశాన్ని అధికారులు తేల్చుకోలేకపోతున్నారని సమాచారం.

వసూళ్లపర్వం బహిరంగమే..

దళితబంధు పథకంలో పెద్ద ఎత్తున వసూళ్లు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లబ్ధిదారు నుంచి పెద్ద మొత్తంలోనే డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తన వద్ద ఉందంటూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సైతం హెచ్చరించారు. ఇలాంటివి సహించబోనని ఆయన స్పష్టంచేశారు. మరోవైపు ఈ పథకం అమలులో పక్షపాత వైఖరి ఉందంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. అర్హుల ఎంపికలో ఎమ్మెల్యే జోక్యం ఉండకూడదని తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో కొత్తగా మార్గదర్శకాలు వస్తాయని ఎస్సీ కార్పొరేషన్ భావించింది. ఇందులో భాగంగానే గతేడాది ఈ పథకాన్ని అమలు చేయలేదని తెలుస్తోంది. తాజాగా ఎస్సీ అభివృద్ధి శాఖ ఇచ్చిన ఉత్తర్వుల్లోనూ ఈ అంశంపై స్పష్టత లేకపోవడం.. పాత విధానాన్నే అమలు చేసేలా సూచనలు ఇవ్వడం పట్ల క్షేత్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్యేలకే లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు ఇవ్వడంవల్ల అక్రమాలు మరింత ఎక్కువగా జరుగుతాయని పలువురు ఆక్షేపిస్తున్నారు.

నేటి నుంచి రైతుబంధు సొమ్ములు జమ

- ఈ సారి లక్షన్నర మంది పోడు రైతులకు కూడా నిధులు
- మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధు సొమ్మును ప్రభుత్వం సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. మొత్తం 70 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని వెల్లడించింది. అలాగే నాలుగు లక్షల ఎకరాలున్న లక్షన్నర మంది పోడు రైతులకు కూడా ఈసారి రైతుబంధు జమ చేస్తారు. ఈ సీజన్‌లో మొత్తం రూ.7,720.29 కోట్లు రైతులకు రైతుబంధు సొమ్ము అందజేస్తారు. పథకం అమలువల్ల ఈ సారి ప్రభుత్వంపై గతంలో కన్నా సుమారు రూ. 300 కోట్ల అదనపు భారం పడుతుందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 11వ విడతతో కలిపి మొత్తం రైతుల ఖాతాల్లో రూ. 72,910 కోట్లు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. పదో విడత వరకు రూ.65,190 కోట్లు జమ అయిందని తెలిపారు. ఎప్పటి మాదిరిగానే ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామన్నారు. ఈసారి కొత్తగా రైతుబంధు సాయం తీసుకోనున్న రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను తమ బ్యాంకు అకౌంటు వివరాలతో సంప్రదించాలన్నారు. దేశంలో ఏడాదికి రెండు సార్లు, ఎకరాకు రూ.10 వేలు సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరా సాగులోకి రాలేదని విషం కక్కిన విపక్షాలు.. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు తమకు బియ్యం సరఫరా చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలు చూసి కళ్లు తెరవాలన్నారు.

ప్రజల పోరాటాలతోనే తెలంగాణ వచ్చింది

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు..



వేదికపై అభివాదం చేస్తున్న మురళి, కోదండరాం, పాశం యాదగిరి తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రజల పోరాటాలు, అమరుల త్యాగాలవల్లే తెలంగాణ వచ్చింది కానీ ఏ ఒక్కరివల్లో రాలేదని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'త్యాగం ఎవరిది? భోగం ఎవరిది'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమాఖ్య ప్రతినిధులు పాశం యాదగిరి, కరుణాకర్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, సుప్రీంకోర్టు న్యాయవాది నిరూప్ రెడ్డి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జర్నలిస్టు విఠల్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. యావత్ తెలంగాణ పోరాడి ప్రత్యేకరాష్ట్రం సాధించుకుని దొంగచేతికి తాళం అప్పగించినట్లు అయ్యిందన్నారు. ఇప్పటికైనా మేధావులు, ప్రజా సంఘాల నాయకులు విద్య, వైద్యం, కౌలురైతులు, పోడు భూముల సమస్యలపై ఒక ప్రణాళిక రూపొందించుకుని వాటిని ఎవరు నిరవేరుస్తామని హామీ ఇస్తారో వారికే మద్దతు తెలపాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం అధికారం అడ్డంపెట్టుకుని విపరీతంగా దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. 111 జీవో పరిధిలోకి వచ్చే ప్రాంతంలో ముందే వందల ఎకరాల భూములు కొనుగోలు చేసి జీవో ఎత్తేశారని, ధరణిని అడ్డం పెట్టుకుని ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ భూములు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురళి మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలోకి రాగానే ఏడు నెలల్లో ప్రగతి భవన్ కట్టుకున్నారని, కానీ అమరుల స్మారకం కట్టేందుకు 9 సంవత్సరాలు పట్టిందని విమర్శించారు. అందులోనూ అమరుల పేర్లు లేకపోవడం, తెలంగాణను తాను ఒక్కడినే తెచ్చానన్న దుర్మార్గపు భావన ప్రజల్లో తెచ్చేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గపు పార్టీని ఓడించేందుకు అందరం ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు.

గిరిజన బంధు ప్రకటించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: గిరిజనులకు గిరిజనబంధు, గిరిజన బీమా వెంటనే ప్రకటించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'గిరిజనుల సమస్యలు–పరిష్కార మార్గాలు'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీ ఆర్ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లంబాడీలు, ఇతర గిరిజనుల మధ్య ఏవైనా సమస్యలు వస్తే చర్చించుకోవాలి కానీ.. కొట్లాడుకోవద్దని చెప్పారు. మణిపూర్ తగలబడుతుంటే.. ప్రధాని అమెరికా వెళ్లి డెమోక్రసీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. గిరిజనుల న్యాయమైన డిమాండ్లకు తన సంపూర్ణ మద్దతు తెలిపారు. దళితులు ఎంతో పోరాడితే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ వచ్చిందని గుర్తు చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్, రవీందర్ నాయక్, పిడమర్తి రవి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండటంతో దళితబంధు రెండోవిడత ఇస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే గిరిజన బంధు, గిరిజన బీమా ప్రకటించాలని, ప్రత్యేక ఎస్టీ కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. అర్హులైన గిరిజనులకు గృహలక్ష్మి పథకం కింద 10 లక్షలు ఇవ్వాలని, నూతనంగా ఏర్పడ్డ గిరిజన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కోలా జనార్ధన్, గణేష్ నాయక్, వెంకట్ నాయక్, రాంచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు పండాలని జెట్టక్కను తరిమికొట్టారు

- జగిత్యాల జిల్లా వాల్గొండలో గ్రామదేవత పండుగ



చీపుర్లు, చాటలు, పాతదుస్తులతో జెట్టక్కను తరిమికొడుతున్న గ్రామస్తులు

మల్లాపూర్(కోరుట్ల): తమ గ్రామానికి మంచి జరగాలని గ్రామదేవతను కోరుకుంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామస్తులు జెట్టక్క(కీడు దేవత)ను తరిమికొట్టారు. జెట్టక్కను తరిమికొడితే తమ గ్రామంలో మంచి పంటలు పండుతాయని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని వాల్గొండ గ్రామస్తులు భావిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామంలో ఇంటికొకరు పాత దుస్తులు ధరించి, చీపుర్లతో ఓ దిష్టిబొమ్మను జెట్టక్కగా భావించి దానిని కొట్టుకుంటూ గ్రామశివారులోకి తీసుకెళ్లి వదిలేశారు. అనంతరం గ్రామసమీపంలోని గోదావరి నదికి వెళ్లి పాత దుస్తుల్ని అందులో వదిలి పుణ్యస్నానమాచరించి కొత్తబట్టలు ధరించి గ్రామానికి చేరుకున్నారు. కాగా, ఈనెల 22న ఇదే గ్రామ సమీపంలోని పాతదాంరాజ్‌పల్లివాసులు కూడా ఇలాగే జెట్టక్కను తరిమికొట్టారు.

అనుమానించి.. హతమార్చారు

- జగిత్యాల జిల్లాలో యువకుడిని నరికి చంపిన దుండగులు
- గతంలో ప్రేమించిన యువతికి పెళ్లయినా ప్రేమాయణం సాగించాడనే..



వంశీ

సారంగాపూర్ (జగిత్యాల): గతంలో ప్రేమించిన ఓ యువతికి పెళ్లయినప్పటికీ మళ్లీ ప్రేమాయణం సాగిస్తున్నాడనే అనుమానంతో ఓ యువకుడిని దుండగులు ఆదివారం నరికి చంపిన ఘటన జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం బీర్‌పూర్‌కు చెందిన జువ్వికింది వంశీ (23) తుంగూర్‌లోని ఓ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం బీర్‌పూర్ మండలం కొల్వాయి వెళ్లి మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో బీర్‌పూర్ తిరిగి వస్తున్నాడు. అప్పటికే తుంగూర్‌లో మాటు వేసిన కొందరు దుండగులు.. వంశీని ఆపి వెంటతెచ్చుకున్న గొడ్డలి, ఇతర ఆయుధాలతో తలపై నరికారు. తల, నోటికి బలమైన గాయాలు కావడంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులోని మొబైల్‌ఫోన్‌ను తీసుకున్న దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు.

ప్రేమ వ్యవహారమే కారణమా?

బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి, వంశీకి మధ్య చాలాకాలం ప్రేమ వ్యవహారం నడిచింది. మరోసారి యువతి జోలికి రావొద్దని ఆమె కుటుంబ సభ్యులు వంశీని అప్పట్లో మందలించారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఆ యువతికి మరో యువకుడితో వివాహం జరిపించారు. అయినా వంశీ ఆమెకు తరచూ ఫోన్ చేస్తూ మాట్లాడటం, కలవడం చేస్తున్నాడని యువతి కుటుంబ సభ్యులు అనుమానించసాగారు. ఇలా అయితే ఆమె కాపురం కూలిపోయే ప్రమాదం ఉందని భావించి వంశీని హతమార్చేందుకు కుట్రపన్నారు.

మృతుడి కుటుంబం ధర్నా..

వంశీ హత్య సమాచారం తెలిసిన వెంటనే మృతుడి బంధువులు తుంగూర్ గ్రామానికి చేరుకొని రోడ్డుపై 2 గంటలపాటు బైఠాయించారు. హంతకులను తమకు అప్పగించకుంటే ఆత్మహత్య చేసుకుంటామని మృతుడి తల్లి భాగ్య, బాబాయ్ అక్కడే ఉన్న లారీ కిందకు వెళ్లారు. అయితే దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఓ గ్రామానికి చెందిన రమేశ్, విష్ణుపై తమకు అనుమానం ఉందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. మృతుడి తల్లి దినసరి కూలీకాగా తండ్రి శ్రీహరి ఉపాధి కోసం ముంబై వెళ్లాడు. వంశీకి ఓ సోదరుడు ఉన్నాడు.

నలుగురిని బలిగొన్న టిప్పర్

- మేడారం వెళ్లొస్తుండగా కారును ఢీకొన్న లారీ
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో ఘటన



నుజ్జునుజ్జయిన కారు



మేడారంవెళ్లే దారిలో ములుగు గట్టమ్మ ఆలయం వద్ద సెల్ఫీ దిగిన నర్సింహస్వామి, సాంబరాజు కుటుంబ సభ్యులు

ఆత్మకూర్/వరంగల్: వారంతా ఆదివారం పక్కింటి వారి కారును తీసుకొని మేడారం వెళ్లారు... సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు... తిరుగు ప్రయాణంలో మరో అరగంటలో ఇంటికి చేరుతారనగా టిప్పర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఒకే కుటుంబంలోని నలుగురిని కబళించింది. రెప్పపాటులో తండ్రి, కుమార్తె, అల్లుడు, మనవరాలి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తల్లీకూతుళ్లు తీవ్ర గాయాలపాలవగా డ్రైవింగ్ చేస్తున్న కుమారుడు, మనవడు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషాద ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది.

అతివేగంగా దూసుకొచ్చి...

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వరంగల్ కాశిబుగ్గలోని సొసైటీ కాలనీకి చెందిన అనుముల నర్సింహస్వామి (52) నగరంలోని స్టీల్ సామాను షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయన పెద్ద కుమార్తె వెల్దెండి ఆకాంక్ష(26), అల్లుడు వెల్దెండి సాంబరాజు (40), మనవరాలు వెల్దెండి లక్ష్మిప్రసన్న (9), భార్య అనుముల రాజశ్రీ, చిన్నకుమార్తె అనుముల అర్షిత, పెద్ద కుమార్తె ఆకాంక్ష, కుమారుడు అక్షయరాజు, కుమారుడు అనుముల ఆకర్ష్ కలసి మారుతీ వ్యాగన్ ఆర్ కారులో ఆదివారం ఉదయం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి కాశిబుగ్గకు వస్తుండగా పత్తిపాక క్రాస్‌రోడ్ దాటాక ఆత్మకూరు సమీపంలో జాతీయ రహదారి 163పై వారి కారును శాయంపేట మండలం పత్తిపాక సమీపంలోని క్రషర్‌కు వెళుతున్న ఎస్‌వీసీ టిప్పర్ అతివేగంగా దూసుకొచ్చి ఎడమ వైపు ఢీకొట్టింది. దీంతో కారులో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న వెల్దండి సాంబరాజు, వెనుక కూర్చున్న అనుముల నర్సింహస్వామి (52), ఆయన కుమార్తె వెల్దెండి ఆకాంక్ష (26), మనవరాలు లక్ష్మిప్రసన్న (9) అక్కడికక్కడే మృతిచెందారు. కారు నుజ్జునుజ్జు కావడంతో మృతదేహాలు అందులోనే ఇరుక్కుపోయాయి. అనుముల రాజశ్రీ, అర్షిత తీవ్రంగా గాయపడగా వారిని స్థానికులు '108'లో ఎంజీఎం తరలించారు. ఈ ఘటనలో బెలూన్ తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న అనుముల ఆకర్ష్, ఆరేళ్ల బాలుడు అక్షయరాజు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం అనంతరం టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు.

క్లుప్తంగా...

దేశంలోనే తొలిసారిగా కుంగుబాటుకు శస్త్రచికిత్స!

ముంబై: ముంబై వైద్యులు తొలిసారిగా కుంగుబాటుకు శస్త్రచికిత్స నిర్వహించారు. 2017లో మానసిక ఆరోగ్యచట్టం అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో జరిగిన తొలి డిప్రెషన్ సర్జరీ ఇదేకావడం విశేషం. ఆస్ట్రేలియాకు చెందిన ఓ మహిళ గత 26 ఏళ్లుగా డిప్రెషన్‌తో బాధపడుతోంది. మహారాష్ట్ర మెంటల్ హెల్త్ బోర్డు అనుమతితో జస్‌లోక్ ఆస్పత్రిలో న్యూరోసర్జన్ డాక్టర్ పరేశ్ దోషి నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించింది. దీనిని డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) సర్జరీ అని అంటారు. పార్కిన్‌సన్స్ దగ్గర్నుంచి నరాల వ్యవస్థలో లోపాల కారణంగా తలెత్తే వివిధ రకాల వ్యాధులకి డీబీఎస్ శస్త్రచికిత్స ద్వారా నయం చేస్తారు.

75 గ్రామాలకు స్వాతంత్య్రయోధుల పేర్లు

అగర్తలా: తమ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న 75 గ్రామాల పేర్లను మార్చాలని త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో అసువులు బాసిన త్యాగధనుల పేర్లను ఆ 75 గ్రామాలకు పెట్టాలని నిర్ణయించింది. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయి ఆజాదీ అమృతోత్సవాలను జరుపుకుంటున్న వేళ పేర్ల మార్పిడి ప్రాజెక్టుని చేపట్టింది. జూలైలో మొదలు పెట్టి ఆగస్టు 15కల్లా పూర్తి చేస్తామని సమాచార, సాంస్కృతిక శాఖ కార్యదర్శి పి.కె. చక్రవర్తి చెప్పారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఉన్న సరిహద్దుల్లో 75 గ్రామాలను స్వాతంత్య్ర సమరయోధుల్ని గుర్తించే పనిని జిల్లా అధికార యంత్రాంగం చేస్తోందన్నారు.

పరమ చెత్త కుక్క..!



కాలిఫోర్నియా: చైనా జాతికి చెందిన ఒక కుక్క ప్రపంచంలో పరమ చెత్తగా, అంద విహీనంగా కనిపించే కుక్కగా కిరీటం సాధించింది. ప్రతీ ఏడాది అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగే అందవిహీనమైన శునకాల పోటీలో స్కూటర్ అనే పేరు ఉన్న ఏడేళ్ల వయసు శునకానికి ఈ పురస్కారం దక్కింది. అవార్డు కింద ఒక ట్రోఫీ, 1500 డాలర్ల బహుమానాన్ని ఆ కుక్కని పెంచుతున్న యజమానురాలికి ఇచ్చారు. కుక్కల పెంపకం, వాటిలో లోపాలున్న ప్రేమను పంచడం, జంతుప్రేమపై అవగాహన పెంచడం కోసం సానొమా –మారిన్ ఫెయిర్‌లో ఈ పోటీలు జరుగుతూ ఉంటాయి.

హలో.. ఆస్ట్రోనాట్..!

- రూపుదిద్దుకున్న మాట్లాడే అంతరిక్ష నౌకలు
- వ్యోమగాములకు ఎంతో ఉపయోగకరం
- ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థతో సాధ్యం
- ఇంటర్‌ఫేస్‌ను అభివృద్ధి చేసిన 'నాసా' ఇంజనీర్లు



అంతరిక్షంలో విధినిర్వహణలో ఉండే వ్యోమగాములు ఇకపై తమకు ఏదైనా సమాచారం, సాయం కావాలంటే భూమిపై అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించాల్సిన అవసరం లేదు. తాము ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌకను అడిగితే చాలు.. కావాల్సిన సమాచారం దొరుకుతుంది. అది కూడా సంభాషణల రూపంలోనే. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌బాట్ చాట్‌జీపీటీ తరహాలో పనిచేసే ఇంటర్‌ఫేస్‌ను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ఇంజనీర్లు అభివృద్ధి చేశారు. ఇతర గ్రహాలపై అన్వేషణ కోసం వెళ్లే వ్యోమగాములు తాము ప్రయాణించే అంతరిక్ష నౌకలతో సంభాషించడానికి ఈ ఇంటర్‌ఫేస్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు. వ్యోమగాములకు అంతరిక్ష నౌకలు తగిన సలహాలు సూచనలు ఇచ్చేందుకు వీలుంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా భూమిపై ఉండే మిషన్ కంట్రోలర్లు ఇతర గ్రహాలపై పనిచేసే ఏఐ ఆధారిత రోబోలతో సులభంగా మాట్లాడొచ్చని అంటున్నారు.

ఇది సైన్స్ ఫిక్షన్ కాదు

చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించేందుకు నాసా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది. చంద్రుడి కక్ష్యలో 'లూనార్ గేట్‌వే' పేరిట ఒక అంతరిక్ష కేంద్రాన్ని సైతం నిర్మించాలని భావిస్తోంది. ఈ స్పేస్ స్టేషన్‌లో ఏఐ ఆధారిత ఇంటర్‌ఫేస్ సేవలు ఉపయోగించుకోవాలని నాసా నిర్ణయానికి వచ్చినట్లు ఇంజనీర్ డాక్టర్ లారిస్సా సుజుకీ చెప్పారు. అంతరిక్ష నౌకలతో నేరుగా సంభాషించడం, వాటి నుంచి వెనువెంటనే ప్రతిస్పందనలు అందుకోవడమే దీని ఉద్దేశమని వివరించారు. అంతరిక్షంలో గమనించిన విషయాలను సంభాషణల రూపంలో భూమిపైకి చేరవేస్తాయని, ప్రమాదాలు ఎదురైనప్పుడు హెచ్చరికలు జారీ చేస్తాయని అన్నారు. ఇది సైన్స్ ఫిక్షన్ ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అంతరిక్ష నౌకల్లో కృత్రిమ మేధ ఆధారిత గ్రహాంతర సమాచార వ్యవస్థను నిక్షిప్తం చేయడం తప్పనిసరి అవుతుందని వెల్లడించారు. అంతరిక్ష నౌకలతో సంబంధాలు తెగిపోయినప్పుడు, వాటిలో లోపాలు తలెత్తినప్పుడు, పనిచేయకుండా పోయినప్పుడు, ఇంజనీర్లను అంతరిక్షంలోకి పంపించలేమని చెప్పారు. ఏఐ ఆధారిత సంభాషణ వ్యవస్థతో అంతరిక్ష నౌకల్లోని లోపాలు వెంటనే తెలిసిపోతాయని వివరించారు. ఇలాంటి కమ్యూనికేషన్ వ్యవస్థను అంతరిక్ష వాహనాల్లో అమర్చడం ద్వారా ఇతర గ్రహాలపై ఉండే ఖనిజ లవణాలు, వాతావరణ పరిస్థితులు గురించి కచ్చితమైన సమాచారం పొందవచ్చని డాక్టర్ లారిస్సా సుజుకీ అభిప్రాయపడ్డారు.

–సాక్షి, నేషనల్ డెస్క్

ఇండియా హీరో మోదీ

- ఆయన నాయకత్వంలో భారత్‌లో అద్భుత ప్రగతి
- ప్రధానిపై ఈజిప్టులో ప్రవాస భారతీయుల ప్రశంసలు
- ఈజిప్టు అధ్యక్షుడితో మోదీ కీలక చర్చలు, ఒప్పందాలు



కైరోలోని హెలియోపోలిస్ కామన్‌వెల్త్ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

కైరో: 'ఇండియా హీరో నరేంద్ర మోదీ' అంటూ ఈజిప్టులో నివసిస్తున్న ప్రవాస భారతీయులు భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో మోదీ చరిత్రాత్మక ప్రసంగం అద్భుతంగా ఉందంటూ కొనియాడారు. మోదీ నాయకత్వంలో ఇండియా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అమెరికాలో నాలుగు రోజుల అధికారిక పర్యటన ముగించుకొని శనివారం ఈజిప్టులో అడుగుపెట్టారు. గత 26 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడంఇదే మొదటిసారి. రాజధాని కైరోలో మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రిట్జ్ కార్ల్‌టన్ హోటల్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఇండియా హీరో(కథానాయకుడు) మీరేనంటూ వారు ప్రశంసించగా మోదీ ప్రతిస్పందించారు. అందరికీ హీరో ఇండియా అని బదులిచ్చారు. ప్రజలంతా కష్టపడి పనిచేస్తున్నారని, అందుకే మన దేశం అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. దేశ ప్రగతిలో ప్రవాస భారతీయుల కృషి ఎంతో ఉందని చెప్పారు. దేశ విజయంలో వారికి సైతం వాటా దక్కుతుందన్నారు. అనంతరం దావూదీ బోహ్రా వర్గం ముస్లింలతో నరేంద్ర మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గుజరాత్‌లోని దావూదీ బోహ్రా ముస్లింలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఈజిప్టులో ప్రవాస భారతీయులు తనకు ఘన స్వాగతం పలికారని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. వారి ఆప్యాయత తన హృదయాన్ని కదిలించిందని పేర్కొన్నారు. ఈజిప్టువాసులు సైతం భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి తనకు స్వాగతం పలికారని వెల్లడించారు. భారత్–ఈజిప్టు దేశాలు సంప్రదాయాలను సైతం పంచుకుంటున్నాయని వివరించారు.

అల్–హకీం మసీదు, గ్రేట్ పిరమిడ్ల సందర్శన

ఈజిప్టులో 11వ శతాబ్దం నాటి చరిత్రాత్మక అల్–హకీం మసీదును ప్రధాని మోదీ సందర్శించారు. ఈజిప్టులో మొదటి ప్రపంచ యుద్ధంలో భారతీయ సైనికులు చేసిన ప్రాణత్యాగాలకు గుర్తుగా నిర్మించిన హెలియోపోలిస్ కామన్‌వెల్త్ వార్ మెమోరియల్‌ను సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. ఈజిప్టులో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో 3,799 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు. ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన గిజా గ్రేట్ పిరమిడ్లను మోదీ సందర్శించారు. కైరో నగర శివార్లలో గిజా నెక్రోపోలిస్ అనే ప్రాంతంలో ఈ పిరమిడ్లు ఉన్నాయి. ''కైరో అల్–హకీం మసీదును సందర్శించడం ఆనందంగా ఉంది. ఈజిప్టు ఘనమైన వారసత్వానికి, సంస్కృతికి ఈ మసీదు దర్పణం పడుతోంది'' అని మోదీ ట్వీట్ చేశారు.

మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ద నైలు' ప్రదానం

ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద నైలు'ను ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సీసీ ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రదానం చేశారు. ఈజిప్టు సహా ఇప్పటిదాకా 13 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలతో మోదీని సత్కరించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, పాలస్తీనా, అఫ్గానిస్తాన్, సౌదీ అరేబియా, మాల్దీవ్స్, రష్యా, బహ్రెయిన్, పపువా న్యూగినియా, ఫిజీ, రిపబ్లిక్ ఆఫ్ పాలౌ, భూటాన్ తదితర దేశాల నుంచి ఆయన ఈ పురస్కారాలు స్వీకరించారు. తనకు ఆర్డర్ ఆఫ్ ద నైలు పురస్కారం ప్రదానం చేసిన ఈజిప్టు ప్రభుత్వానికి, ప్రజలకు మోదీ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్ పట్ల ఈజిప్టు ప్రజల ఆప్యాయత అనురాగాలకు ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు.

అవగాహనా ఒప్పందాలపై సంతకాలు

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకొనే దిశగా భారత్, ఈజిప్టు మరో అడుగు వేశాయి. భారత ప్రధాని మోదీ, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సీసీ ఆదివారం చర్చలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరువురు నేతలు నాలుగు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశారని భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. ఇందులో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన ఒప్పందం ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ప్రాచీన, పురావస్తు కట్టడాల పరిరక్షణ, 'కాంపిటీషన్ లా'కు సంబంధించిన మరో మూడు ఒప్పందాలపై సంతకాలు చేశారని తెలిపారు.



ఈజిప్టులోని గిజా పిరమిడ్ వద్ద మోదీ

రాష్ట్రపతి ముర్ముకు మిస్డ్‌కాల్

- రాష్ట్రపతి అభ్యర్థిత్వం కోసం ప్రధాని కార్యాలయం నుంచి ఫోన్
- ఫోన్ ఎక్కడో వదిలేసి రిసీవ్ చేసుకోలేని వైనం
- కొత్త పుస్తకంలో వెల్లడైన ఆసక్తికర విషయాలు



న్యూఢిల్లీ: సెల్‌ఫోన్‌ను వాడే అలవాటు అంతగా లేని ద్రౌపదీ ముర్ము.. జీవితంలో అత్యంత ముఖ్యమైన ఫోన్‌కాల్‌ను మిస్సయ్యారు..! ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పిలుపు అది. రాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా నామినేషన్ వేయాలని ఆమెను కోరేందుకు స్వయంగా ప్రధాని మోదీయే చేసిన కాల్ అది..! 'ద్రౌపదీ ముర్ము: ఫ్రం ట్రైబల్ హింటర్ ల్యాండ్స్ టూ రైజినా హిల్' పేరుతో జర్నలిస్ట్ కస్తూరి రే రాసిన తాజా పుస్తకంలో 2022 జూన్ 21న జరిగిన ఘటన సహా పలు వివరాలున్నాయి. పలు ఇంటర్వ్యూలు, విశ్లేషణల ఆధారంగా ముర్ము జీవితంలో ఘటనల క్రమాన్ని స్కూల్, కాలేజీ రోజులవరకు టీచర్ నుంచి సామాజిక కార్యకర్తగా, అటునుంచి కౌన్సిలర్..మంత్రి..గవర్నర్..దేశ మొట్టమొదటి గిరిజన మహిళా రాష్ట్రపతి వరకు సాగిన ఆమె ప్రస్థానాన్ని అందులో ప్రస్తావించారు. గతేడాది జూన్ 21న ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు 275 కిలోమీటర్ల దూరంలోని తన మారుమూల స్వగ్రామం ఉపర్‌బేడలో ముర్ము ఉన్నారు. బీజేపీ ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ముర్ము అని తెలిసినా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీని కోసం అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్న సమయమది. అయితే, ముర్ము స్వగ్రామంలో కరెంటు కట్ అమలవుతోంది. బయట జరుగుతున్న ఇలాంటి విషయాలేవీ ఆమెకు తెలియవు. మొబైల్‌ను ఎక్కువగా వాడే అలవాటు లేని ముర్ము, దాన్ని ఎక్కడో ఉంచారు. ప్రధాని కార్యాలయం నుంచి వచ్చిన ఫోన్ సహా ప్రముఖ వ్యక్తుల నుంచి వచ్చిన అనేక ఫోన్‌కాల్స్‌ను ఆమె రిసీవ్ చేసుకోలేకపోయారు. చివరికి పీఎంఓ అధికారులు ముర్ము మాజీ ఓఎస్డీ, రాయ్‌రంగ్‌పూర్‌లో ఉంటున్న బికాశ్ చంద్ర మహంతకు ఫోన్ చేశారు. ఆయన ఆగమేఘాల మీద తన మెడికల్ షాపును మూసేసి ముర్ము ఇంటికి చేరుకున్నారు. ఫోన్ ఆమె చేతికందించారు. దీంతో ప్రధాని మోదీతో ఆమె నేరుగా మాట్లాడగలిగారు. ఆ తర్వాతే ఆమె అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడింది.



ప్రఖ్యాత అమర్‌నాథ్ గుహాలయంలో ఏర్పడిన మంచు స్ఫటిక లింగం. జూలై ఒకటో తేదీన పహల్గామ్ నుంచి అమర్‌నాథ్ యాత్ర మొదలవుతోంది.

ఎల్‌ఓసీ వెంట చైనా దుశ్చర్య

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంట పాకిస్తాన్ సైన్యం రక్షణపరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. ఈ పనులకు పొరుగున ఉన్న దాని మిత్రదేశం చైనా సహకరిస్తోందని భారత ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. డ్రోన్లు, కమ్యూనికేషన్ టవర్లను పాకిస్తాన్‌కు చైనా అందజేస్తోందని చెప్పారు. భూగర్భ కేబుళ్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పీఓకేలో చైనా స్థావరాలు పెరుగుతున్నాయని, వాటి రక్షణ కోసం పాక్ సైన్యానికి సాయం అందిస్తోందని అన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న 155 ఎంఎం ఎస్‌హెచ్–15 శతఘ్నులను ఎల్‌ఓసీ వద్ద పాక్ మోహరించిందని పేర్కొన్నారు. పాక్ సైనిక పోస్టుల వద్ద చైనా సైనికాధికారులు తరచుగా కనిపిస్తున్నారని తెలియజేశారు. ఇదిలా ఉండగా, ఈ మొత్తం వ్యవహారంపై భారత సైన్యం ఇంకా అధికారికంగా స్పందించలేదు. తన ప్రయోజనాల కోసం చైనా చేస్తోందని నిపుణులంటున్నారు.

ఒబామా వ్యాఖ్యలపై సీతారామన్ మండిపాటు



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం మైనారిటీల హక్కుల్ని కాపాడలేకపోతే, ఆ దేశం ఎప్పటికైనా విడిపోయే ప్రమాదం ఉందంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఒబామా హయాంలోనే అమెరికా.. సిరియా, యెమెన్, సౌదీ అరేబియా, ఇరాక్ తదితర ఆరు ముస్లిం మెజారిటీ దేశాలపై వేలాది బాంబులు వేసిందని ఆరోపించారు. ఇది నిజం కాదా? అటువంటి వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేస్తే నమ్మేదెవరు?' అని ఆమె ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఓవైపు ముస్లిం మెజారిటీ దేశాలు కీర్తిస్తుంటే మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు భారత్‌లోని ముస్లింల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని నిర్మలా ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 13 దేశాల నుంచి అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్నారు, అందులో ఆరు ముస్లిం మెజారిటీ దేశాలని ఆమె గుర్తుచేశారు.

సైన్యాన్ని చుట్టుముట్టిన మహిళలు

- మిలిటెంట్లకు రక్షణ కవచంగా మారిన మెయిటీ మహిళలు
- 12 మంది మిలిటెంట్లను విడిచిపెట్టిన సైన్యం
- మణిపూర్‌లోని తూర్పు ఇంఫాల్‌లో ఘటన



ఇంఫాల్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు యత్నిస్తున్న సైన్యానికి స్థానికంగా ఓ వర్గం మహిళల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మిలిటెంట్లను విడిపించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు ఆర్మీని దిగ్బంధించారు. దీంతో రోజంతా ఉద్రిక్తత కొనసాగింది. చివరికి, ఆర్మీ తమ అదుపులో ఉన్న మెయిటీ వర్గం మిలిటెంట్లను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఈ ఘటన తూర్పు ఇంఫాల్ జిల్లా ఇథమ్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. భద్రతా బలగాలు శనివారం ఉదయం గ్రామంలో సోదాలు జరిపి 12 మంది మిలిటెంట్లను అదుపులోకితీసుకున్నాయి. విషయం తెల్సుకున్న సుమారు 1,200 మంది మెయిటీ వర్గం మహిళలు సైనికులను చుట్టుముట్టారు. మిలిటెంట్లను వదిలేయాలని భీష్మించారు. సాయంత్రం వరకు ఇదే ప్రతిష్టంభన కొనసాగింది. చివరికి బలగాలు మిలిటెంట్లను వదిలేశాయి. వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను, మందుగుండును మాత్రం తీసుకెళ్లామని ఆర్మీ తెలిపింది. రాష్ట్రంలో నెలకొన్న సున్నిత పరిస్థితుల దృష్ట్యా, బలప్రయోగంతో కలిగే నష్టాన్ని, గ్రామస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, మానవతా దృక్పథంతో మిలిటెంట్లను స్థానిక నేతకు అప్పగించినట్లు ఆర్మీ తెలిపింది. ఆర్మీ విడిచిపెట్టిన వారిలో మెయిటీ వర్గం కేవైకేఎల్ గ్రూపునకు చెందిన స్వయం ప్రకటిత లెఫ్టినెంట్ కల్నల్ మొయిరంగ్‌థెమ్ తంబా అలియాస్ ఉత్తమ్ ఉన్నాడు. ఇతడికి పలు హింసాత్మక ఘటనలతో సహా 2015లో '6 డోగ్రా యూనిట్'పై దాడితో సంబంధముంది. ఈ గ్రూప్ మయన్మార్ నుంచి మణిపూర్‌లోకి చొరబడినట్లు ఆర్మీ తెలిపింది. గ్రామంలోకి అదనపు బలగాల ప్రవేశాన్ని ఆలస్యం చేసేందుకు ఆ మార్గంలోని కొన్ని వంతెనల వద్ద అడ్డంకులు కల్పించారంది. కాగా, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ఆదివారం ఢిల్లీలో హోం మంత్రి అమిత్‌షాను కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులను వివరించారు.

కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

రుద్రప్రయాగ: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. రుద్రప్రయాగ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు ముంచెత్తడంతో సోనప్రయాగ్ దగ్గర యాత్రను నిలిపివేసినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కేదార్‌నాథ్‌కు ప్రయాణాల్ని ఆపేయాలని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో ముఖ్యమంత్రి పుష్కర్ ధామి ఆదివారం రాష్ట్ర విపత్తు నిర్వహణకు చెందిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు.

బెంగాల్‌లో రెండు గూడ్స్ రైళ్లు ఢీ

కోల్‌కతా: రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 8 బోగీలు పట్టాలు తప్పాయి. ప్రాణనష్టం జరగలేదని, ఎవరూ గాయపడలేదని ఆగ్నేయ రైల్వే అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని బంకురా జిల్లా ఓండా వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆద్రా డివిజన్‌లోని మిద్నపూర్–ఆద్రా సెక్షన్‌లో 4 గంటలపాటు 20 వరకు రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. ఘటన ప్రాంతంలో తక్షణమే పనులు చేపట్టి ఉదయం 8.30 గంటలకల్లా రాకపోకలను పునరుద్ధరించామన్నారు. గూడ్స్ రైలు డ్రైవర్ సిగ్నల్‌ను గమనించకుండా లూప్‌లైన్‌లోకి పోనివ్వడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని చెప్పారు.

62 ఏళ్ల తర్వాత..!

న్యూఢిల్లీ/ముంబై: దేశ రాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబైలను 62 ఏళ్ల తర్వాత రుతుపవనాలు ఒకేసారి ఆదివారం తాకాయి. రెండు నగరాలపైకి ఇలా ఒకేసారి వ్యాపించడం 1961 జూన్ 21వ తేదీ తర్వాత ఇదే మొదటిసారని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఢిల్లీకి ముందుగా ఊహించిన దాని కంటే రెండు రోజులు ముందు రాగా, ముంబైకి మాత్రం రెండు వారాలు ఆలస్యంగా చేరుకున్నాయని వివరించింది. హరియాణా, చండీగఢ్, ఢిల్లీలపై రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. రుతుపవనాలు మహారాష్ట్రలోని మిగతాప్రాంతాలు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలు, రాజస్తాన్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌వైపు కదులుతున్నాయని వివరించింది. రానున్న రెండు రోజుల్లో మిగతా ప్రాంతాలకూ విస్తరించేందుకు అనువైన పరిస్థితులున్నాయని తెలిపింది. సాధారణంగా రుతు పవనాలు కేరళను జూన్ 1న, ముంబైని జూన్ 11న, ఢిల్లీని జూన్ 27న తాకుతాయి.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరి మృతి

మిషిగన్: అమెరికాలో కాల్పుల మోత ఆగట్లేదు. తాజాగా జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు చనిపోగా మరో 12 మంది గాయపడ్డారు. మిషిగన్‌లోని సగినాలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సోషల్ మీడియా స్పాన్సర్ చేస్తున్న స్ట్రీట్ పార్టీలో 200 మందికి పైగా పాల్గొన్నారు. అకస్మాత్తుగా పలు వైపుల నుంచి కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా మరో 12 మంది గాయపడ్డారు. కాల్పుల ఘటనపైదర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రవాసంలోకి ప్రిగోజిన్

- టీ కప్పులో తుఫాన్‌లా సమసిన రష్యా సంక్షోభం
- ప్రిగోజిన్, వాగ్నర్ సైనికులపై కేసులు వెనక్కి

మాస్కో: రష్యాలో ప్రైవేటు సైన్యం తిరుగుబాటు ముగిసింది. సైనిక నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసి కొద్ది గంటల సేపు అల్లకల్లోలం సృష్టించిన ప్రైవేటు సైన్యం సంస్థ వాగ్నర్ చీఫ్ యెవెగినీ ప్రిగోజిన్ వెనక్కి తిరిగారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉన్న బెలారస్‌కు ప్రవాసం వెళ్లాలని ప్రయాణమయ్యారు. అయితే ఆయన బెలారస్ చేరుకున్నారో లేదో అన్న దానిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. సైనికులంతా ఎక్కడివారు అక్కడికే ఉక్రెయిన్ శిబిరాల్లోకి వెళ్లిపోవాలని ఆదేశించారు. బెలారస్ అధ్యక్షుడు మధ్యవర్తిత్వంతో ఈ సంక్షోభం టీ కప్పులో తుపానులా సమసిపోయింది. ఒప్పందం ప్రకారం ప్రిగోజిన్‌పై పెట్టిన కేసులన్నింటినీ వెనక్కి తీసుకున్నట్టు రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ప్రిగోజిన్‌తో పాటు తిరుగుబాటులో పాల్గొన్న వాగ్నర్ సైనికులపై ఎలాంటి విచారణ జరపబోమని స్పష్టం చేసింది. వాగ్నర్ సైనికుల్ని కాంట్రాక్ట్ పద్ధతిలో సైన్యంలోకి తీసుకుంటామని రష్యా రక్షణ శాఖ ఆఫర్ ఇచ్చింది.

రక్తపాతం వద్దు అనే..

ప్రిగోజిన్‌ను దేశద్రోహి, వెన్నుపోటుదారుడు అని అభివర్ణించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అనూహ్యంగా ప్రిగోజిన్, అతని సైన్యాన్ని వదిలేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒకవైపు ఉక్రెయిన్‌తో పూర్తి స్థాయిలో తలబడలేక అంతర్జాతీయంగా ఉన్న పరువును పోగొట్టుకున్న పుతిన్ ఇప్పుడు అంతర్గత సంక్షోభాలను తట్టుకునే స్థితిలో లేరని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ''దేశంలో రక్తపాతం జరగకుండా చూడాలని, అంతర్గత పోరు కొనసాగితే ఎలాంటి ఫలితాలు వస్తాయన్న ఆందోళన కూడా ఆయనలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పుతిన్ ఎంత బలహీనంగా మారిపోయారంటే ఎలాంటి రిస్క్ చేయలేకపోతున్నారు''అనే విశ్లేషణలు వినబడుతున్నాయి. మరోవైపు తిరుగుబాటు జరిగిన మర్నాడే రష్యా విదేశాంగ శాఖ ఉప మంత్రి ఆంద్రూ చైనా పర్యటనకు వెళ్లారు. చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌తో తాజా పరిణామాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యాకు చైనా మద్దతుగా ఉన్న విషయం తెలిసిందే.

రష్యా రక్షణ వ్యవస్థపై నీలినీడలు

ప్రిగోజిన్ తిరుగుబాటుతో రష్యా రక్షణ వ్యవస్థలో ఉన్న డొల్లతనం బయటపడింది. వాగ్నర్ గ్రూప్ సైనికులు రాత్రికి రాత్రి కొన్ని గంటల వ్యవధిలో రోస్తావ్ నగరంలోకి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవేశించారు.



రోస్తోవ్‌లో ప్రిగోజిన్‌తో స్థానికుడి సెల్ఫీ

ప్రభుత్వ సైనికులతో ఘర్షణలు చెలరేగాయి. ఈ సమయంలో వాగ్నర్ సైనికులు చేసిన దాడుల్లో 39 మంది పైలెట్లు మరణించినట్లు తెలుస్తోంది.

అమెరికాకి ముందే తెలుసు

రష్యాపై ప్రిగోజిన్ తిరుగుబాటు చేస్తారని అమెరికా నిఘా సంస్థలు ముందే పసిగట్టాయని వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ కథనాలు ప్రచురించాయి. జూన్ మధ్యలో ప్రిగోజిన్ రష్యాపై తిరుగుబాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా నిఘా సంస్థలకు సమాచారం అందింది. వారం క్రితం నిర్ధారణగా తెలిసింది. తిరుగుబాటుకు ఒక్క రోజు ముందే రష్యాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటాయని అమెరికా ప్రభుత్వానికి నిఘా సంస్థలు నివేదిక ఇచ్చాయి. పుతిన్‌కు ఒకరోజు ముందే తిరుగుబాటు విషయం తెలుసని అమెరికా మీడియా అంటోంది. రష్యాలో పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ బైడెన్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలతో బైడెన్ ఫోన్‌లో మాట్లాడారు. తమ మద్దతు ఎప్పటికీ ఉక్రెయిన్‌కే ఉంటుందని పునరుద్ఘాటించారు. రష్యాలో తిరుగుబాటు జరిగినంత మాత్రాన తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పష్టం చేశారు.

కిడ్నాప్ అనుమానంతో డ్రైవర్‌పై కాల్పులు

టెక్సాస్: ఉబర్ డ్రైవర్ తనను కిడ్నాప్ చేస్తున్నాడన్న అనుమానంతో అమెరికాకు చెందిన ఒక మహిళ దారుణానికి దిగింది. మెక్సికోకు తనను తీసుకువెళుతున్నాడని భయపడి డ్రైవర్‌పై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆస్పత్రిలో మృతిచెందాడు. టెక్సాస్‌కు చెంది ఫోబె కోపాస్ (48) తన ప్రియుడి దగ్గరికెళ్లేందుకు ఉబర్ క్యాబ్ బుక్ చేసుకుంది. కారు ఎక్కాక ఫోన్‌లో ఏదో మాటల్లో పడిపోయిన ఆమె ఆ తర్వాత హఠాత్తుగా పరిసరాలను చూసి తనను మెక్సికోకి తీసుకువెళుతున్నారని అనుమానపడింది. వెంటనే తన బ్యాగ్‌లో ఉన్న తుపాకీతో డ్రైవర్ డేనియల్ పియేడ్రాపై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో మెడకు తీవ్ర గాయాలైన అతను రక్తపు మడుగులో పడిపోయాడు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసుల విచారణలో ఆ డ్రైవర్ కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించినట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదు. అందుకే ఆమెపై హత్య కేసు నమోదు చేశారు. ఉబర్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఇలాంటి హింసను సహించలేమంటూ ఫోబె మళ్లీ ఉబర్ సేవలు వినియోగించుకోకుండా నిషేధం విధించింది.



హరియాణాలోని పంచకులలో ఘగ్గర్ నదిలో వరదలో కొట్టుకుపోతున్న కారును అడ్డుకుంటున్న గ్రామస్తులు. ఈ ఘటనలో కారులోని ఒక మహిళను ఎట్టకేలకు వారు కాపాడారు.

సాక్షి కరీంనగర్

సోమవారం । 26 । జూన్ । 2023



అపర భద్రాద్రిలో భక్తుల రద్దీ

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.



నోట్‌బుక్స్ వచ్చేశాయ్..

ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ విద్యార్థులకు పుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లు కూడా అందించాలని నిర్ణయించగా.. జిల్లాకు చేరాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రజకుల హక్కుల సాధనకు పోరాటం



అభివాదం చేస్తున్న రజక నాయకులు

కరీంనగర్: రజకుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పోరాటాలు కొనసాగిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. ఆదివారం రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో సమస్యల సాధన సభ జరిగింది. సంపత్ మాట్లాడుతూ.. రజక కార్పొరేషన్‌కు రూ.200కోట్లు బడ్జెట్ కేటాయించాలని గత ప్రభుత్వాలు ఇచ్చిన జీవో343ని అమలు చేయాలని అన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ అధ్యక్షుడు జోజిరెడ్డి మాట్లాడుతూ రజకలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, వనపర్తి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నాల తిరుపతి, రాపాల శంకర్, ఎడవల్లి రమేశ్, నంగునూరు ఎల్లయ్య, రామడుగు సంపత్, గూడెం మధు, సమ్మయ్య, గుండేటి మల్లేశ్వరి, ఎలగందుల అర్చన, కొలిపాక సుమలత, తొట్టి లక్ష్మి, లత పాల్గొన్నారు.

పాత పెన్షన్ కోసం పోరాటం



వినతిపత్రం ఇస్తున్న టీఎన్జీవో జిల్లా నేతలు

కరీంనగర్ అర్బన్: 2004కు ముందు నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ వర్తింపజేసేలా కృషి చేస్తామని టీఎన్జీవోల కేంద్ర సంఘం కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమోను అనుసరించి పాతపెన్షన్‌ను అమలు చేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు ఆదివారం టీఎన్‌జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌కు జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జగదీశ్వర్ మాట్లాడుతూ 01-09-2004 ముందు నియామక ప్రక్రియ మొదలైన ఉద్యోగ, ఉపాధ్యాయులందరిని పాతపెన్షన్ పరిధిలోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు గుంటి వేణుగోపాల్, నల్ల రాజేందర్ రెడ్డి, నడిపెల్లి సంతోశ్ కుమార్, నర్సింగం, కుమారస్వామి, కిషన్, రఘుబాబు, లక్ష్మణ్, మాధవచారి, రామ్ కిరణ్, కిరణ్, వీరేందర్, శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం



గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న రైతులు

శంకరపట్నం: వర్షాలు కురవాలని ఆదివారం మండలంలోని కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో గ్రామదేవతలకు రైతులు జలాభిషేకం చేశారు. వర్షాకాలం ఆరంభమైన వర్షాలు కురవకపోవడంతో కప్పతల్లి ఆటలు ఆడారు. కన్నాపూర్ వాలిసుగ్రీవ ఆలయంలో వరదపాశం పోశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, చుక్కల రవి, రైతులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి గేయాలు దోహదం



పుస్తకం ఆవిష్కరిస్తున్న భువనచంద్ర

కరీంనగర్‌కల్చరల్: సమాజాన్ని చైతన్యం చేసేందుకు గేయాలు దోహదపడతాయని సినీ గేయ రచయిత భువనచంద్ర అన్నారు. ఉదయసాహితీ అధ్యక్షుడు వైరాగ్యంప్రభాకర్ అధ్యక్షతన వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య సంపాదకత్వంలో వెలువడిన పాటల పూదోట గేయసంకలనాన్ని ఆదివారం జూమ్‌ద్వారా భువనచంద్ర ఆవిష్కరించారు. పాటలు మనసులోని బాధలను దూరం చేస్తాయని పేర్కొన్నారు. అతిథులు దాస్యం సేనాధిపతి, ఇమ్మడిశెట్టి చక్రపాణి మాట్లాడారు. అనురాధ పుస్తక పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్ర రంజోల్కర్, వకుళవాసు తదితరులు ఉన్నారు.

జిల్లా వివరాలు	
ఎన్నికల సామగ్రి	7,290
పోలింగ్ కేంద్రాలు	1,338
బ్యాలెట్ యూనిట్లు	2,873
కంట్రోల్ యూనిట్లు	2,227
వీవీ ప్యాట్లు	2,190

పోలింగ్ కేంద్రాలు (నియోజకవర్గాలవారీగా)	
కరీంనగర్	390
హుజూరాబాద్	306
చొప్పదండి	312
మానకొండూరు	330

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
కరీంనగర్	3,21,758	1,61,765	1,59,970	23
చొప్పదండి	2,27,615	1,11,605	1,16,006	4
మానకొండూరు	2,11,599	1,04,510	1,07,087	2
హుజూరాబాద్	2,35,482	1,15,848	1,19,632	2

ఎన్నికలకు సమాయత్తం

- మూడు నెలల ముందుగానే ఈవీఎంల సన్నద్ధత
- మొదలైన మొదటి విడత తనిఖీ
- నేటినుంచి పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ
- ఇక ఒకే కేంద్రంలో కుటుంబ ఓట్లు
- ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల భాగస్వామ్యం

జిల్లా ఓటర్లు	పురుషులు	మహిళలు
9,96,454	4,93,728	5,02,695



కరీంనగర్‌లో కొనసాగుతున్న ఈవీఏంల మొదటి దశ చెకింగ్ ప్రక్రియ

కరీంనగర్ అర్బన్: సాధారణ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ సమాయత్తమవుతోంది. గతానికి భిన్నంగా ఐదునెలల ముందుగానే కసరత్తు ప్రారంభించింది. ఎప్పుడైనా ఎన్నికలకు మూడు నెలల ముందు ఓటరు జాబితా రూపకల్పన, ఈవీఏంల సన్నద్ధత చేపట్టేది. ప్రతి ఎన్నికల్లో బోగస్ ఓట్లు, ఓట్ల గల్లంతు వంటి ఆందోళనల క్రమంలో ఈసారి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు శ్రమిస్తోంది. ఓటర్ల జాబితా తయారీలో అన్ని రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేసింది. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ విరివిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తూ, జాబితాను సరిచూసుకునేలా పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రానుందని సమాచారం కాగా, జూలై చివరి కల్లా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పూర్తి కానుంది.

ఇక పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ

ఓటరు సర్వే ముగిసింది. ఒకే ఇంటి నంబర్‌పై 10కి పైగా ఓట్లున్న చిరునామాలను గుర్తించి సర్వే నిర్వహించారు. కరీంనగర్ అర్బన్, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఎక్కువగా ఉండగా వాటిని తొలగించారు. అలాగే 18 ఏళ్లు నిండేవారిని గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై వచ్చిన దరఖాస్తులను విచారించారు. ఇక పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టనున్నారు. జూలై 24 వరకు సదరు ప్రక్రియ కొనసాగనుండగా ఒక్కోపోలింగ్ కేంద్రంలో 1500 ఓట్లు ఉండనున్నాయి.

ఫొటో సిమిలరీ పరిశీలన

ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటేసేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. గతంలో పట్టణ ప్రాంతాల్లో ఒక్కోపోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లు, గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రంలో 1400 ఓటర్లు ఉండేవారు. ఇకపై 1500 ఓటర్లుండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ ఓట్లన్ని ఒక పోలింగ్ కేంద్రంలోనే ఓట్లు ఉండేలా చూడాలని ఎన్నికల సంఘం ఇంటింటి సర్వేలోనే స్పష్టం చేసింది. ఫొటో సిమిలర్ ఎంట్రీ అనే సాఫ్ట్‌వేర్‌తో ఒకే తరహా ఫొటోలు కలిగి ఉన్న ఓటర్లను గుర్తించి తొలగించారు.

ఓటింగ్‌శాతం పెంపుపై కసరత్తు

ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెంపుపై ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. తాజాగా 80ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటినుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఈ ప్రక్రియను అమలు చేసినా స్పందన అంతంతే ఉందని ఎన్నికల అధికారులు గుర్తించారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల్లోనూ ఈ ప్రక్రియను అమలు చేసి కొంత మేర సఫలీకృతమయ్యారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని దివ్యాంగ, 80ఏళ్లు పైబడిన ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

జూలై 7వరకు ఎఫ్‌ఎల్‌సీ.. అక్టోబరు 5న తుది జాబితా

ఈవీఏం యంత్రాల మొదటి దశ చెకింగ్ మొదలైంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖలకు చెందిన నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లు, ఏఈవోలను నియమించారు. సాంకేతిక నిపుణులు 22మంది జిల్లాకు రాగా వారి పర్యవేక్షణలో చెకింగ్ సాగుతోంది. జూలై 7వరకు పూర్తవనుండగా రోజుకు 140 ఈవీఏంలను పరీక్షిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తుండగా ఓట్లు సరిగా పడ్డాయా.. లేదాఅని పరిశీలి స్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యాంప్రసాద్‌లాల్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అక్టోబర్1 నాటికి 18 ఏళ్లు నిండేవారందరిని ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అక్టోబరు 5న ఓటరు తుది జాబితా ప్రకటిస్తారు.

పేదలకు వైద్యసేవలు ఆదర్శనీయం



వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్‌టౌన్: డాక్టర్లు గ్రామాలను దత్తత తీసుకుని పేదలకు వైద్య సేవలందించడం ఆదర్శనీయమని నగర మేయర్ వై.సునీల్ రావు అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఆవో గావ్ చలే (రండి గ్రామాలకు పోదాం) అనే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ డాక్టర్లు ఉమ్మడి జిల్లాలోని 22 గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ భవన్ నుంచి ఆయా గ్రామాలకు తరలివెళ్లే డాక్టర్ల బృందాల వాహనాలను జెండాఊపి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక గ్రామాలను కరీంనగర్ ఐఎంఏ వైద్యులు దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. స్మార్ట్‌సిటీ కరీంనగర్ ఇప్పటికే వైద్యానికి కేంద్ర బిందువుగా మారిందని, ఇక్కడి వైద్యులు చేస్తున్న సేవలతో మరింత గుర్తింపు వస్తుందని తెలిపారు. కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాఠశాలల బంద్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మల్యాల రాకేశ్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పాఠశాలల బంద్ చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి దశాబ్దికాలమైనా విద్యారంగ అభివృద్ధి జరగలేదని తెలిపారు. సీఎం కేసీఆర్ కేజీటు పీజీ ఉచిత నిర్బంధ విద్య అంటూ ప్రగల్భాలు పలికి 8,624 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే డిమాండ్‌తో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపుఇచ్చినట్లు తెలిపారు. విష్ణు, నందు, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

సాగులో సందేహాలా?

- నేడు జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

సాక్షి ఫోన్ ఇన్

కరీంనగర్ అర్బన్: వానాకాలం సీజన్ ఆలస్యమైన నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు 'సాక్షి' చక్కని అవకాశం కల్పిస్తోంది. వరినాట్లు, పత్తి, ఇతర మెట్ట పంటలు సాగుచేసే క్రమంలో వినియోగించే విత్తనాలు, ఎరువులు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, నకిలీ విత్తనాలు, రైతు బంధు, రైతుబీమా సమస్యలు, క్రిమిసంహారక మందుల వినియోగం, సస్యరక్షణ చర్యలు వంటి అంశాలను నేరుగా తెలుసుకోవచ్చు. విత్తనాలు వేసుకునేందుకు అనువైన అవకాశాలు, సమయాలను గురించి జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్‌తో మాట్లాడి తెలుసుకోవచ్చు.

ఫోన్ నంబర్: 99895 75683
సమయం: సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు

సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: డిగ్రీ కాలేజీల అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీసీజీటీఏ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీలో ఆదివారం టీజీసీజీటీఏ, వివిధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో సమావేశం అయ్యారు. రాష్ట్రస్థాయి సంఘ ఎన్నికల్లో మూడోసారి విజయం సాధించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డిని సన్మానించారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ ప్రాథమిక సభ్యుడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని వివరించారు. రాష్ట్ర నాయకులు గోపి, చిన్న, వాణి, పావని, మహేశ్, శంకరయ్య, తిరుపతయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ నియమించి.. ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

కరీంనగర్: ఈనెల 30తో గత పీఆర్‌సీ గడువు ముగుస్తుండడంతో జూలై 1న నూతన పీఆర్సీ కమిటీని నియమించి ఉద్యోగులకు తక్షణమే ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కల కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలపై కోర్టులో స్టే ఉన్నందున ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించి స్టేను తొలగించి, బదిలీలు చేపట్టాలని సూచించారు. లేదంటే ఆటంకాలు లేని పదోన్నతులైనా చేపట్టాలని సూచించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, కేజీబీవీలో ఖాళీలు ఉన్నందున ఉపాధ్యాయులకు రెండో దఫా బదిలీల అవకాశం కల్పించి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.శాంతికుమారి, గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జావేద్, ఉపాధ్యక్షురాలు భబిత, కోశాధికారి రాజమౌళి, కార్యదర్శులు రజిత, ఫహద్ ఆలీ, శ్రీలత రజిత పాల్గొన్నారు.

అమ్మకానికి కార్పొరేషన్ షాపులు!

- దుకాణాల కేటాయింపు పేరుతో బరితెగింపు
- బల్దియాలో దళారుల దందా
- రూ.3 కోట్లకు భారీ స్కెచ్!
- ఇప్పటికే రూ.కోటి వసూలు?
- అధికారుల పాత్రపైనా అనుమానాలు



ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నిర్మించిన నగరపాలకసంస్థ దుకాణ సముదాయం

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో దళారులు భారీ కుంభకోణానికి తెరతీశారు. అధికారుల అండతో సుమారు రూ.3 కోట్లు వసూలు చేసేందుకు స్కెచ్‌వేశారు. ఇప్పటికే రూ.కోటి వరకు వసూలు చేసినట్లు ప్రచారం. వీధి వ్యాపారులకు నగరపాలక సంస్థ నిర్మించిన దుకాణాలు (మడిగె) కేటాయిస్తామంటూ ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. దుకాణాలు ఎలా కేటాయించాలో ఇప్పటివరకు నిర్ణయం కానప్పటికీ, వీధి వ్యాపారుల ఆశలను సొమ్ము చేసుకుంటూ, ఈ దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

దుకాణ సముదాయ నిర్మాణం

కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ కింద ఎంపికైన నేపథ్యంలో రూ.కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నా యి. ప్రధాన రహదారులతో పాటు పలుప్రాంతాలు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. రోడ్లపై వ్యాపారాలు ఉండరాదనే నిబంధనల మేరకు వీధివ్యాపారులకు నగరంలోని పలుచోట్ల ప్రత్యేక దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రహరీని ఆనుకొని నగరపాలకసంస్థ ఆకర్షణీయమైన దుకాణ సముదాయాన్ని నిర్మించింది. ఇందులో దాదాపు 132 వరకు దుకాణాలు ఉన్నాయి.

కేటాయింపు ఇలా

ఈ సముదాయంలో నిబంధనల మేరకు ట్రేడ్‌లైసెన్స్ పొందిన వీధివ్యాపారులకు దుకాణాల కేటాయింపు ఉంటుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఇప్పటివరకు అక్కడ 25మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరికి ముందు మడిగెలు కేటాయించాలి. అయితే దుకాణాలను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలా, తాత్కాలిక పద్ధతిన ఇవ్వాలా, ఏయే వర్గాలకు ఇవ్వాలనేది నగరపాలకసంస్థ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో ఈ మార్గదర్శకాలపై తీర్మానం చేయాల్సి ఉంటుంది.

రూ.3 కోట్లకు భారీ స్కెచ్

దుకాణల నిర్మాణం పూర్తికాగానే కొంత మంది దళా రులు రంగప్రవేశం చేశారు. 132 దుకాణాలున్న ఈ సముదాయానికి ఉన్న డిమాండ్ మేరకు సుమారు రూ.3 కోట్లు వసూలు చేసేందుకు భారీస్కెచ్ వేశా రు. ఒక్కో మడిగె కేటాయించేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలుకు పూనుకున్న ట్లు విశ్వసనీయ సమాచారం. దుకాణ సముదాయం నిర్మించడంతోనే మడిగే తమకే కేటాయించేలా వీధి వ్యాపారులు తెలిసిన వారితో సంప్రదింపులు చేస్తున్నారు. ఈ కోవలోనే దళారులు గాలం వేస్తున్నారు. తమకు రూ.2 నుంచి రూ.3 లక్షలు ఇస్తే దుకాణం మీ సొంతమవుతుందని, శాశ్వతంగా వ్యాపారం చేసుకోవచ్చని నమ్మబలుకుతున్నారు. రెండు, మూ డు నెలల నుంచి ఈ అక్రమ వసూళ్లు జరుగుతుండగా, ఇప్పటికే రూ.కోటి వరకు కలెక్షన్ అయినట్లు బల్దియావర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అధికారుల పాత్రపై అనుమానాలు

దళారుల దుకాణ దందాలో నగరపాలక సంస్థలోని ఒకరిద్దరు అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దళారులు పాత్రదారులైతే, సూత్రధారులు ఆ అధికారులేననే ఆరోపణలు ఉన్నాయి. తమ ఆధిపత్యం కొనసాగించే అధికారులు ఈ దందాను ప్రోత్సహిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే సముదాయంలో దుకాణాలపై కేటాయింపుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కౌన్సిల్ సమావేశం తీర్మాణం మేరకు నిర్ణయం ఉంటుందని వారంటున్నారు. దుకాణాల దందాపై లోతుగా విచారణ చేపడితే మరిన్ని నిజాలు బయటపడే అవకాశం ఉంది. ఈ దందాను నివారించాలంటే మార్గదర్శకాలు నిర్ణయించి, పారదర్శకంగా కేటాయింపులు జరపాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు.

ఏఐఎస్‌బీ ఆవిర్భావ వేడుకలు



జెండావిష్కరణ చేస్తున్న వంశీధర్‌రెడ్డి, నాయకులు

కరీంనగర్: అఖిల భారత విద్యార్థి బ్లాక్ 73వ వార్షికోత్సవ వేడుకలు రాష్ట్ర కార్యదర్శి మొలుగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి హాజరై జెండా ఆవిష్కరించారు. ఏఐఎస్‌బీ 1951 జూన్ 25న బెంగాల్‌లో ఏర్పడి నేతాజీ ఆలోచన విధానంతో సోషలిజం, శాంతి, అభ్యుదయం అనే నినాదాలతో 72ఏళ్లుగా విద్యార్థుల్లో జాతీయభావాలను పెంపొందిస్తోందని అన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తోందని వివరించారు. ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల హరీశ్‌రెడ్డి, విశ్వం, సుధీర్, గోవర్ధన్, కోనవేణి బాలకిషన్, వంశీకృష్ణ, ఫార్వర్డ్ బ్లాక్ నేతలు అజయ్, శ్రీమాన్, వంశీకృష్ణ, రమేశ్, శంకర్, మహేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి వుషు పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: మహారాష్ట్ర పూణెలోని శివ్‌ ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో ఈనెల 26 నుంచి జూలై 1 వరకు నిర్వహించే జాతీయ స్థాయి సీనీయర్స్‌ వుషు పోటీలకు జిల్లాకు చెందిన కె.సాయికృష్ణ, శ్రీనివాస్‌, శ్రీధర్‌, శ్రీనివాస్‌ ఎంపికైనట్లు వుషు సంఘం కార్యదర్శి విద్యాసాగర్‌ తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్‌ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కోచ్‌లు కోడూరి శేఖర్‌, ఎలంగదుల శ్రీనివాస్‌, రాణావిక్రం, గాంధీ అభినందించారు.

టాలెంట్‌ అసెస్మెంట్‌ టెస్ట్‌ క్యాంప్‌కు వరుణ్‌

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌లో ఐదేళ్లుగా అథ్లెటిక్స్‌లో శిక్షణ అందిస్తున్న వరుణ్‌ కృష్ణన్‌ టాలెంట్‌ అసెస్మెంట్‌ టెస్ట్‌క్యాంప్‌ లెవెల్‌ 2 కోచ్‌కు నేషనల్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ సెంటర్‌కు ఆహ్వానం అందినట్లు జిల్లా అథ్లెటిక్‌ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్‌, కడారి రవి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టాలెంట్‌ ఐడెంటిఫికేషన్‌ టెస్టులో పాలుపంచుకుంటున్న కోచ్‌ వరుణ్‌ను అథ్లెటిక్‌ సంఘం కోశాధికారి టి.హరికిషన్‌, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు, తదితరులు అభినందించారు.

ఇంటర్‌ గ్రూప్‌ ఫైరింగ్‌ పోటీలకు రేవంత్‌

కరీంనగర్‌స్పోర్ట్స్‌: పారమిత ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న బి.రేవంత్‌ కౌశిక్‌ జులై నెల కాకినాడలో నిర్వహించే ఇంటర్‌ గ్రూప్‌ ఫైరింగ్‌ పోటీలకు అర్హత సాధించినట్లు పారమిత పాఠశాల హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. ఇటీవల ఎన్‌సీసీ గ్రూప్‌ నిజామాబాద్‌ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ఇంటర్‌ బెటాలియన్‌ పోటీల్లో ఫైరింగ్‌ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇంటర్‌ గ్రూప్‌ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌ను పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్‌, రశ్మిత, అనూకర్‌ రావు, వినోద్‌రావు, ప్రసాద్‌, హనుమంతరావు, హెచ్‌ఎం బాలాజీ, ప్రశాంత్‌, కవిత, తిరుపతిరావు అభినందించారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన అంజయ్య గౌడ్‌

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన కందుకూరు అంజయ్య గౌడ్‌ తాటిచెట్టు పై నుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. అంజయ్య రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. మోకుజారి చెట్టు పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అంజయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నోట్‌బుక్స్‌ వచ్చేశాయ్‌..

- అవసరం 2,66,121...
- వచ్చినవి 1,40,700

ఇదీ పరిస్థితి...

మొత్తం విద్యార్థులు	37,234
అవసరమైన నోట్‌బుక్స్‌	2,66,121
జిల్లాకు వచ్చినవి	1,40,700
విద్యార్థులకు పంపిణీ చేసినవి	79,000



పుస్తకాలు

కరీంనగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు తోడు ఈసారి నోట్‌బుక్స్‌ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా జిల్లాలోని 16 మండలాల్లో 651 పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్‌బుక్స్‌ అవసరాలను గుర్తించి జిల్లా విద్యాశాఖ రాష్ట్ర పాఠశాల శాఖకు నివేదిక పంపించింది. ఈమేరకు జిల్లాకు సగం నోట్‌బుక్స్‌ చేరుకున్నాయి. మిగతావి విడతల వారీగా చేరుకుంటున్నాయి. జిల్లాలో 651 ప్రభుత్వ పాఠశాలలుండగా ఇందులో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్‌ అందించాలని కార్యాచరణ రూపొందించారు. జిల్లావ్యాప్తంగా 37,234 మంది విద్యార్థులకు 2,66,121 నోట్‌బుక్స్‌ అవసరమని గుర్తించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు జిల్లాకు 1,40,700 పుస్తకాలు చేరుకున్నాయి. నోట్‌బుక్స్‌ పంపిణీ ప్రక్రియలో భాగంగా గోదాముల నుంచి ఎంఈవో కార్యాలయాలకు తరలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే నాలుగు మండలాలకు 79వేల నోట్‌బుక్స్‌ విద్యార్థులకు పంపిణీ చేసినట్లు సమాచారం. పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు తోడు నోట్‌బుక్స్‌ ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం రోజే నోట్‌బుక్స్‌ పంపిణీ చేయాలని అనుకున్న అధికారులకు రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నోట్‌బుక్స్‌ పంపిణీ ఆలస్యమైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎవరికి ఎన్నెన్ని...

తరగతుల వారీగా నోట్‌బుక్కులు విద్యార్థులకు అందించనున్నారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఆరు నోటుబుక్కులు, ఎనిమిదో తరగతికి ఏడు, తొమ్మిది, పది తరగతులకు 14 ఇవ్వాల్సి ఉంది. కస్తూరిబాల్లోని ఇంటర్‌ విద్యార్థినులకు 14 చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చిన నోట్‌బుక్స్‌ తక్కువగా ఉండడంతో నిర్ణీత సంఖ్య కంటే తక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌ నుంచి నోట్‌బుక్స్‌ వచ్చిన వెంటనే ఎంఈవో కార్యాలయాలకు యథావిధిగా పంపిణీ చేస్తున్నామని పుస్తక పంపిణీ విభాగం మేనేజర్‌ లత తెలిపారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్‌...

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. ఈ మేరకు గోదాం నుంచి పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈవోల ద్వారా పాఠశాలల పాయింట్‌కు శరవేగంగా పంపిణీకి ఏర్పాటుచేస్తున్నారు. 70 శాతంపైగా పుస్తకాలు ఇప్పటికే పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. జిల్లాకు 3,27,740 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే 3,26,810 పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరాయని వాటన్నింటిని స్కూల్‌ పాయింట్‌కు చేరవేసి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామని డీఈవో జనార్దన్‌రావు వెల్లడించారు.

ఎమర్జెన్సీతో చీకటి రోజులు

- అరాచకాలు, దౌర్జన్యాలతో దేశాన్ని ఏలిన చరిత్ర కాంగ్రెస్‌ ది



సన్మాన గ్రహీతలతో బీజేపీ నేతలు, వీహెచ్‌పీ

కరీంనగర్‌టౌన్‌: దేశచరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి యుగమని, 1975 జూన్‌ 25 చీకటి రోజుగా చరిత్రలో నిలిచిపోయిందని, దేశంలో ఎమర్జెన్సీ తెచ్చి, అరాచకాలు దౌర్జన్యాలతో దేశాన్ని ఏలిన చరిత్ర కాంగ్రెస్‌దేనని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. మహాజన్‌ సంపర్క్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమర్జెన్సీ డే మేధావుల సదస్సు ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ కోమల ఆంజనేయులు ఆధ్వర్యంలో కరీంనగర్‌ వివేకానంద డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జూన్‌ 25 ఎమర్జెన్సీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన కోమల ఆంజనేయులు, కొమురవెల్లి సదానందం, మంతెన శ్రీమన్నారాయణ, జోగినిపల్లి సంపత్‌రావు, పలకల రాజిరెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గోరక్షక్‌ విభాగ్‌ ప్రముఖ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేశ్‌, పుల్లెల పవన్‌, కోమల ఆంజనేయులు, ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, కళ్లెం వాసుదేవరెడ్డి , పార్లమెంట్‌ కన్వీనర్‌ బోయినపల్లి ప్రవీణ్‌రావు, లీగల్‌సెల్‌ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, అనిల్‌, కొమ్ము రవీందర్‌రెడ్డి, పురం హరి, మామిడి రమేశ్‌, లాల మురళి, రాగి సత్యనారాయణ, రాపాక ప్రవీణ్‌, కిన్నెర అనిల్‌, శీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

- విరాళాలతో అంత్యక్రియలు



కట్ట రమేశ్‌(ఫైల్‌)

కరీంనగర్‌రూరల్‌: అనారోగ్యంతో మృతిచెందిన ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించలేని దీనస్థితిలో కుటుంబసభ్యులుండగా యువకులు స్పందించి విరాళాలు సేకరించారు. నగదును కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటుకున్నారు. మిగిలిన గ్రామాల ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్‌ మండలం దుర్శేడ్‌కు చెందిన స్వర్ణకారుడు కట్ట రమేశ్‌(58) వృత్తి పనులు సక్రమంగా సాగక మెట్‌పల్లిలోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలలుగా అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. భార్య నిర్మల గృహిణికాగా కుమారుడు సూరజ్‌, కుమార్తె సుచితలున్నారు. అయితే అంత్యక్రియలు నిర్వహించలేని కడు పేదరికంలో కుటుంబం ఉండగా గ్రామంలోని యువత స్పందించి వాట్సప్‌ గ్రూప్‌లో పోస్టుచేయడంతో స్పందించిన యువత విరాళాలు ప్రకటించారు. ఉపసర్పంచ్‌ సంపత్‌రావు ఆధ్వర్యంలో యువకులు రూ. 10వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందించగా అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అంత్యక్రియలకు విరాళాలను అందించి మానవత్వం ప్రదర్శించిన యువకులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

డ్రైవర్‌ నిర్లక్ష్యం.. ప్రయాణికులకు గాయాలు



ప్రమాదానికి గురైన వాహనం



సంఘటన స్థలంలో గుమిగూడిన జనం



ఘటన స్థలం వద్ద క్షతగాత్రులు



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు

తిమ్మాపూర్‌: దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన 15 మంది బృందం సభ్యులు శనివారం కాళేశ్వరం దైవదర్శనానికి వెళ్లి ఆదివారం తిరిగి వస్తుండగా తిమ్మాపూర్‌ మండలం కొత్తపల్లి శివారులో వీరు ప్రయాణిస్తున్న తుఫాన్‌ వాహనం ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈక్రమంలో అదుపుతప్పి పక్కనున్న పాలడెయిరీ కాంపౌండ్‌ వాల్‌కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సోమయ్య, లక్ష్మీ, భాగ్యమ్మ సత్యనారాయణతో పాటు మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్‌ రవికి తీవ్ర గాయాలు కాగా మరికొందరు పిల్లలు స్వల్పంగ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌ అంతరాయం లేకుండా ట్రాక్టర్‌ను పక్కకు జరిపి ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్‌ అతివేగం, అజాగ్రత్తతో వాహనం నడపగా ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



రాజమౌళి(ఫైల్‌)

ఎలిగేడు: మండలంలోని లోకపేట గ్రామానికి చెందిన వెలిచాల రాజమౌళి(55) గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గీత కార్మికుడు రాజమౌళి రోజువారిగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా మోకు జారడంతో చెట్టుపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా రు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్‌ ప్రభావతి, గీత కార్మికులు, గ్రామస్తులు కోరారు.

ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు..

చందుర్తి(వేములవాడ) : ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దోకూరి పున్నమ రెడ్డి అనే రైతు వద్ద బిహార్‌కు చెందిన సుజిత్‌కుమార్‌ (19) కూలీగా చేరాడు. పశువుల పాక (డైయిరీ ఫామ్‌)లో ఆదివారం ఉదయం ఆవు పాలు పితికి బయటకు వచ్చే క్రమంలో సుజిత్‌ కుమార్‌ పేడపై కాలుజారి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సిమెంటు స్తంభంపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలుకాగా అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడే పనిచేస్తున్న కూలీలు వచ్చి చూడగా సుజిత్‌కుమార్‌ మృతిచెందాడు. యువకుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం వారి బంధవులకు మృతదేహాన్ని అప్పగించినున్నట్లు ఎస్సై రమేశ్‌ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి–రాళ్లపేట గ్రామ శివారు మూలమలుపు వద్ద ఆదివారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్‌ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ తనద్విచక్ర వాహనంపై మండెపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చంద్రంపేటకు చెందిన రాజు, స్వరూప ప్యాసింజర్‌ ఆటోలో ఓబులాపూర్‌కు వెళ్తుండగా మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌ రాజు (45), ప్రయాణికురాలు స్వరూప (25)కు తీవ్ర గాయాలుకాగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళ మెడలోంచి పుస్తెలు చోరీ



బాధితురాలు లక్ష్మి

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమణి లక్ష్మి అనే మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. ఇబ్రహీంపట్నం మండలం బర్దీపూర్‌ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మెడలోని నల్లపూసల గొలుసుకున్న పుస్తెలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

సెల్‌టవర్‌ బ్యాటరీలు చోరీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్‌ గ్రామంలో ఎయిర్‌టెల్‌ సెల్‌టవర్‌ వద్ద శనివారం రాత్రి బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై ఉమాసాగర్‌ ఆదివారం తెలిపారు. టవర్‌ వద్ద 24 బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కంపెనీ సూపర్‌వైజర్‌ హుస్సేన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మంథని: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి బైక్‌ అదుపుతప్పి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం సమ్మయ్య తాపీమేస్త్రీ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓడేడు–గోదావరిఖని రహదారిపై వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

కిడ్నీ సంబంధిత వ్యాధితో వ్యక్తి మృతి

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్‌ (35) కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్‌ గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌, చెప్పుల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ్య (30) కుమారులు అరవింద్‌ (16), రాకేష్‌, (13), కూతుళ్లు శ్రావణి (10), హిమబిందు (7), జున్ను (4), ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్‌ నందగిరి లింగం అన్నారు.

తల్లీకుమారుడి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటన మండలంలోని బుగ్గ రాజేశ్వరతండాలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు మేరీ (28) చిన్న కుమారుడు శివాన్ష్‌తో కలిసి తల్లిగారి ఇల్లు అయిన రాచర్ల గుండారం గ్రామానికి వెళ్తున్నానని చెప్పగా భర్త అనిల్‌ ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లో శనివారం కామారెడ్డి డిపో బస్సు ఎక్కించాడు. ఆది వారం ఫోన్‌చేయగా స్విచ్ఛాప్‌ రావడంతో అనుమానం వచ్చి గుండారంలోని అత్తగారింటికి ఫోన్‌ చేశాడు. అక్కడికీ రాలేదని వారు తెలపడం, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అనిల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాతలసాయంతో అంత్యక్రియలు పూర్తి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన గౌడిసెల దేవయ్య (45) శనివారం సాయంత్రం గ్రామశివారులోని కల్వర్టు వద్ద కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో పోస్టుమార్టం కూడా ఆలస్యంగా నిర్వహించారు. మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి చెందినవారు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేశారు. జెడ్పీటీసీ పూర్మాణి మంజుల రాంలింగారెడ్డి దంపతులు రూ.5,016 తోపాటు దాతల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై ఇప్పటికే తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

రెండు పార్టీల మధ్య ఫ్లెక్సీల వివాదం!

- మక్కాన్‌సింగ్‌ ఫ్లెక్సీలను తొలగించి బీఆర్‌ఎస్‌ ఫ్లెక్సీల ఏర్పాటు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్‌ శ్రేణులు



కాంగ్రెస్‌ ఫ్లెక్సీని కింద పడేసిన దృశ్యం

రామగుండం: పట్టణంలోని ఓ ప్రయివేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం నేపథ్యంలో పట్టణంలోని అంబేద్కర్‌ విగ్రహం, జీరోపాయింట్‌, అయోధ్యనగర్‌ కూడళ్లలో ఏర్పాటుచేయగా అప్పటికే కాంగ్రెస్‌ డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ ఫ్లెక్సీలు కట్టి ఉన్నాయి. దీంతో వాటిని తొలగించి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే ఫ్లెక్సీలు ఏర్పాటుచేసుకున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్‌ స్పందిస్తూ ఫ్లెక్సీలను తొలగించిన పారిశుధ్య సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ ఆదేశాలతో తొలగించినట్లు పేర్కొనగా ఇదే విషయమై కమిషనర్‌ సుమన్‌రావును కాంగ్రెస్‌ ప్రతినిధులు ఫ్లెక్సీల తొలగింపుపై వివరణ కోరారు. పారిశుధ్య సిబ్బందికి కొన్నిరోజుల క్రితమే అన్ని పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించామని ఈ రోజు తొలగించడం వివాదాస్పదంగా మారిందన్నారు. కాగా ఆదివారం ఫ్లెక్సీలను తొలగించాలని తాను ఆదేశించలేదని, తమకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదని సమాధానమివ్వడంతో కాంగ్రెస్‌ శ్రేణులు శాంతించారు. ఫ్లెక్సీల తొలగింపుపై రాబోయే రోజుల్లో అధికారులు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

జమ్మికుంట: అకారణంగా దూషించిన వ్యక్తిపై ఎస్సై యూనిస్‌ అహ్మద్‌ అలి కేసు నమోదుచేసినట్లు ఆదివారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్‌ సర్పంచ్‌ రాసపల్లి సదయ్యను అదే గ్రామానికి చెందిన రాసపల్లి రమేశ్‌ అనేవ్యక్తి వారి తల్లితండ్రులకు దళితబంధులో కారు ఇప్పించడంతో తన సోదరుడు కారు నడుపుకుంటున్నాడని దీంతో నాకు నష్టం వాటిల్లిందని సదయ్య ఇంట్లోకి చొరబడి అకారణంగా దూషించాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దుకాణంలో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌ రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో శనివారం అర్ధరాత్రి నగదుతోపాటు సీసీ కెమెరాల సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కరీంనగర్‌ రోడ్డులో ఐటీసీ బ్రాండ్‌ హోల్‌సెల్‌ దుకాణాన్ని ఊటూరు మహేశ్‌ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి కౌంటర్లలో సుమారు రూ.80 వేలు నగదు, రూ.50వేలు విలువైన బంగారు కాయిన్స్‌, రూ.4వేల విలువైన వెండి కాయిన్స్‌ ఉంచి, తాళాలు వేసి వెళ్లారు. తెల్లారేసరికి షెట్టర్‌ పగులగొట్టి ఉండటంతో పాటు నగదు కనిపించకపోవడంతో పోలీసులు సమాచారం అందించారు. పట్టణ సీఐ నటేశ్‌, ఎస్సై రమేశ్‌, అబ్దుల్‌ రహీం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా మారుతి వ్యాన్‌లో ముగ్గురు వ్యక్తులు వచ్చి దొంగతనం చేసినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్‌ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



రాజేందర్‌

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌ కాలనీ అల్లూరుకు చెందిన సింగరేణి రిటైర్డ్‌ కార్మికుడు గుర్రం రాజయ్యగౌడ్‌ రెండో కుమారుడు రాజేందర్‌గౌడ్‌ అదృశ్యమయ్యాడు. రాజేందర్‌ తండ్రి కథనం ప్రకారం.. రాజేందర్‌కు ఏనిమిదేళ్ల క్రితం మచ్చుపేటకు చెందిన యువతితో వివాహమైంది. కొన్నిరోజులుగా అతడి అత్తామామ, భార్య ఆస్తిపంచాలని గొడవపడుతున్నారు. ఈ విషయమై కొన్నిరోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో రాజేందర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేశారు. పోలీసులు కౌన్సెలింగ్‌ ఇచ్చి రాజేందర్‌కు రావాల్సిన వాటాభూమి, ఇల్లు ఇవ్వాలని తీర్మానించారు. తాము ఒప్పుకున్నప్పటికీ తరచూ గొడవపడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం రాజేందర్‌ ఇంటినుంచి వెళ్లిపోయాడని, బైక్‌ కవర్‌లో సెల్‌ఫోన్‌, పర్సు, లేఖ లభించిందన్నారు. తాను చనిపోతున్నానని, ఇందుకు తన అత్తామామలతో పాటు భార్య కారణమని రాసి ఉందని రాజయ్య పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్‌ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

'శిశుమందిర్'కు రూ.5 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న కరుణాకర్‌రెడ్డి

విద్యానగర్: కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు పిన్నింటి ఇంద్ర కరుణాకర్ రెడ్డి ఆదివారం రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. బడిలో నిర్మిస్తున్న నూతన భవనంలో తమ కుమారుడు పిన్నింటి మణికంఠ నిఖిల్ రెడ్డి జ్ఞాపకార్థం ఒక గది నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి కోల అన్నారెడ్డి, విద్యాసమితి అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి, రజనీ ప్రియ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్‌రావు, సంక్షేమ ట్రస్ట్ నిర్వాహకుడు రాజిరెడ్డి, పాఠశాల ప్రధానాచార్యుడు సముద్రాల రాజమౌళి, పూర్వ విద్యార్థి విశ్వనాథ్ వినోద్ పాల్గొన్నారు.

3న టీచర్లకు సన్మానం



సమావేశంలో పాల్గొన్న సంఘం బాధ్యులు

విద్యానగర్: జూలై 3న వ్యాస పూర్ణిమ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురు వందనం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని అసోసియేషన్‌కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌సీ వేసి, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా టీచర్లకు పదోన్నతులు ఇవ్వలేదని, వెంటనే ఇచ్చి, బదిలీలు చేపట్టాలన్నారు. గురు వందనం కార్యక్రమంలో ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి గన్నమనేని రంగారావు, నాయకులు తిరుపతిరావు, రామస్వామి, పవన్‌కుమార్, సత్యం, మనోహర్, కరుణాకర్‌రావు, నాగరాజు, సాయన్న, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు పూజలు



కరీంనగర్ రూరల్: గోపాల్‌పూర్‌లో ఆదివారం ట్రాక్టర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు పూజలు నిర్వహించారు. బోనాలు చేసి, గొర్రె పోతులతో బండిని కట్టి, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా చెరువు కట్ట వద్దకు వెళ్లి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ ఊరడి మంజుల, ఉపసర్పంచ్ ఆరె శ్రీకాంత్, దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ గోనె నర్సయ్య, ట్రాక్టర్ యజమానుల సంఘం అధ్యక్షుడు అనుముల వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ముస్కు మల్లారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కరీంనగర్‌రూరల్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని ముదిరాజ్ యువసేన కరీంనగర్ మండల అధ్యక్షుడు జెట్టి సతీశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ ద్రోహి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ తెలంగాణచౌక్ ఫీడర్ పరిధిలోని కశ్మీర్‌గడ్డ, శ్రీనగర్‌కాలనీ, ఎమ్మార్ గార్డెన్, గోదాంగడ్డ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ సాయికృష్ణ ఫీడర్ పరిధిలోని భగత్‌నగర్, ముకరంపుర, తెలంగాణచౌక్ నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, కలెక్టరేట్ కాంప్లెక్స్ ముందు ప్రాంతాలతోపాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ గీతాభవన్ ఫీడర్ పరి ధి రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, రాజీవ్‌పార్కు, సహజ అపార్ట్‌మెంట్, ధన్గర్‌వాడీ స్కూల్, కమల్ నిర్మల్ అపార్ట్‌మెంట్, పాత లేబర్ అడ్డా, ఆకుల శైలజ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో.. భూముల వివరాలు

- ఈ నెల 8 నుంచి 10 వరకు సేకరించిన ఏఈవోలు
- కరీంనగర్ మండలంలో 15 వేల ఎకరాల్లో పంటల సాగు



తాహెర్‌కొండాపూర్‌లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

కరీంనగర్‌రూరల్: ప్రతి సీజన్‌లో ప్రకృతి విపత్తులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో సాగు భూముల స్థితిగతులపై సమగ్ర సర్వే చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కరీంనగర్ మండలంలో ఈ నెల 8 నుంచి 10 వరకు ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి, గ్రామాల వారీగా భూముల వివరాలు సేకరించారు. ఆయా గ్రామాల్లోని సాగునీటి వనరులు, ఆయకట్టు విస్తీర్ణం తదితర సమాచారం నమోదు చేశారు. మొత్తం 15,478 ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని గుర్తించారు. మండలంలో నాలుగు క్లస్టర్లు దుర్శేడ్, నగునూరు, చామనపల్లి, మొగ్దుంపూర్ ఉన్నాయి. వీటి పరిధిలో 186 బోర్ల కింద 91 ఎకరాలు, 4,384 వ్యవసాయ బావుల కింద 1,916 ఎకరాలు, ఎస్సారెస్పీ కాలువల కింద 11,784 ఎకరాలు, 73 చెరువుల కింద 1,169 ఎకరాలు, వర్షాధారంగా 518 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని అధికారులు తెలిపారు.

ఏటా సాగుకు ముందు, తర్వాత..

ప్రతి సంవత్సరం పంటల సాగు వివరాలను వ్యవసాయశాఖ సేకరిస్తోంది. ముందస్తుగా పంటల సాగు విస్తీర్ణం అంచనా వేసి, పంటలు వేసిన తర్వాత మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి, సాగు లెక్కలు తేలుస్తున్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఏఈవోలు క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ కాలువలు, బావుల కింద ఎంత సాగవుతుంది.. విద్యుత్ వినియోగం ఎంత అనే సమాచారం సేకరించారు.

నివేదిక అందించాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు భూములపై ఏఈవోల ద్వారా సర్వే పూర్తి చేయించాం. గ్రామాల వారీగా భూముల వివరాలు సేకరించి, జిల్లా వ్యవసాయశాఖకు నివేదిక అందించాం.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి, కరీంనగర్ రూరల్

వేగంగా ధ్రువపత్రాల జారీ

- సర్వర్ సమస్య వల్లే కొంత ఆలస్యం
- దరఖాస్తు వచ్చిన వెంటనే పరిశీలిస్తున్నాం
- ఇంటింటా ఓటరు పరిశీలనతో సత్ఫలితాలు
- 'సాక్షి' ముఖాముఖిలో కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ గడ్డం సుధాకర్

ముఖాముఖి



కరీంనగర్ అర్బన్: బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయానికి అవసరమైన ధ్రువపత్రాలను వేగంగా జారీ చేస్తున్నామని కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ గడ్డం సుధాకర్ తెలిపారు. ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియ సాగుతోందని, సర్వర్ సమస్య వల్లే కొంత ఆలస్యమైందన్నారు. విద్యార్థులకు, వివిధ అవసరాల కోసం ధ్రువపత్రాలు అవసరమైన వారు దరఖాస్తు ఇచ్చిన వెంటనే పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటరు పాత్ర కీలకమని, సంపూర్ణ ఓటరు నమోదు, పోలింగ్ జరిగినప్పుడే ప్రజారంజక పాలన సాధ్యమన్నారు. అందుకే పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ఇంటింటా ఓటరు పరిశీలన చేపట్టామని, ఆ కార్యక్రమం సత్ఫలితాలనిచ్చిందని వివరించారు. ఎన్నికల ప్రక్రియతోపాటు సాధారణ విధులను నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ధ్రువపత్రాల జారీ, రేషన్ దుకాణాల్లో అక్రమాలు, గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర అంశాలపై ఆయన 'సాక్షి' ముఖాముఖిలో వివరాలు వెల్లడించారు.

10 వేలకు పైగా దరఖాస్తులు..

బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటన నేపథ్యంలో కరీంనగర్ అర్బన్ మండలంలో 10 వేలకు పైగా దరఖాస్తులు కేవలం ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసమే వచ్చాయి. వాటన్నింటిని పరిశీలించి జాప్యం లేకుండా జారీ చేశాం. సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారన్నది అవాస్తవం.

అదనంగా వసూలు చేస్తే చర్యలు

అర్జీదారు నుంచి నిర్దేశించిన రుసుము కంటే అదనంగా వసూలు చేస్తే మీసేవ కేంద్రాలను సీజ్ చేస్తాం. ఏ సేవకు ఎంత రుసుము ఇవ్వాలో సూచించే బోర్డును కచ్చితంగా ప్రదర్శించాలి. ఒకే కేంద్రం పేరిట బోగస్ కేంద్రాలను నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

రేషన్ దుకాణాలపై నిఘా

రేషన్ దుకాణాలను గిర్దావర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా చూస్తున్నాం. బియ్యం వద్దనుకునేవారు కార్డు రద్దు చేసుకోవడం ఉత్తమం. ఫిజికల్‌గా క్లోజింగ్ బ్యాలెన్స్ చూశాకే అలాట్‌మెంట్ చేస్తున్నాం.

గ్యాస్ వినియోగదారులు ఫిర్యాదు చేయాలి

గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తే మాకు ఫిర్యాదు చేయాలి. సదరు వ్యక్తితోపాటు గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం. తూకం కూడా సరిగా ఉందో లేదో చూసుకొని, గ్యాస్ బండ తీసుకోవాలి.

ఓటరు నమోదుపై అవగాహన

నగరంలోని డివిజన్లలో బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 15 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించాక అర్హులందరినీ జాబితాలో చేరుస్తాం.

ఇక ఓట్ల గల్లంతుండదు..

గతంలో జరిగిన ఎన్నికల్లో ఓట్ల గల్లంతుపై ఆందోళనలు జరిగేవి. ఈసారి అలాంటి పరిస్థితి లేదు. ఎందుకంటే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జాబితాలిచ్చాం. మరణించిన వారి పేర్ల తొలగింపు, బూత్‌ల మార్పు, కొత్త ఓటర్ల నమోదు వంటివాటిలో వారిని భాగస్వాములను చేశాం.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అర్జీల పరిశీలన

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆమోదిస్తున్నాం. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, మంజూరుకు పంపిస్తున్నాం. చెక్కులు వచ్చాక లబ్ధిదారులకు అందిస్తున్నాం. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

250కి పైగా పోలింగ్ కేంద్రాలు

గతంలో పట్టణంలో 1,200 ఓట్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేది. అర్బన్‌లో పురుష ఓటర్లు 1,13,802 మంది ఉండగా మహిళలు 1,11,529 మంది ఇతరులు 20 మంది ఉన్నారు. 250కి పైగా పోలింగ్ కేంద్రాలున్నాయి. అయితే 1,500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.

రేషన్ దుకాణాలపై నిఘా

నగర అభివృద్ధిలో 'పొన్నం'ది కీలక పాత్ర

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగర అభివృద్ధిలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ది కీలక పాత్ర అని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్ అన్నారు. ఆదివారం గోదాంగడ్డ ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ ఎంపీ పొన్నం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పనులను వివరించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రతి సామాన్యుడికి, పేదవాడికి, యువతకు, విద్యార్థులకు, మహిళలకు, చిరు వ్యాపారులకు సమన్యాయం చేస్తామన్నారు. పొన్నంను, కాంగ్రెస్ పార్టీని చులకన చేసి మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు తన గతాన్ని మర్చిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నం శ్రీనివాస్, అనిల్, నవాజ్ హుస్సేన్, బుర్ర నాగరాజు, భరత్, సంతోష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు గుడాల రవి, నాయకులు ముజ్జు, ముజాయిద్, జాఫర్, సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న మహిళా నాయకులు

కరీంనగర్‌టౌన్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సుజాతరెడ్డి ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. ప్రపంచంలో అన్ని దేశాలు ఆర్థికమాంద్యంలో చిక్కుపోయిన తరుణంలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తొమ్మిదేళ్లలో కేంద్రం అమలు చేసిన పథకాలు, చేపట్టిన పనులపై ప్రచారం చేశారు. నాయకులు రాగుల లక్ష్మి, పాముల జ్యోతి, స్వర్ణ, మేకల మల్ల మ్మ, కళ్లెపెల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

నగునూర్‌లో భక్తి సంగీత విభావరి



పాటలు పాడుతున్న మండలి సభ్యులు

విద్యానగర్: కరీంనగర్ మండలంలోని నగునూర్ శ్రీదుర్గాభవాని ఆలయంలో ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన శివ రామకృష్ణ భజన మండలి సభ్యులు పాడిన పాటలతో భక్తులు తన్మయత్వం చెందారు. భజన మండలి బాధ్యులు పంజాల శ్రీధర్ గౌడ్ భక్తి పాటలు పాడారు. మండలి అధ్యక్షుడు గర్రెపల్లి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి చల్లా మోహన్‌రెడ్డి, బాధ్యులు ఏజ్జ శ్రీనివాస్, గర్రెపల్లి ఆంజనేయులు, రాజు, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీదుర్గాభవాని అమ్మవారికి పూజలు



క్యారెట్ మాలల అలంకరణలో అమ్మవారు

నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం శాకాంబరీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని క్యారెట్ మాలలతో అలంకరించారు. ఆలయ పూజారులు విశేష హారతులిచ్చి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గీతామందిరంలో సామూహిక కుంకుమార్చన



కరీంనగర్‌కల్చరల్: అశోక్‌నగర్‌లోని మళయాళ సద్గురు గీతామందిరంలో ఆషాఢ మాస శాకాంబరి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. గీతామందిర పీఠాధిపతి విష్ణుసేవానంద గిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు అభిషేక, అర్చనలు జరిపారు. అర్చకుడు విష్ణుమూర్తిశర్మ, గుండా రాధాకిషన్, తొడుపునూరి నీరజ, లక్ష్మి, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

రామడుగు(చొప్పదండి): అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు మండలంలోని వెలిచాలలో ఆదివారం పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాడె శంకర్, పార్టీ అధ్యక్షుడు బి.తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం పేదలకు అందని ద్రాక్షే

జమ్మికుంట(హుజూరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయకుండా, కార్డు ఉన్నవారికే గృహలక్ష్మి పథకం వర్తిస్తుందనడం పేదలకు అందని ద్రాక్షే అవుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆరోపించారు. ఆదివారం జమ్మికుంటలోని స్వగృహంలో మాట్లాడారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుతుందన్నారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

రామడుగు(చొప్పదండి): గుండి గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించనున్న అచూర్‌ఖానా భవన్ (పీరీల భవన్) పనులకు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని, కమ్యూనిటీ భవనాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందన్నారు. సర్పంచ్ మానస, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం కమిటీ సభ్యులు రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. రాంచంద్రాపూర్ బీఆర్‌ఎస్ కార్యకర్త ఈరెల్లి రాజశేఖర్ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందగ ఆయన కుటుంబానికి రూ.2 లక్షల పార్టీ బీమా చెక్కు ఇంటికి వెళ్లి అందజేశారు.

రూ.లక్ష సాయం అర్జీలపై విచారణ



దుర్శేడ్‌లో విచారణ జరుపుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

- దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి, వివరాలు సేకరిస్తున్న అధికారులు
- నేటితో ముగియనున్న ప్రక్రియ
- కరీంనగర్ మండలంలో 957 అర్జీలు

కరీంనగర్‌రూరల్: బీసీ సామాజిక వర్గంలోని 14 కులవృత్తులతోపాటు ఎంబీసీలకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. బీసీ కార్పొరేషన్‌కు వచ్చిన అర్జీలను మండలాలు, పట్టణాల వారీగా విభజించి, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లకు పంపించారు. కరీంనగర్ మండలంలో మొత్తం 957 దరఖాస్తులు రాగా వీటిలో 258 కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, వల్లంపహాడ్, తీగలగుట్టపల్లి నుంచి వచ్చాయి. వీటిని కమిషనర్‌కు పంపించారు. మిగతా 699 అర్జీలపై శనివారం నుంచి ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు విచారణ జరుపుతున్నారు. ఆదివారం దుర్శేడ్, గోపాల్‌పూర్, చామనపల్లిల్లో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి జీపీ కార్యదర్శులతో కలిసి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి, వివరాలు సేకరించారు. వృత్తికి సంబంధించిన పనిముట్లు పరిశీలించి, పని విధానాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట దుర్శేడ్ పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ గాజుల అంజయ్య తదితరులున్నారు.

దివ్యాంగులు, ఒంటరి మహిళలకు..

రూ.లక్ష ఆర్థికసాయం కోసం లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. చేతివృత్తులతోపాటు సంచార జాతులకు మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించింది. బీసీల్లోని 14 కులవృత్తులతోపాటు ఎంబీసీల్లో స్థానికంగా ఉంటూ ఆర్థిక ఇబ్బందులున్న వారిని గుర్తించి, రెండో ప్రాధాన్యత కింద సాయం చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొంది. అంతేకాకుండా నిర్దేశించిన కులాల్లో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుద్యోగ యువత ఉన్నట్లయితే ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది.

అనర్హులను తొలగిస్తాం..

రూ.లక్ష ఆర్థికసాయం కోసం వచ్చిన దరఖాస్తులపై గ్రామాలవారీగా విచారణ జరుపుతున్నాం. సోమవారంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. వచ్చిన అర్జీల్లో అనర్హులుంటే తొలగిస్తాం. అర్హుల జాబితా రూపొందించి, బీసీ కార్పొరేషన్‌కు పంపిస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి



కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏడాది క్రితం ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న వ్యవసాయ కనెక్షన్లను తొలగించడంతో నిరుపయోగంగా మారింది. తొలగించేందుకు గ్రామ పంచాయతీ డబ్బులు చెల్లించాలని అధికారులు చెప్పడంతో నిధుల కొరతతో చెల్లించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కరీంనగర్ రూరల్

ప్రమాదకరంగా డ్రెయినేజీ

చిత్ర కథ



నగరంలోని రాంనగర్ పీటీసీ ప్రాంతంలో స్మార్ట్‌సిటీలో భాగంగా కూడలిలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను అర్ధంతరంగా వదిలేశారు. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచివుంది. సీసీ రోడ్డు కింది భాగంలో మట్టి లేకపోవడంతో భారీ వాహనాలు వెళ్లినప్పుడు కుంగిపోయి, కూలే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు ఇటువైపు చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, త్వరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

పెరిక సంఘం నగర కార్యవర్గం ఎన్నిక



కరీంనగర్‌టౌన్: పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్ అధ్యక్షతన జ్యోతినగర్‌లో సంఘం నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా కందుల అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా బోళ్ల మురళీధర్, ప్రధాన కార్యదర్శిగా ముద్దసాని రాజశేఖర్, కోశాధికారిగా ఇత్తినేని కనకయ్య, ఉపాధ్యక్షులుగా బుద్దే రామచంద్రం, బెడిద కరుణాకర్, జాయింట్ సెక్రటరీలుగా తంబురపు సతీశ్, రామినేని సంపత్, కారుకూరి హరిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దాసరి అశోక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు పోకల నాగయ్య, బసవ వెంకన్న, మార్త వేణుగోపాల్, ముద్దసాని సంపత్ తదితరులు పాల్గొన్నారు.



పులకరిస్తున్న 'గడప'!

- 83,83,908 గృహాలను సందర్శించిన ఏపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: ఓట్లు దండుకుని మొహం చాటేసిన మనుషులనే ఇన్నాళ్లు చూశాం! ఎన్నికలు ముగియగానే మేనిఫెస్టోను మాయం చేసి చెత్తబుట్ట పాలు చేసిన పార్టీల గురించే మాకు తెలుసు! అధికారం చేపట్టాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి గ్రామాల వైపు తిరిగి చూడని నేతల పాలనలో దశాబ్దాల పాటు నలిగిపోయాం! మళ్లీ ఎన్నికలు వస్తే గానీ మా గుమ్మం తొక్కని నాయకులతో విసిగిపోయాం! అలాంటిది.. చరిత్రలో తొలిసారిగా 99 శాతం హామీలను నెరవేర్చి చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో మా గుమ్మం వద్దకు వస్తున్న ప్రజా ప్రతినిధులను ఇప్పుడే చూస్తున్నాం..! ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?.. ఆశీర్వదించండంటూ ఆత్మీయంగా గడప గడపనూ పలుకరిస్తున్న నాయకులను చూడటం ఇదే మొదటిసారి అని ఏపీ ప్రజానీకం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం'కార్యక్రమంతో ప్రతి గడప పులకరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఈ నెల 20వతేదీ నాటికి ఎమ్మెల్యేలు 83,83,908 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరించి వారి ఆశీర్వాదాలను పొందారు. రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకుగానూ ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు 9,316 సచివాలయాలను సందర్శించారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల వారీగా పర్యటిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ ఆయా కుటుంబాలతో టిక్ పెట్టిస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన, ప్రాధాన్యత కలిగిన పనులను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున అత్యంత ప్రాధాన్యత పనులను గుర్తించి వెంటనే మంజూరు చేస్తున్నారు.

నిస్తేజం.. గందరగోళం!

పవన్ కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం

- వివాదాల సుడిగుండంలో వారాహి యాత్ర.. టీడీపీతో పొత్తు ప్రస్తావనతో పడిపోయిన గ్రాఫ్
- దానిని నిలబెట్టుకునే ఎత్తుగడతో బోల్తా
- సవాళ్లను స్వీకరించకుండా పలాయన మంత్రం
- అజెండా లేకుండానే ఉమ్మడి 'తూర్పు'న ముగింపు
- వ్యక్తిగత విమర్శలతో మసకబారిన అభిమానం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశ, దిశ నిర్దేశం లేకుండానే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర ముగిసింది. తూర్పు సెంటిమెంట్‌గా ఈ నెల 14న అన్నవరం సత్యదేవునికి పూజలు నిర్వహించి, పవన్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పార్టీ నిర్దిష్ట అజెండా గురించి తన నాయకుడు వివరిస్తారని భావించిన ఆయన అభిమానులకు నిరాశే ఎదురైంది. కాకినాడ జిల్లా కత్తిపూడి మొదలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం జరిగిన ముగింపు సభ వరకూ వరుసగా వివాదాలు మూటగట్టుకున్నారు. సహజంగా ఏ రాజకీయ పార్టీ అయినా ఇటువంటి యాత్రలు చేసేటప్పుడు పార్టీ విధానపరమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతుంది. తమకు ఓటేస్తే ప్రజలకు ఏం చేయదలుచుకున్నారో అర్థమయ్యేలా వివరిస్తూ.. వారి మనసు చూరగొనే ప్రయత్నం చేస్తుంది. పవన్ అభిమానులు, ఆ పార్టీ నేతలు ఆయన నుంచి ఇవే ఆశించారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా వన్‌మేన్ ఆర్మీ మాదిరిగా ఉమ్మడి తూర్పు గోదావరిలో పవన్ తన యాత్రకు ముగింపు పలికారు. పార్టీకి ఒక అజెండా అంటూ లేకపోవడం జనసేన నేతలకు రుచించ లేదు.



ద్వారంపూడి, ముద్రగడపై విమర్శలతో పెనుదుమారం

వారాహి యాత్రలో పవన్ వ్యాఖ్యలపై పెనుదుమారం రేగింది. రెండవ సారి గెలుపొందిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి నేతలే లక్ష్యంగా పవన్ ప్రసంగం సాగడం సొంత సామాజిక వర్గ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే, కాపు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత ముద్రగడ పద్మనాభం లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేయడం రాష్ట్ర స్థాయిలో పెను దుమారాన్నే రేపింది. అటు ద్వారంపూడి, ఇటు ముద్రగడ సంధించిన అనేక ప్రశ్నలకు, వచ్చే ఎన్నికల్లో పోటీపై విసిరిన సవాళ్లకు పవన్ సమాధానం చెప్పకుండానే తోక ముడిచారనే విమర్శను మూటగట్టుకోవాల్సి వచ్చింది. గుండె ధైర్యం ఎక్కువని పదేపదే చెప్పుకునే ఆయన.. వారి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారని ఎదురు చూశామని, తీరా చివరకు తల దించుకునేలా చేశారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒకపక్క జనసేనకు కులాల అంతరాలు లేవంటూనే మరోపక్క తన ప్రసంగాల్లో కులాల ప్రస్తావనతో యువతలో పవన్ భావోద్వేగాలు రెచ్చగొట్టిన తీరును మేధావి వర్గం తప్పు పడుతోంది. పవన్ వాడిన పదజాలంపై రాజకీయాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత 'రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు ఇదేనా మీరిచ్చే సందేశం' అంటూ చురకలు అంటించడం గమనార్హం.

అయినా.. మారలేదు

రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు చాలా తేడా ఉంటుందని చెబుతూనే ప్రసంగాలు, హావభావాల్లో పక్కా సినిమా స్టైల్‌ను ప్రదర్శించడంలో పవన్ ఔచిత్యాన్ని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. తాను సీఎం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని కత్తిపూడిలో చెప్పుకున్న పవన్.. పచ్చ మీడియా ఇంటర్వ్యూల్లో ఏదో అభిమానులు అలా అంటూంటే వారిని ఉత్సాహ పరిచేందుకు అలా మాట్లాడాననడం ఒక పార్టీకి నాయకత్వం వహించే నాయకుడి లక్షణమా అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మార్పు రావాలని గొంతెత్తిన జనసేనాని తాను మారలేదనే విషయాన్ని వారాహి యాత్ర ద్వారా చెప్పకనే చెప్పారని ఆ వర్గాలు అంటున్నాయి. గోదావరి నేలను వదిలేది లేదని, ఈ జిల్లాలు రాజకీయ మార్పునకు నాంది పలుకుతాయని చెప్పిన పవన్.. వచ్చే ఎన్నికల్లో పోటీపై గత ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పూటకో మాటతో అభిమానులను గందరగోళంలో పడేశారు.

ఆ పార్టీ నేతలే పెదవి విరుపు

మంగళగిరిలో తెలుగుదేశంతో పొత్తు అనగానే గోదావరి జిల్లాల్లో పవన్ గ్రాఫ్ పడిపోయింది. 80వ దశకంలో వంగవీటి మోహన్ రంగా హత్యోదంతం నుంచి.. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబం పైన, కాపు సామాజికవర్గం పైన చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను గుర్తుకు తెచ్చుకుని.. సామాజిక మాధ్యమాల్లో పలువురు పవన్ తీరును ఏకి పారేశారు. ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకో లేక కాస్తో కూస్తో బలం ఉన్న గోదావరి జిల్లాల్లో బలప్రదర్శన ద్వారా పొత్తుల్లో సీట్లు పెంచుకునేందుకో వారాహి యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాత్రలో తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. పుష్కర కాలంగా పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటున్న ఇన్‌చార్జిలకు సైతం వారాహిపై వేదిక పంచుకునే అవకాశం ఇవ్వకుండా దూరం పెట్టడంపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి 'తూర్పు'న వారాహి యాత్ర అనేక వివాదాలు, అసంతృప్తులతో ఆ పార్టీ అభిమానులకు తీవ్ర నిరాశ మిగిల్చింది.

ప్రాణ రహిత!

▶ మొదటి పేజీ తరువాయి

మహాదేవ్ కొండల్లో జన్మించిన వెయిన్‌గంగా నది మహారాష్ట్రలోని వార్ధా, పెన్‌గంగా నదులను కలుపుకుంటూ తెలంగాణలో ప్రాణహిత నదిగా ప్రవేశిస్తుంది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని సిరోంచా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితకు వచ్చే వరద లెక్కలను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డు చేస్తోంది. సీడబ్ల్యూసీ నివేదికల ప్రకారం 1964–65 నుంచి ఇప్పటివరకు వర్షాకాలంలో టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితలో అత్యల్పంగా 444 క్యూసెక్కుల వరద 2005 జూన్ 21న నమోదైంది. అత్యధికంగా 3,90,416 క్యూసెక్కుల వరద 1981 ఆగస్టు 11న రికార్డు అయింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు తెలంగాణలో పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొని ఉండటంతో ప్రస్తుత జూన్‌లో గరిష్టంగా 800 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందని, గత 65 ఏళ్లలో చాలా అరుదుగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో ప్రాణహితకి 15.7 టీఎంసీల వరద రాగా ఈ ఏడాది 0.1 టీఎంసీకి మించలేదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలున్న నేపథ్యంలో జూలై, ఆగస్టు నాటికి ప్రాణహితలో వరద ప్రవాహం పెరగొచ్చని నీటిపారుదల శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

నీటిపారుదల, వ్యవసాయ శాఖల సమావేశం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల కింద వానాకాలం సాగుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖలు ఉమ్మడి సమావేశం నిర్వహించాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గోదావరితోపాటు వార్ధా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఉపనదులు తడారిపోయాయని నీటిపారుదల శాఖ నివేదించింది. వచ్చే నెల తొలి వారంలో పరిస్థితిని పునఃసమీక్షించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై నిర్ణయంతీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది.

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,889 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.3.10 కోట్లు సమర్పించుకున్నారు.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

- గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జాబ్ ఫెయిర్
- విశాఖలో 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు



బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా కూడా ప్రత్యేకతను సంతరించుకోనున్న విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు ముందుకేస్తోంది. దీంతో దిగ్గజ సంస్థలు విశాఖ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో ఐటీ సంస్థల్లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ సహకారంతో విశాఖలో జాబ్ ఫెయిర్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జూలై 21, 22 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జరిగే ఈ కార్యక్రమానికి దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు హాజరుకానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్, వెబ్‌సైట్‌ని విశాఖలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు.

త్వరలో దిగ్గజ సంస్థల కార్యకలాపాలు..

ప్రస్తుతం ఏపీలో దాదాపు 300కి పైగా ఐటీ కంపెనీలుండగా.. ఇందులో 80% వరకు విశాఖ కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 28న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించనుంది. ఇదే బాటలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో కూడా పయనించనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు, ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు మధ్య బాండింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఎపిటా, రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో వి ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023ని నిర్వహించనుంది. ఐటీ, ఐటీ అనుబంధ రంగ కంపెనీలకే కాకుండా.. ఫార్మా సంస్థలు, స్టార్టప్ సంస్థలకు ఏ విధమైన నైపుణ్యాలున్న మానవ వనరులు అవసరం?.. ఉద్యోగావకాశాలు పొందాలంటే ఎలాంటి కోర్సు లు చేయాలి? టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలి వంటి అంశాలను గ్రాడ్యుయేట్స్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. 'స్ప్రెడ్ యువర్ వింగ్స్'అనే పేరుతో 2 రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువత నుంచి సీవీలు తీసుకొని.. అక్కడే ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఎంపికైనవారికి ఉద్యోగావకాశాలు కల్పించ నున్నాయి. జాబ్‌ఫెయిర్‌కు టెక్‌మహీంద్ర, టీసీ ఎస్, ఎల్‌అండ్‌టీ, కాన్సెంట్రిక్స్, కాండ్యుయెంట్, చెగ్, డబ్ల్యూఎన్‌ఎస్, సెయింట్, పాత్రా, ఫ్లూయెంట్‌గ్రిడ్, పల్సస్ వంటి 40 వరకూ ఐటీ, అనుబంధ కంపెనీలు, ఫైజర్, అరబిందో వంటి 10 ఫార్మా సంస్థలు, 54 యూనివర్సిటీలు, కళాశాలలతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు హాజరు కానున్నాయి.



ఏపీలో టీఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

పుల్లలచెరువు: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మురికిమళ్ల సమీపంలో రాష్ట్ర రహదారిపై ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 24 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలతో ప్రకాశం జిల్లా మార్కాపురానికి వస్తున్న హైదరాబాద్–1 డిపో బస్సు డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో సడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పిన బస్సు రహదారికి అడ్డంగా బోల్తాపడింది. ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ ముందు అద్దాన్ని పగులగొట్టి దానిద్వారా ప్రయాణికులను బయటకు పంపారు. ప్రయాణికులు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

నాలుగు దశాబ్దాలైనా తరగని స్నేహం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖానాపూర్: నాలుగు దశాబ్దాల క్రితం పదో తరగతి పూర్తి చేసి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఇందుకు మస్కాపూర్ గ్రామంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్ వేదికైంది. ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదోతరగతి చదివిన వారంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసేవారు, వివిధ ప్రాంతాలు, దేశాల్లో స్థిరపడ్డవారంతా హాజరయ్యారు. 100 మంది పూర్వ విద్యార్థులకు 60మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అప్పటి గురువులు పీ సదయ్య, అల్వాల హన్మంతు, ఆర్ విఠల్, ఏ భూమన్న, దేవన్నను ఆహ్వానించి సన్మానించారు. అంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. రోజంతా సరదాగా గడిపారు. నిర్వాహకులు వీ ముత్యం, గంగాసాగర్, జీ కిషన్‌రెడ్డి, దురిశెట్టి శ్రీనివాస్, వెంకన్న, బీ రాజేందర్, జీవన్ తదితరులున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు

- విజేతలకు రూ.50వేలు నగదు అందజేత
- ట్రోఫీలందించిన ఒలింపిక్ సంఘం కార్యదర్శి జనార్దన్ రెడ్డి



ట్రోఫీ అందుకున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కరీంనగర్ బైపాస్ రోడ్డులోని వీ–కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఓపెన్, అండర్ 13 చదరంగ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, బలగం సినిమా నటుడు బాలు హాజరై రూ.50వేలు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున చదరంగ పోటీలను రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అనూప్ కుమార్‌ను అభినందించారు. జిల్లాస్థాయి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని సూచించారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్లు కంకటి అనూప్‌కుమార్, కంకటి కనుకయ్య మాట్లాడుతూ చెస్‌పోటీలకు ఆదరణ కల్పించాలనే సంకల్పంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కోర్ కమిటీ సభ్యులు అమిత్ పాల్‌సింగ్, సమీర్‌కుమార్, కంది రవి, రిషీపాల్ సింగ్, బెల్లం సంపత్, దయ భేటీ, జగన్, కుమార్, సతీశ్‌బాబు, రవికుమార్, తిరుపతిరెడ్డి, సజన్, సైకలాజికల్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ కె.అనిత, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై జోగు రామన్న ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఫైర్ అయ్యారు. కౌశిక్‌రెడ్డిపై చర్యలు చేపట్టేలా చూడాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో రామన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓ వ్యక్తిపై కోపంతో కులాన్ని ధూషించడం సరికాదన్నారు. ముదిరాజ్ కులాన్ని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కించపర్చడాన్ని ఖండించారు. విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. తమ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి పాటుపడుతోందని, ఇలాంటి నేతలను పార్టీ ఉపేక్షించబోదన్నారు. ఇలాంటి వారితో పార్టీకి నష్టం చేకూరుతుందని, వారిపై చర్యలు తీసుకునే విధంగాచూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు శివయ్య, నర్సింగ్,భూమన్న, రాము, సంతోష్, తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో ఢిల్లీ బృందం సందర్శన



ఆస్పత్రిని సందర్శిస్తున్న ఎన్టీపీసీ ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు



కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్)ని ఎన్టీపీసీ సంస్థకు చెందిన డైరెక్టర్లు ఆదివారం ఢిల్లీ నుంచి వచ్చి సందర్శించారు. ఎన్టీపీసీ సీఎస్సార్ సీడీ సంస్థ ద్వారా జీజీహెచ్ ఆస్పత్రి అభివృద్ధికి కేటాయించిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను డైరెక్టర్లు విద్యాధర్ వైశంప్యాన్, జితేందర్ జయంతిలాల్ తన్నా, సంగీతా వారియర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, సీఎస్సార్ అధికారి నిషాంత్ పరిశీలించారు. ఆస్పత్రిలో ఎన్టీపీసీ సంస్థ సమకూర్చిన లిఫ్ట్ వినియోగంతోపాటు అదనపు గదులను నిర్మించిన తీరు, అధునాతన వైద్య పరికరాలు తదితర వాటిని పరిశీలించి వాటి ఫోటోలు తీసుకున్నారు. అనంతరం జీజీహెచ్ ఆర్‌ఎంవో భవ్య, డాక్టర్లు రాజేంద్రప్రసాద్, రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడారు. ఆస్పత్రి వైద్యాభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఎలాంటి అవసరాలున్నాయి అనేదానిపై వివరాలు సేకరించారు. అధికారుల చర్చల్లో అధునాతన ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటుచేసే అంశంపై చర్చించా. జీజీహెచ్ ఆస్పత్రి అభివృద్ధికి ఎన్టీపీసీ సీఎస్సార్ సంస్థ నిధులను సద్వినియోగం చేస్తున్న తీరుపై ఢిల్లీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

కన్నిబాయికి ఎక్స్‌లెన్సీ అవార్డు



అవార్డులు అందుకుంటున్న కన్నిబాయి, సుమలత, తదితరులు

- గోండు గాయని సుమలతకు కూడా..
- ప్రదానం చేసిన క్రాంతిజ్యోతి మహిళా సాధికారత సంస్థ

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం భీమన్ గొందికి చెందిన అడ్వెంచర్ క్లబ్ బ్రాండ్ అంబాసిడర్ మడావి కన్నిబాయికి మరో అవార్డు దక్కింది. హన్మకొండలోని పరకాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో క్రాంతిజ్యోతి మహిళా సాధికారత సంస్థ వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వ్యక్తులకు ఎక్స్‌లెన్సీ అవార్డులు ప్రదానం చేసింది. సాహస కృత్యాలతో సత్తా చాటుతున్న కన్నిబాయితోపాటు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని పిప్రికి చెందిన గోండు గాయని కొడప సుమలతకు బెస్ట్ గాయని కేటగిరీలో అవార్డు వరించింది. సంస్థ ఫౌండర్ నరేందర్, చైర్మన్ రజిని రుద్రమ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు మృతి

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి సమీపంలో గల అయ్యప్ప ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఎస్సై అప్పారావు కథనం ప్రకారం.. మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన మాడవి శంకర్(22), గంగారెడ్డి(24) లక్ష్మి పూర్‌లో ఆదివారం బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అయ్యప్ప ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. గంగారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన శంకర్‌ను స్థానికులు 108 లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు





ఆషాఢంలోనూ ఆది దేవుడికి రద్దీ

వేములవాడ: రాజన్నకు ఆషాఢమాసంలోనూ భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం 15వేల మంది భక్తులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

గురువాణి



మంగళకరం

భారతీయ సంప్రదాయంలో ఏదయినా ప్రారంభం చేసేటప్పుడు.. మంగళకరమైన వాక్కులతో, శబ్దాలతో ప్రారంభం జరుగుతుంటుంది. 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే'.. అంటారు. అంటే మంగళకర వాక్కుతో ప్రారంభించాలి, మధ్యలో మంగళకరమైన వాక్కు ఉండాలి. ముగింపును కూడా మంగళకరంగా పూర్తి చేయాలి.. అని శాస్త్ర వాక్కు. అంటే జీవితం ఎప్పుడూ మంగళకరంగా, శోభాయమానంగా ఉండాలి. శాంతికి విఘాతం కలగకుండా చూసుకుంటుండాలి. అంటే ఇతరుల మనశ్శాంతికి కారణమయ్యేటట్లుగా మన ప్రవర్తన ఉండాలి.

మంగళకర వాక్కులు, శబ్దాలు ఉన్నచోట పూజనీయత ఉంటుంది. వాతావరణం కూడా పరిశుద్ధమయి, దేవతల అనుగ్రహానికి కారణమవుతుందని విశ్వసిస్తాం. ఘంటానాదంతో పూజ ప్రారంభం చేస్తాం. ఎందుకని.. ఆగమార్థంతు దేవానాం/ గమనార్థంతు రాక్షసాం/ కురుఘంటారవంతత్ర/ దేవాతాహ్వాన లాంఛనం... అంటే రాక్షసులు అక్కడినుంచి వెళ్లిపోవాలన్నా, దేవతలు రావాలన్నా... ఘంట మోగాలి. ఆ శబ్దంలోని పవిత్రత, మంగళప్రదత్వం అటువంటిది.

నాదస్వరం, షెహనాయి, మృదంగం, డోలు, శాక్సోఫోన్, మద్దెల, ఘంటలు, గజ్జెలు, ఢమరుకం, శంఖం, కొమ్ము, వేణువు, వీణ, వయోలిన్, హార్మోనియం, క్లారినెట్... ఇవన్నీ మంగళప్రదమైన శబ్దాలు చేసే సంగీత పరికరాలు. బ్యాండ్ కూడా అంతే... దానిలోని శాక్సోఫోన్ కానీ, క్లారినెట్ కానీ, ఇతర పరికరాలు కానీ అవి కూడా గురుముఖతః నేర్చుకుని వాయిస్తారు. వీటిని మోగించే కళాకారులను కూడా సమాజం సమున్నతం గా ఆదరిస్తుంది. పండిట్ రవిశంకర్, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ లను భారత రత్న వరించింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్... వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ఆయన అందుకున్నారు. 'నేను సరస్వతీ ఆరాధకుడిని' అని బిస్మిల్లాఖాన్ ప్రకటించుకున్నారు. 'యావత్ భారతదేశంలోని ప్రజలందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు..' అని ఆయన తరచుగా అంటూండేవారు. ఒకసారి అమెరికాలో కచేరీ సందర్భంగా అభిమానులు ఆయనను అక్కడే ఉండిపొమ్మని కోరగా... కాశీని, విశ్వనాథుడిని, విశాలాక్షిని, గంగమ్మను వదిలి రాలేను అని.. ప్రకటించుకున్న గొప్ప దేశభక్తుడు. సింహాచలం ఆస్థాన విద్వాంసుడు చిట్టిబ్బాయిని... సంగీతనాటక అకాడమీ, కళాప్రపూర్ణ వంటి బిరుదులెన్నో వరించాయి. కాకినాడలో సత్యనారాయణ అనే గొప్ప క్లారినెట్ విద్వాంసుడు ఎందరో శిష్యులను తయారు చేసాడు.. వారందరూ కలిసి ఆయనకు గురుదక్షిణగా బంగారు క్లారినెట్ ను బహూకరించారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఇటువంటి వాద్య సంగీత విద్వాంసులను కూడా గౌరవించడం, వారి కచ్చేరీలు నిర్వహించి వారిని, వారి కళను, వారి వాయిద్యాలను సమాదరించడం మన కర్తవ్యంగా భావించాలి. మంగళత్వం అనేది కోయిల కూతలో, మామిడాకులో వానచినుకులో, పసుపులో, కుంకుమలో, పువ్వులో.. కూడా దర్శించే సంప్రదాయం మనది. ఇప్పటికీ నృత్యకళను అభ్యసించిన వారు అరంగేట్రం చేయడానికి ముందు .. సభలో ఆసీనులైన పెద్దల దగ్గరకు వచ్చి, వారి చేతికి గజ్జెలు అందించి... తిరిగి వారి చేతులనుండి స్వీకరించి కాలికి కట్టుకుని వెళ్ళి ప్రదర్శిస్తుంటారు... అంత గాఢంగా మనం ఈ కళలను అభిమానిస్తాం... ఈ సంప్రదాయాన్ని నవతరం కూడా నిష్ఠతో కొనసాగించాలని కోరుకుందాం.

సంగీతం

సంస్కారానికి ఆవిష్కారం

సంగీతం మనసును, మెదడును ఒకేసారి కదిలిస్తుంది. సంగీతంవల్ల మనసులో మెదడు, మెదడులో మనసు ఒకేసారి మెదులుతూ ఉంటాయి. మనిషిలోంచి మనిషిని బయటకులాగి తనలోకి తీసుకుంటుంది సంగీతం. జీవనావసరాలకు అతీతంగా మనిషిని మనిషిని చేస్తుంది సంగీతం.

'భూమి సారం నీరు, నీటి సారం మొక్క , మొక్క సారం మనిషి , మనిషి సారం మాట, మాట సారం సంకీర్తన లేదా సంగీతం' అని ఛాందోగ్యోపనిషత్తు చెప్పింది. సంగీతం అన్నిటికన్నా గొప్పది అని ఉపనిషత్ కాలం నుంచీ నేలపై నెలకొన్న సత్యం. మనిషికన్నా సంగీతం గొప్పది కాబట్టే మనిషికి సంగీతం మేలు చెయ్యగలిగేది అయింది. 'ఆశతో బతికే వ్యక్తి సంగీతంతో నాట్యం చేస్తాడు' అని ఒక ఇంగ్లిష్ సామెత తెలియజెబుతోంది'. 'తనలో సంగీతం లేని వ్యక్తి, మధురమైన శబ్దాలతో కలిసిపోని వ్యక్తి అనసురాగానికి, కపటోపాయానికి, దోపిడికి తగిన వాడు అవుతాడు' అని ఇంగ్లిష్ కవి షేక్స్పియర్ ఒకచోట చెబుతాడు. అన్నింటికన్నా సంగీతం మనిషికి ఉన్నతమైన తోడు.

సంగీతాన్ని వింటున్నప్పుడు మనల్ని మనం ఒకసారి చూసుకుంటే మనకు మనం కనిపించం! ఇంతకన్నా మనకు జరిగే మంచి మరొకటి ఉంటుందా? సంగీతం వింటున్నంత సేపూ మనం మెరుగైన స్థితిలో ఉంటాం. మన నుంచి మనం కోలుకోవడానికి సంగీతం కావాలి.

సంగీతం మనల్ని ఎప్పుడూ మోసం చెయ్యదు! బంధువులవల్లా, స్నేహితుల వల్లా, సమాజంవల్లా మనం మోసపోతూ ఉంటాం. కానీ సంగీతంవల్ల మనం మోసపోవడం లేదు. కొన్ని రచనలు మనల్ని పాడుచెయ్యచ్చు. కొన్ని వాక్యాలు మనల్ని తప్పుడు దారి పట్టించచ్చు. కానీ సంగీతం మనల్ని పాడుచెయ్యదు.

> అద్భుతమైన అభివ్యక్తి సంగీతం: ఆస్వాదించాల్సిన ఆనందం సంగీతం. కృష్ణుడు తన పిల్లనగ్రోవి సంగీతంలో తాను ఆనందం పొందుతూ తన్మయుడు అవుతూ ఉండేవాడు. సంగీతం కృష్ణతత్త్వంలో ఒక అంశం. కృష్ణుణ్ణి సంపూర్ణ అవతారంగా చెబుతారు. ఆ సంపూర్ణ అవతారంలో సంగీతం ఒక అంశం. అంటే సంపూర్ణత్వానికి సంగీతం ముఖ్యం అని గ్రహించాలి.

సంగీతం మనల్ని తప్పుడు వాళ్లను చెయ్యదు. కొన్ని సందర్భాల్లో సాహిత్యం కొందరికి చెడుపు చేసింది. కానీ సంగీతం ఎప్పుడూ ఎవరికీ ఏ చెడుపూ చెయ్యదు.

సంగీతం సలహాలు ఇవ్వదు. సంగీతం సూచనలు చెయ్యదు. సలహాలు, సూచనలు లేకుండా సంగీతం మనతో చెలిమి చేస్తుంది. సంగీతం మనదైపోతుంది. సంగీతాన్ని వింటున్నప్పుడు మైమరిచిపోయి తనకు తెలియకుండా మనిషి నిజంగా బతుకుతాడు. సంగీతం వల్ల మనిషి బుద్ధికి అతీతంగా సిద్ధుడు అవుతాడు. మనుగడలో భాగంగా మనం మనల్ని కోల్పోతూ ఉంటాం.



మంచి మాట

సంగీతం వింటూ ఉండడంవల్ల మనల్ని మనం మళ్లీ మళ్లీ పొందచ్చు.

వయసు రీత్యా ఎదిగాక పసితనం పోయిందని మరణించేంత వరకూ మనం మాటిమాటికీ బాధపడుతూ ఉంటాం. సంగీతాన్ని వింటున్నప్పుడు తెలివి, ప్రతిభ, పాండిత్యాలు లేని స్థితిలోకి వెళ్లిపోయి మనం మనంగా కాకుండా పసితనంతో ఉంటాం.


ప్రతిమనిషికీ తెలుసు తాను కొంత మేరకు దుర్మార్గుణ్ణే అని. సంగీతాన్ని వింటున్నంత సేపూ తననుంచీ, తన మార్గం నుంచీ మనిషి బయటకు వచ్చేస్తాడు కాబట్టి సంగీతం కాసేపైనా మనిషిని మంచిలో ఉంచుతుంది. సంగీతం విన్నంతసేపూ అనడమో, ఏదో చెయ్యడమో ఉండవు కాబట్టి మనవల్ల అవకతవకలు, అన్యాయం, అకృత్యాలు జరగవు.

శబ్దానికి సంస్కారం సంప్రాప్తిస్తే సంగీతం అవుతుంది. సంగీతం ఒక సంస్కారానికి ఆవిష్కారం. మనకూ, మన జీవనాలకూ కూడా సంస్కారం ఉండాలి. వీలైనంతగా సంగీతానికి చేరువ అవుదాం. సంగీతంలో మైమరిచిపోతూ ఉందాం. సంగీతంలో మైమరచిపోతూ ఉండడం మనం మళ్లీ, మళ్లీ పుడుతూ ఉండడం అవుతుంది. రండి, సంగీతం వల్ల మనం మళ్లీ మళ్లీ పుడుతూ ఉందాం.

– రోచిష్మాన్

తాత్త్వికథ

ఆత్మాన్వేషణ



ఓ సూఫీ జ్ఞాని చెప్తున్నారు...

మనిషి ఆత్మ భగవంతుడి నుంచి వచ్చింది. అది చివరకు భగవంతుడినే చేరుతుంది. అది అంతిమంగా భగవంతుడిని ఎప్పుడు చేరుతుందో అప్పుడే దాని ప్రయాణం ముగుస్తుంది. అప్పటి వరకూ అది ప్రయాణం చేస్తూనే ఉంటుంది. అంటే అదొక వలయం. అనేక పుట్టుకలు, అనేక మార్గాలు ఇలా ఎలాగైనా అనుకోవచ్చు. చెప్పాలంటే జీవితంలో ఏదో ఒక అన్వేషణ అంటూ ఉంటూనే ఉంటుంది. మనసు ఏదో ఒకటి కోరుతూ ఆ దిశలో పయనిస్తుంది. కానీ అది ఏది కోరుకుంటుందో ఎక్కడ తృప్తి చెందుతుందో స్పష్టత ఉండదు. దీనినే ఆ జ్ఞాని ఆత్మాన్వేషణ ప్రయాణం అని చెప్పారు. ఇదంతా వింటున్న ఓ శిష్యుడికి ఓ సందేహం కలిగింది.

''గురువుగారూ, ఆత్మ అంతిమంగా భగవంతుడిని చేరుకోవడంతో దాని ప్రయాణం ముగుస్తుందన్నారు కదా... అంటే ప్రతి ఒక్కరూ భగవంతుడిని చేరుకోవడమే అవుతుందిగా '' అని అడిగాడు.

''అవును... అందులో సందేహమేముంది? కాస్తంత ముందు వెనుకలు అంతే..అంతకన్నా మరొకటి కాదు... అందరూ చివరికి భగవంతుడిని చేరుకోవలసిందే'' అన్నారు జ్ఞాని.

''మరి మత పెద్దలు కొందరు మాత్రమే భగవంతుడిని చేరుకుంటున్నారని చెప్పారుగా?'' అన్నాడు శిష్యుడు.

అప్పుడు జ్ఞాని ''నువ్వో పని చెయ్యి. ఊళ్ళోకి వెళ్ళి, వీలున్నంతమందిని కలిసి వారి కోరికేమిటో తెలుసుకుని రా'' అని సూచించారు.

సరేనని శిష్యుడు కొన్ని కాగితాలు, కలం తీసుకుని ఊళ్ళోకి బయలుదేరాడు.అనేకమందిని కలిశాడు. వారు ఏం కావాలనుకుంటున్నారో, వారి లక్ష్యమేమిటో అడిగాడు. వారి మనసు ఏది పొందితే తృప్తి పడుతుందో చెప్పమన్నాడు. వారు చెప్పినవన్నీ రాసుకున్నాడు.

జ్ఞాని వద్దకు వచ్చాడు.

''అయ్యా, ఊళ్ళో రాజు మొదలుకుని కూలీ వరకూ ఎందరినో కలిసాను. వారు చెప్పినదంతా చదువుతాను వినండి'' అంటూ మొదలుపెట్టాడు...

''రాజేమో మరిన్ని దేశాలను గెలవాలనుకున్నాడు. యువరాజేమో తెలివైన యువరాణిని పెళ్ళాడాలనుకున్నాడు... ధనవంతుడేమో మరింత డబ్బు గడించాలనుకుంటున్నాడు... ఇలా ఒక్కొక్కరూ ఆశ పడుతున్నారు...'' చెప్తుండగానే జ్ఞాని చదవడం ఆపమన్నారు.

''అదంతా పోనివ్వు... వారిలో ఎంతమంది భగవంతుడిని చేరుకోవాలనుకుంటున్నారో వారి పేర్లు మొదట చదువు'' అన్నారు జ్ఞాని.

ఒక్కరు కూడా లేరన్నాడు శిష్యుడు.

''అంటే నువ్వు కూడా లేవా ఆ జాబితాలో?'' అని అతనివంక నవ్వుతూ చూశారు జ్ఞాని.

శిష్యుడు తల దించుకున్నాడు.

– జగద్రేణు


సినిమా


నాగ్ అశ్విన్, కమల్‌హాసన్

ప్రాజెక్ట్ కె విషయంలో ఆసక్తిగా ఉన్నాను

– కమల్‌హాసన్

''యాభై ఏళ్ల క్రితం నేను డ్యాన్స్ అసిస్టెంట్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తున్నప్పుడు నిర్మాణ రంగంలో అశ్వినీదత్ పేరు బాగా వినిపించేది. యాభై ఏళ్ల తర్వాత ఇప్పుడు మేం కలిసి పని చేయబోతున్నాం'' అన్నారు కమల్‌హాసన్. ప్రభాస్, దీపికా పదుకోన్ జంటగా అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఓ కీలక పాత్రను కమల్‌హాసన్ చేయనున్నారనే వార్త కొన్ని రోజులుగా ప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో కమల్ నటించనున్న విషయాన్ని ఆదివారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ – ''మా తర్వాతి తరానికి చెందిన దర్శకుడి నేతృత్వంలో అదే తరానికి చెందిన కో–స్టార్స్ ప్రభాస్, దీపికాతో కలిసి నటించబోతున్నాను. అమిత్ జీ (అమితాబ్)తో కలిసి నటించినప్పటికీ ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా మొదటిసారిలానే అనిపిస్తుంటుంది. అమిత్ జీ ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటారు. నేను కూడా ఆ ప్రక్రియను అనుసరిస్తుంటాను. 'ప్రాజెక్ట్ కె' విషయంలో నేను చాలా ఆసక్తిగా ఉన్నాను. నేను సినిమా అభిమానిని. అందుకే నా పరిశ్రమలో ఏ కొత్త ప్రయత్నం జరిగినా మెచ్చుకుంటాను. అలా 'ప్రాజెక్ట్ కె'ని ప్రశంసించే తొలి వ్యక్తిని నేనే కావాలనుకుంటున్నాను. మా దర్శకుడు నాగ్ అశ్విన్ విజన్ మన దేశం, ప్రపంచం మొత్తం మారుమోగుతుందని కచ్చితంగా చెబుతున్నాను'' అన్నారు. ''నా కెరీర్‌లో 50వ సంవత్సరంలో దిగ్గజ నటులు కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్‌లతో కలిసి పని చేసే అవకాశం రావడం అనేది నాకో వరం'' అన్నారు అశ్వినీదత్. ''లెజెండ్ కమల్‌హాసన్ సార్‌తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఆయన్నుంచి నేర్చుకునే అవకాశం రావడం అనేది ఓ కల నెరవేరిన క్షణంలా భావిస్తున్నాను'' అన్నారు ప్రభాస్. ''ఎన్నో విలక్షణ పాత్రలు చేసిన కమల్ సార్‌తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఆయన మా చిత్రంలోకి వచ్చి 'ప్రాజెక్ట్ కె'ని సంపూర్ణం చేశారు'' అన్నారు నాగ్ అశ్విన్.


శింబు

మణిరత్నంతో మళ్లీ..

ముప్పై అయిదేళ్ల తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించే ఆలోచనలో ఉన్నారట మణిరత్నం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోందని, ఇందులో భాగంగానే కథలోని ఓ కీలక పాత్ర కోసం మణిరత్నం నుంచి శింబుకు కబురు వెళ్లిందనీ టాక్. ఇక మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'చెక్క చివంద వానం' (2018) (తెలుగులో 'నవాబ్') సినిమాలో శింబు ఓ లీడ్ రోల్‌లో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. మరి.. కమల్–మణిరత్నం కాంబో సినిమాలో శింబు నటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో 1987లో 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') వచ్చిన సంగతి తెలిసిందే.


శ్రీ విష్ణు, చిరంజీవి

కేజీఎఫ్‌లో బానిసల్లా చూస్తాడు!

''బాక్సాఫీస్ బాలు ఫ్యామిలీ మేము. డబ్బులు అతని దగ్గర తీసుకోండి' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'సామజ వరగమన' సినిమా ట్రైలర్. శ్రీ విష్ణు హీరోగా 'వివాహభోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో చిరంజీవి విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'వాడి దృష్టిలో ఫ్యామిలీ మెంబర్స్ అంటే.. కేజీఎఫ్‌లో బానిసల్లా చూస్తాడు' (వీకే నరేశ్), 'ఎప్పుడైనా ఏదైనా పనికొచ్చే పని చేశావా.. చెత్త నుంచి కూడా కరెంట్ తీస్తున్నారు' (శ్రీ విష్ణు) అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''అమ్మాయిల పట్ల విరక్తి పెంచుకునే ఓ మధ్యతరగతి కుర్రాడు బాలు. అయితే రిచ్ లైఫ్‌స్టైల్ కోరుకునే ఓ అమ్మాయి అతని జీవితంలోకి వచ్చినప్పుడు ఏం జరుగుతుందనేదే ఈ సినిమా కథ'' అనిచిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, సహనిర్మాత: బాలాజీ గుత్తా.

ప్రేక్షకులు మరోసారి నిరూపించారు

– భరద్వాజ

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్గమాన్, సాయి ప్రసన్న, అభి, రూప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డా బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలైంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌కు అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''ప్రజల జీవన విధానాలను, వారి ఎమోషన్స్‌ను బేస్ చేసుకుని కథ సిద్ధం చేసుకుంటే సక్సెస్ వస్తుందని ప్రేక్షకులు మరోసారి నిరూపించిన చిత్రమిది'' అన్నారు. ''ఇలాంటి కథలు మన జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తాయి'' అన్నారు 'బలగం' ఫేమ్ సుధాకర్‌రెడ్డి. '''బలగం' తరహాలోనే 'భీమదేవరపల్లి బ్రాంచి' కూడా మంచి విజయం సాధించింది'' అన్నారు తెలంగాణ బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు. ''నేటివిటీతో కూడిన మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రం ఇది. ఈ సినిమాపై మాకు ఉన్న నమ్మకం వమ్ము కాలేదు'' అన్నారు నిర్మాతలు.


కీర్తిలత, రాజా నరేందర్, రమేష్, తమ్మారెడ్డి భరద్వాజ


నిరోషా

రజనీకి జోడీ?

'ఒక బృందావనం సోయగం..' అంటూ ఈత కొలనులో హొయలొలికించి, కుర్రకారు మనసుల్లోకి చొచ్చుకుపోయారు నిరోషా. 'ఘర్షణ' (1988) చిత్రంలోని ఈ పాటతో పాటు ఈ చిత్రంలో నాయికగా నిరోషాకి మంచి మార్కులే పడ్డాయి. ఇక 'సింధూరపువ్వు'లోనూ ఆమె కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పెద్దగా సినిమాలు చేయని నిరోషా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆ మధ్య ఎంట్రీ ఇచ్చారు. కాగా రజనీకాంత్ కీ రోల్ చేసిన 'లాల్ సలామ్'లో ఆయనకు జోడీగా నిరోషా కనిపిస్తారన్నది కోలీవుడ్ టాక్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో మొయిద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. ఆయనకు చెల్లెలి పాత్రను జీవిత చేస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. భార్య పాత్రను నిరోషా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



హీరోయిన్ అవుతాననుకోలేదు

– ఐశ్వర్యా మీనన్

''ఓ నటిగా నా కెరీర్ పట్ల సంతృప్తిగానే ఉన్నాను. అసలు నేను హీరోయిన్ అవుతానని ఊహించలేదు. నేను ఇంజనీర్‌ని, నా బ్రదర్ డాక్టర్. స్టార్టింగ్‌లో కొన్ని యాడ్స్ చేశాను. ఆ తర్వాత మెల్లిమెల్లిగా ఒక్కో అడుగు వేసుకుంటూ ఇప్పుడు హీరోయిన్‌గా రాణిస్తున్నాను. ఈ ప్రయాణం నాకు హ్యాపీగా ఉంది'' అన్నారు ఐశ్వర్యా మీనన్. నిఖిల్ హీరోగా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'స్పై'. ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చిత్ర కథానాయిక ఐశ్వర్యా మీనన్ మాట్లాడుతూ– ''తెలుగులో హీరోయిన్‌గా నేను చేసిన తొలి చిత్రం 'స్పై'. ఈ చిత్రంలో నా క్యారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉన్నాయి. 'రా' ఏజెంట్‌గా కనిపిస్తాను. ఈ సినిమాలోని కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం నేను ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. గన్‌ను సరిగ్గా పట్టుకోవడం, షూటింగ్.. ఇలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. ప్రేమకథలే కాదు.. యాక్షన్ సన్నివేశాల్లో కూడా నేను బాగా నటించగలననే విషయం నాకు 'స్పై'తో తెలిసొచ్చింది. యాక్షన్ సినిమాలు కూడా చేయగలననే కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇక స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత రహస్యాల ఆధారంగా అనేది ఈ సినిమా బేస్‌లైన్ మాత్రమే. డ్రామా వేరుగా ఉంటుంది. గ్యారీగారు ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు నన్నే అనుకున్నారట. దీంతో ఆయన స్ట్రయిట్‌గా వచ్చి నాకు కథ చెప్పారు. నేను చూసిన తొలి తెలుగు సినిమా 'హ్యాపీ డేస్'. అలాగే నిఖిల్ చేసిన 'స్వామి రారా', 'కార్తికేయ' చిత్రాలు కూడా చూశాను. ఆయన ప్రతి సినిమాను ఫాలో అవుతుంటాను. ప్రజెంట్ యూవీ క్రియేషన్స్‌లో కార్తికేయ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నాను'' అన్నారు.

మన జీవితం ఓ సర్కిల్

– రిచా పనై, అర్షిణ్


రిచా పనై
అర్షిణ్

సాయి రోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో, హీరోయిన్స్ అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి. శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రిచా పనై మాట్లాడుతూ– ''సర్కిల్‌లో ఓ పెయింటర్ పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర బోల్డ్‌గా ఉంటుంది. ఈ తరం అమ్మాయిలు ఎలా ఉంటారో, ఎంత ఫ్రీడమ్ కోరుకుంటారో ఈ సినిమాలో నా పాత్ర అలా ఉంటుంది. మన జీవితం ఓ సర్కిల్ లాంటిదని నేను నమ్ముతాను. మనం ప్రపంచానికి ఏదైతే చేస్తామో అదే మనకి తిరిగి వస్తుందని నమ్ముతాను. ఇక 'యముడికి మొగుడు, చందమామ కథలు' సినిమాల తర్వాత నాకు చాలా అవకాశాలు వస్తాయని అనుకున్నాను. కానీ అలా జరగలేదు. అయితే కొన్ని ఆఫర్స్ వచ్చినా, అవి నాకు నచ్చలేదు. ప్రస్తుతం ముంబైలో ఓ కేఫ్ రన్ చేస్తున్నాను. మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాను'' అని అన్నారు.

అర్షిణ్ మెహతా మాట్లాడుతూ– ''మా ఫ్యామిలీలో ఐఏఎస్‌లు, పీహెచ్‌డీ హోల్డర్స్ ఉన్నారు. నేను చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ)ని. అయితే యాక్టింగ్ నా డ్రీమ్. ఇందుకోసం చాలా ఆడిషన్స్ ఇచ్చాను. కొన్ని రిజెక్షన్స్ కూడా ఉన్నాయి. ఆ తర్వాత కొన్ని యాడ్స్‌తో పాటు బాలీవుడ్ చిత్రాల్లో కొన్ని కీలక పాత్రలు చేశాను. తెలుగులో నా తొలి చిత్రం 'సర్కిల్'. ఇందులో నేను ఓ రాయల్ ప్రిన్సెస్‌లా కనిపిస్తాను. ఫొటోగ్రాఫర్‌కు, రాయల్ ప్రిన్సెస్‌కు మధ్య ఉన్న లవ్‌స్టోరీ ఆసక్తికరంగా ఉంటుంది. మన లైఫ్ ఓ సర్కిల్‌లాంటిది. అదే ఈ సినిమాలో చూపించాం. ప్రస్తుతం ఒక సినిమాతో పాటు, కొన్ని వెబ్ సిరీస్‌లు చేస్తున్నాను'' అన్నారు.



వెస్ట్ జోన్ జట్టులో పుజారా, సూర్యకుమార్

వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం భారత జట్టులో ఎంపిక కాలేకపోయిన సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా, ముంబై ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగనున్నారు. పుజారా, సూర్యకుమార్ డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఆడనున్న రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్ స్థానాల్లో వీరిద్దరిని వెస్ట్ జోన్ జట్టులోకి ఎంపిక చేశారు. ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేతతో జూలై 5 నుంచి జరిగే సెమీఫైనల్లో వెస్ట్ జోన్ తలపడుతుంది.

గోల్ఫర్ దీక్ష ఖాతాలో యూరోపియన్ టూర్ టైటిల్



భారత గోల్ఫర్ దీక్ష డాగర్ మహిళల యూరోపియన్ టూర్‌లో భాగంగా జరిగిన చెక్ లేడీస్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచింది. చెక్ రిపబ్లిక్‌లో జరిగిన ఈ టోర్నీలో థాయ్‌లాండ్ గోల్ఫర్ త్రిచట్ చీంగ్లాబ్ నుంచి పోటీ ఎదురైనప్పటికీ నిలకడైన ప్రదర్శనతో ఆమె గెలిచింది. హరియాణాకు చెందిన 22 ఏళ్ల దీక్షకిది రెండో టైటిల్. 2019లో దక్షిణాఫ్రికా ఓపెన్‌లో ఆమె గెలిచింది. బధిర క్రీడాకారిణి అయిన దీక్ష టోక్యో ఒలింపిక్స్‌లో, డెఫిలింపిక్స్‌లో పోటీపడింది.

భారత షూటింగ్ జట్టులో కైనన్

ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలకు ఎంపిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్ త్వరలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టులో ఎంపికయ్యాడు. 32 ఏళ్ల కైనన్ 2019లో చివరిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో... 2014లో ఇంచియోన్ ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ట్రయల్స్‌లో కైనన్ రాణించి భారత జట్టులో చోటు సంపాదించాడు. ఈ రెండు మెగా ఈవెంట్స్‌లో పాల్గొనే భారత ట్రాప్, స్కీట్ జట్లను ఆదివారం ప్రకటించారు. ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 1 వరకు అజర్‌బైజాన్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలు.. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌ నగరంలో ఆసియా క్రీడలు జరుగుతాయి. భారత పురుషుల ట్రాప్ విభాగం జట్టులో కైనన్‌తో పాటు పృథ్వీరాజ్ తొయిండమన్, జొరావర్ సింగ్ సంధూ ఎంపికయ్యారు. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్‌లో కైనన్ షెనాయ్–ప్రీతి రజక్ జోడీ పోటీపడుతుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన కైనన్ ట్రాప్ ఈవెంట్‌లో 19వ ర్యాంక్‌లో నిలిచాడు. ఐదుసార్లు సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ కైనన్ పతకం మాత్రం గెలవలేకపోయాడు. ప్రపంచకప్ టోర్నీల్లో టీమ్ ఈవెంట్‌లో కైనన్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం సాధించాడు. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచాడు.



ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ తొలి సీజన్‌లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్టు విజేతగా నిలిచింది. జైపూర్‌లో జరిగిన ఫైనల్లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్టు 38–24తో గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్టుపై గెలిచింది.

అన్ని ఫార్మాట్లకు సిద్ధం: కేఎస్ భరత్



సాక్షి, సిటీ బ్యూరో: వచ్చే నెలలో వెస్టిండీస్ జట్టుతో జరిగే టెస్టు సిరీస్ కోసం సన్నద్ధమవుతున్నానని భారత జట్టు వికెట్ కీపర్, ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్ వ్యాఖ్యానించాడు. రాబోయే రోజుల్లో వన్డే, టి20 ఫార్మాట్‌లలోనూ భారత జట్టులో ఎంపిక కావడమే తన తదుపరి లక్ష్యమని భరత్ తెలిపాడు. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన రెటీనా పెయింట్స్ దేశవ్యాప్తంగా తమ సేవలను విస్తరించడంలో భాగంగా క్రికెటర్ కేఎస్ భరత్‌ను తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. దీనికి సంబంధించి ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో భరత్ మాట్లాడుతూ... వ్యక్తిగత వృద్ధి కన్నా సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే బృందమున్న రెటీనా పెయింట్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనుండటం తన బాధ్యతను పెంచిందని అన్నాడు. 22 ఏళ్లుగా క్రికెట్‌తో ప్రయాణిస్తున్నానని, తిరిగి చూసుకుంటే ఇక్కడి గల్లీ క్రికెట్ అనుభవాలు గుర్తుకొస్తున్నాయని భరత్ పేర్కొన్నాడు. ఆటపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ రాహుల్ ద్రవిడ్, ధోనీని అభిమానిస్తానని అన్నాడు. తనకు తెలుపు రంగు అంటే ఇష్టమని... దానికి తగ్గట్టుగానే మొదటగా టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేయడం సంతోషంగా ఉందన్నాడు. ఈ కార్యక్రమంలో రెటీనా పెయింట్స్ ఎండీ రాకేష్ కూడా పాల్గొన్నారు.



సుతీర్థ–ఐహిక జోడీకి టైటిల్

ట్యూనిస్ (ట్యూనిషియా): ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత జోడీ సుతీర్థ ముఖర్జీ–ఐహిక ముఖర్జీ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ టోర్నీలో సంచలనం సృష్టించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో సుతీర్థ–ఐహిక ద్వయం మహిళల డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచింది. మియు కిహారా–మివా హరిమోటో (జపాన్) జంటతో 35 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సుతీర్థ–ఐహిక జోడీ 11–5, 11–6, 5–11, 13–11తో నెగ్గింది. విజేతగా నిలిచిన సుతీర్థ–ఐహిక జంటకు 1,000 డాలర్ల (రూ. 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. భారత క్రీడాకారులకు డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీ టైటిల్ లభించడం ఇది మూడోసారి. 2019లో మనిక బత్రా–అర్చన కామత్ స్లొవేనియా డబ్ల్యూటీటీ టోర్నీలో మహిళల డబుల్స్ టైటిల్‌ను... 2021లో సత్యన్ జ్ఞానశేఖరన్–హర్మీత్ దేశాయ్ ట్యూనిషియాలో జరిగిన డబ్ల్యూటీటీ టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెల్చుకున్నారు.

శ్రీలంక ‘హ్యాట్రిక్’

- వరుసగా మూడో విజయంతో ‘సూపర్ సిక్స్’ దశకు అర్హత
- కరుణరత్నే సెంచరీ
- మూడో ఓటమితో ఐర్లాండ్ అవుట్
- ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ





బులవాయో: మాజీ చాంపియన్ శ్రీలంక వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీలో వరుసగా మూడో విజయం సాధించింది. ఐర్లాండ్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ ‘బి’ లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 133 పరుగుల తేడాతో గెలిచి ‘హ్యాట్రిక్’ నమోదు చేసింది. ఈ విజయంతో శ్రీలంక ‘సూపర్ సిక్స్’ దశకు అర్హత సాధించింది. వరుసగా మూడో ఓటమితో ఐర్లాండ్ ‘సూపర్ సిక్స్’ దశకు చేరుకోవడంలో విఫలమైంది. టాస్ నెగ్గిన ఐర్లాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.5 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే (103 బంతుల్లో 103; 8 ఫోర్లు) సెంచరీ సాధించగా... సమరవిక్రమ (86 బంతుల్లో 82; 4 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 168 పరుగులు జోడించారు. అసలంక (30 బంతుల్లో 38; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధనంజయ డిసిల్వా (35 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ (4/46), మెకార్తీ (3/56), గ్యారెత్ డెలానీ (2/52) ఆకట్టుకున్నారు. 326 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు 31 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. శ్రీలంక లెగ్‌స్పిన్నర్ హసరంగ 79 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

స్కాట్లాండ్ కూడా...

గ్రూప్ ‘బి’లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ 76 పరుగుల తేడాతో ఒమన్ జట్టుపై నెగ్గి వరుసగా మూడో విజయం సాధించింది. ఈ గెలుపుతో స్కాట్లాండ్... ఓడిన ఒమన్ జట్టు కూడా ‘సూపర్ సిక్స్’ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ సరిగ్గా 50 ఓవర్లలో 320 పరుగులకు ఆలౌటైంది. బ్రాండన్ మెక్‌ములెన్ (121 బంతుల్లో 136; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీ చేయగా... కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (62 బంతుల్లో 60; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. ఒమన్ బౌలర్ బిలాల్ ఖాన్ 55 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. 321 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసి ఓడిపోయింది.

అల్‌కరాజ్ తొలిసారి...

- గ్రాస్ కోర్టులపై మొదటి టైటిల్
- మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం



లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీకి సన్నాహకంగా భావించే క్వీన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–4, 6–4తో అలెక్స్ డి మినౌర్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. 99 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ఏడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. గ్రాస్ కోర్టులపై అల్‌కరాజ్‌కిదే తొలి టైటిల్ కావడం విశేషం. ఓవరాల్‌గా అతని కెరీర్‌లో ఇది 11వ సింగిల్స్ టైటిల్. ఈ స్పెయిన్ స్టార్‌కు 4,77,795 యూరోల (రూ. 4 కోట్ల 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ గెలుపుతో అల్‌కరాజ్ నేడు విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. దాంతోపాటు వచ్చే నెలలో మొదలయ్యే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

ఇకపై రోడ్డెక్కం... కోర్టులోనే తేల్చుకుంటాం

బ్రిజ్‌భూషణ్‌పై మారిన రెజ్లర్ల వైఖరి ● సోషల్ మీడియాకు కొన్ని రోజులు దూరం



న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రెండుసార్లు నిరసన దీక్ష చేపట్టిన స్టార్ రెజ్లర్ల వైఖరి మారింది. తమకు న్యాయం దక్కేవరకు ఆయనపై పోరాటం కొనసాగుతుందని, అయితే అది కోర్టులోనే తేల్చుకుంటామని... ఇకపై రోడ్డెక్కబోమని రెజ్లర్లు ప్రకటించారు. ‘డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల ప్రక్రియ ముగిశాక మాకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ మేరకు మేం వేచిచూస్తాం. కానీ బ్రిజ్‌భూషణ్‌పై మా పోరాటాన్ని మాత్రం విరమించే ప్రసక్తేలేదు’ అని వినేశ్ ఫొగాట్ ట్వీట్ చేసింది. అనంతరం కొన్నాళ్లపాటు సోషల్ మీడియాకు దూరంగా ఉంటామని వినేశ్‌తో పాటు సాక్షి మలిక్ తెలిపింది.

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై స్టే

గువాహటి: భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు చాలాసార్లు వాయిదా పడ్డాయి. తాజాగా ఇప్పుడు గువాహటి హైకోర్టు స్టేతో మరో వాయిదా తప్పేలాలేదు. అస్సాం సంఘం తమ సభ్యత్వాన్ని గుర్తించకపోవడం, ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వకపోవడంతో హైకోర్టులో పిటీషన్ వేయగా వచ్చే నెల 11న జరగాల్సిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై కోర్టు స్టే విధించింది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్మీ నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)ల్లో 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 220
» **ఏఎఫ్ఎంఎస్, సీట్లు:** కాలేజ్ ఆఫ్ నర్సింగ్, పుణె–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కోల్‌కతా–30, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ముంబై–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, న్యూఢిల్లీ–30, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లక్నో–40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, బెంగళూరు–40.
» **అర్హత:** అవివాహిత/విడాకులు తీసుకున్న/చట్టబద్ధంగా విడిపోయిన/వితంతువులైన మహిళా అభ్యర్థులు అర్హులు. కనీసం 50శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ)/10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్(యూజీ) 2023లో అర్హత సాధించి ఉండాలి. కనిష్ఠ ఎత్తు 152 సెం.మీ. కలిగి ఉండాలి.
» **వయసు:** 01.10.1998 నుంచి 30.09.2006 మధ్య జన్మించిన ఉండాలి.
» **ఎంపిక విధానం:** నీట్ 2023 స్కోర్, జనరల్ ఇంటెలిజెన్స్/జనరల్ ఇంగ్లిష్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.07.2023.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో పీజీటీ, టీజీటీ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ(టీఎస్ఈఎంఎస్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని 23 ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 239 బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టులు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ),లైబ్రేరియన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు పీజీటీలకు రూ.35,750, టీజీటీలకు రూ.34,125, లైబ్రేరియన్‌లకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, బోధన అనుభవం, డెమో తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023.
» **వెబ్‌సైట్:** https://fastses.telangana.gov.in

తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీలకు సివిల్స్ ఉచిత కోచింగ్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ అండ్ కెరియర్ కౌన్సెలింగ్ సెంటర్.. యూపీఎస్సీ నిర్వహించే సీశాట్ 2024(సివిల్ సర్వీసెస్)కు సంబంధించి ఉచిత శిక్షణ అందించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

» **అర్హతలు:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన మైనారిటీ కమ్యూనిటీ(ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, జైన్, బుద్ధిస్ట్, పార్శీ)కి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 100.
» **రిజర్వేషన్:** మొత్తం సీట్లలో మహిళలకు 33.33 శాతం, దివ్యాంగులకు 5శాతం కేటాయించారు.
» **అర్హత:** ఏదైనా జనరల్/ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థి తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షికాదాయం రూ.2 లక్షలకు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.07.2023.
» **స్క్రీనింగ్ టెస్ట్ తేది:** 23.07.2023.
» **పరీక్ష కేంద్రాలు:** అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లోని తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలల్లో పరీక్ష జరుగుతుంది.
» **వెబ్‌సైట్:** www.cet.cgg.gov.in/tmreis

డీఆర్‌డీవో–ఎన్ఎస్‌టీఎల్, విశాఖపట్నంలో 62 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని డీఆర్‌డీవోకి చెందిన నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్).. 2023–24 సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 62
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–28, డిప్లొమా అప్రెంటిస్‌లు–23, ట్రేడ్ అప్రెంటిస్–11.
» **స్టైపెండ్:** నెలకు రూ.8000 నుంచి రూ.9000 చెల్లిస్తారు.
» **అర్హత:** 2021, 2022–2023 సంవత్సరాల్లో సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28.06.2023 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** drdo.gov.in

» ముగిసిన టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్
» పేపర్ క్లిష్టంగా ఉందనే అభిప్రాయాలు
» ప్రిలిమ్స్ కటాఫ్ అంచనా 75–80!
» ముందస్తు ప్రిపరేషన్ మేలంటున్న నిపుణులు

మెయిన్స్‌లో మెరిసే మార్గం!



టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్.. రాష్ట్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నతస్థాయి పోస్టులకు నిర్వహించే రెండంచెల ఎంపిక ప్రక్రియలో.. తొలిదశ. గ్రూప్ 1–2022 నోటిఫికేషన్‌కు సంబంధించి జూన్ 11న ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది! ఈ ప్రిలిమ్స్ రీ ఎగ్జామ్‌కు దాదాపు 2.3 లక్షల మంది హాజరైనట్లు సమాచారం. వీరంతా ఇప్పుడు ప్రిలిమ్స్ కటాఫ్ ఎంత ఉంటుంది.. ఎన్ని మార్కుల శ్రేణిలో ఉంటే తదుపరి దశ మెయిన్‌కు అర్హత లభిస్తుంది..! అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష విశ్లేషణ, కటాఫ్ అంచనాతోపాటు.. మెయిన్‌లో విజయానికి మార్గాలు..

గ్రూప్–1 ప్రిలిమ్స్ కటాఫ్‌పై నిపుణుల ద్వారా ఒక అంచనాకు వచ్చిన తర్వాత అభ్యర్థులు మెయిన్‌కు ముందస్తుగా సన్నద్ధత మొదలుపెట్టాలి. ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చాక ప్రిపరేషన్ ప్రారంభిద్దాం అనే ధోరణి సరికాదు అంటున్నారు నిపుణులు.

ప్రిలిమ్స్‌కు తగ్గిన హాజరు

మొత్తం 503 పోస్టులతో విడుదల చేసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఈ నెల 11న మళ్లీ నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటిసారి జరిగిన పరీక్షకు హాజరైన వారి సంఖ్యతో పోల్చితే.. రీ ఎగ్జామ్‌కు హాజరు తగ్గింది. తొలుత నిర్వహించిన పరీక్షను 2,86,051 మంది రాయగా.. రీ ఎగ్జామ్‌కు 2,33,248 మంది మాత్రమే హాజరయ్యారు.

ప్రిలిమ్స్ క్లిష్టంగానే

మొత్తంమీద ప్రిలిమ్స్ పరీక్ష క్లిష్టంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. నిడివి ఎక్కువగా ఉండటంతో ప్రశ్నలను పూర్తిగా చదివి అవగాహన చేసుకునేందుకు ఎక్కువ సమయం పట్టిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. దీంతో సమయాభావానికి గురైనట్లు చెబుతున్నారు. ఎకానమీ, కరెంట్ అఫైర్స్‌ల నుంచి అడిగిన ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. అదే విధంగా జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రభుత్వ విధానాలపైనా ఎక్కువగా ప్రశ్నలు అడిగారు. దీంతోపాటు ప్రభుత్వ పథకాలు, ఆయా రంగాల్లో అభివృద్ధి, ఇతర అంశాలపై గణాంకాలతో కూడిన ప్రశ్నలు ఎదురయ్యాయి. తెలంగాణ అంశాల నుంచి ప్రశ్నలు తక్కువగా రావడంతో.. ఈ విభాగంపై ఎక్కువ దృష్టి పెట్టిన అభ్యర్థులు కొంత నిరాశకు గురయ్యారు. మొత్తంగా చూస్తే రద్దయిన ప్రిలిమినరీ పరీక్షతో పోల్చితే రీ ఎగ్జామ్ కొంత సులభమే అనే వాదన వినిపిస్తోంది.

కటాఫ్ శ్రేణి 75–80

ప్రశ్నల క్లిష్టత స్థాయిని పరిగణనలోకి తీసుకుంటే.. ప్రిలిమ్స్ జనరల్ కటాఫ్ 75–80 మార్కుల శ్రేణిలో ఉండొచ్చని నిపుణుల అంచనా. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తాము రాసిన సమాధానాలను సరిపోల్చుకొని.. ఈ మార్కుల శ్రేణిలో ఉంటామని భావిస్తే.. తదుపరి దశ మెయిన్ పరీక్షకు సన్నద్ధం కావడం మేలని సూచిస్తున్నారు.

మెయిన్‌లో రాణించేందుకు ఇలా

గ్రూప్–1 మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఆరు పేపర్లుగా 900 మార్కులకు నిర్వహించనున్నారు. దీంతోపాటు.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్ కూడా ఉంటుంది. ఈ పేపర్‌ను కేవలం అర్హత పేపర్‌గానే నిర్దేశించారు. గ్రూప్–1 మెయిన్ పరీక్షలను అక్టోబర్ లేదా నవంబర్‌లో నిర్వహించే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు మెయిన్ పరీక్ష విధానం, సిలబస్‌పై సంపూర్ణ అవగాహన పెంచుకొని ప్రిపరేషన్ సాగించాలి. ముఖ్యంగా మెయిన్ పరీక్ష అభ్యర్థులకు ఆయా అంశాలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ఉంటుంది.

ఇవెంతో కీలకం

- మెయిన్ పరీక్షలో తెలంగాణకు సంబంధించిన అంశాలు కీలకంగా నిలిచే అవకాశముంది. కాబట్టి మెయిన్ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు తెలంగాణ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, తెలంగాణ ఉద్యమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా జనరల్ ఎస్సే పేపర్‌లో, హిస్టరీ పేపర్‌లో ఉండే తెలంగాణ రాష్ట్ర విధానాలు, తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం, హక్కులపై పట్టు సాధించాలి.
- జనరల్ ఎస్సే పేపర్‌లో రాణించేందుకు సమకాలీన సామాజిక అంశాలు, సమస్యలు, ఆర్థిక వృద్ధి, భారత చారిత్రక–వారసత్వ సంపద, సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- భారత చరిత్ర, సంస్కృతి అంశాలు, ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం; అదే విధంగా తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ అంశాలను చదవాలి. వీటితోపాటు భారత, రాష్ట్ర భౌగోళిక అంశాలపై పట్టు సాధించాలి.
- భారత రాజ్యాంగం, పాలనా వ్యవస్థ, భారత సమాజం, సమస్యలు, సాంఘిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి.
- ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ సబ్జెక్ట్ పేపర్ కోసం భారత, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ–అభివృద్ధి,పర్యావరణ సమస్యల గురించి తెలుసుకోవాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీలో.. సామాజిక అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ దోహద పడుతున్న తీరు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆధునిక పద్ధతుల గురించి అధ్యయనం చేయాలి.

ఆరో పేపర్‌కు ప్రత్యేకంగా

మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తెలంగాణ ఆవిర్భావానికి సంబంధించిన ఆరో పేపర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రత్యేక తెలంగాణ ఆలోచన(1948–1970), ఉద్యమ దశ(1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014) తదితర అంశాలను అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం–1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, కమిటీలు–వాటి సిఫార్సులపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణకు కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

కరెంట్ అఫైర్స్

తెలంగాణకు సంబంధించి ఇటీవల ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి వంటి వాటిని ప్రత్యేక దృష్టితో చదవాలి. ఆర్థిక వనరుల అభివృద్ధి, రాష్ట్రంలో వ్యవసాయం, సాగు పరిస్థితులు, పారిశ్రామిక విధానాలపై పట్టు సాధించాలి.

తెలంగాణ అంశాలపై ప్రత్యేకంగా

- తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీపై పట్టు సాధిస్తే మెయిన్‌లో మార్కులు పెంచుకునే అవకాశం ఉంది. ఇందుకోసం చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు–రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో.. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు–ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఆరు పేపర్లు.. 900 మార్కులు

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
ఎ)	జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్)	150
1	జనరల్ ఎస్సే (1.సమకాలీన సామాజిక అంశాలు, సమస్యలు; 2. ఆర్థిక అభివృద్ధి, న్యాయపరమైన అంశాలు; 3.భారత రాజకీయ స్థితిగతులు; 4.భారతీయ చరిత్ర సాంస్కృతిక వారసత్వం; 5.సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి; 6.విద్య, మానవ వనరుల అభివృద్ధి)	150
2	హిస్టరీ, కల్చర్ – జాగ్రఫీ. (1.భారత దేశ చరిత్ర, సంస్కృతి. ఆధునిక యుగం(1757–1947); 2.తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం; 3.భారతదేశం, తెలంగాణ జాగ్రఫీ)	150
3	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన. (1.భారతీయ సమాజం, నిర్మాణం, అంశాలు, సామాజిక ఉద్యమాలు; 2.భారత రాజ్యాంగం; 3.పరిపాలన)	150
4	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (1.భారత ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి; 2.తెలంగాణ ఆర్థిక వ్యవస్థ; 3.అభివృద్ధి, పర్యావరణ సమస్యలు)	150
5	సైన్స్–టెక్నాలజీ–డేటా ఇంటర్‌ప్రిటేషన్. (1.శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పాత్ర, ప్రభావం; 2.విజ్ఞానశాస్త్ర వినియోగంలో ఆధునిక పోకడలు; 3.డేటా ఇంటర్‌ప్రిటేషన్–సమస్యా పరిష్కారం)	150
6	తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం. (1.తెలంగాణ తొలి దశ (1948–1970); 2.ఉద్యమ దశ (1971–1990); 3. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశ (1991–2014))	150

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**
సోమవారం
26-6-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	260	62,979
నిఫ్టీ ▽	106	18,666

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,493	▽	138
డోజోన్స్	33,727	▽	219
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,462	▽	40
డాక్స్	15,830	▽	158
షాంఘై (గురువారం ముగింపు)	3,198	▽	42
నికాయ్	32,781	▽	483

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

చిన్న పెట్టుబడి.. పెద్ద నిధిగా మారాలంటే?


స్మాల్‌క్యాప్ కంపెనీల్లో అధిక రాబడులు ● ఎంపికలో తప్పులకు చోటు ఉండకూడదు ● పొరపాటు జరిగితే పెట్టుబడికీ నష్టం
మల్టీబ్యాగర్ ఒక్కటే ఆకర్షణ కాకూడదు ● ఎన్నో అంశాలు చూసిన తర్వాతే పెట్టుబడి
యాజమాన్యం దక్షత చూడాలి ● పనిచేస్తున్న రంగం, వృద్ధినీ పరిశీలించాలి ● రిస్క్‌కు మొదటి ప్రాధాన్యత తప్పనిసరి



వివేక్, బలరామ్ ఇద్దరూ మంచి స్నేహితులు. కానీ, ఈక్విటీ పెట్టుబడుల విషయానికొచ్చే సరికి ఇద్దరిదీ చెరోదారి. 2002లో ఇద్దరూ ఓ చెరో నాలుగైదు స్మాల్‌క్యాప్ కంపెనీల్లో రూ. 50 వేల చొప్పున ఇన్వెస్ట్ చేశారు. 2023 జనవరి నాటికి వివేక్ ఇన్వెస్ట్ చేసిన ఐదు కంపెనీల్లో రెండు మల్టీబ్యాగర్లు అయ్యాయి. రెండు నష్టాలను ఇవ్వగా, ఒక్కటి మంచి రాబడులను ఇచ్చింది. మొత్తంగా అతడి రూ. 50వేల పెట్టుబడి 20 ఏళ్లలో రూ.18 లక్షలు అయింది. బలరామ్ నాలుగు కంపెనీల్లో మొత్తంగా రూ. 50 వేలు పెట్టుబడి పెట్టాడు. కానీ, 2023 జనవరిలో అతడి మొత్తం పెట్టుబడి రాబడితో కలసి రూ.6 లక్షలుగా మారింది. ఇద్దరి రాబడుల్లో అంత వ్యత్యాసం ఎందుకు ఉందంటే? వారు ఎంపిక చేసుకున్న కంపెనీల వల్లే. ఇక్కడ బలరామ్‌తో పోలిస్తే వివేక్ అంత భారీ రాబడులు పోగేసుకోవడం వెనుక అతడు నేర్చుకుని, తెలుసుకుని, తగినంత అధ్యయనం తర్వాత పెట్టుబడి పెట్టడం వల్లేనని చెప్పుకోవాలి. అందుకే స్మాల్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడి ఓ కళగా నిపుణులు చెబుతారు. అన్నీ తెలుసుకుని, అవగాహనతోనే ఇన్వెస్ట్ చేయాలని సూచిస్తుంటారు.

స్మాల్‌క్యాప్ కంపెనీలు అంటే చాలా చౌకగా లభిస్తున్నాయనే అపోహ మనలో చాలా మందికి ఉంటుంది. కానీ, ఇది సరికాదు. రూ.16,472 కోట్ల మార్కెట్ విలువ వరకు ఇప్పుడు స్మాల్ క్యాప్ కంపెనీలుగానే పరిగణిస్తున్నారు. లోగడ రూ.8,579 కోట్ల మార్కెట్ విలువ వరకు ఇలా పరిగణించేవారు. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో చాలా వరకు దశాబ్దాలుగా అదే స్థాయిలో ఉండిపోతాయి. కేవలం కొన్ని మాత్రం ఆయా రంగాల్లో లీడర్లుగా, పెద్ద స్థాయి కంపెనీలుగా అవతరిస్తాయి. వ్యాపారంలో వృద్ధి లేక అక్కడే ఉండిపోయే కంపెనీలు కూడా బోలెడు. కంపెనీ యాజమాన్యంలో సత్తా లేకపోవచ్చు. లేదా ఆ కంపెనీ చేస్తున్న వ్యాపారానికి పరిమిత అవకాశాలు ఉండొచ్చు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం, మూలధన నిధుల నిర్వహణ మెరుగ్గా లేకపోవచ్చు. సాధారణంగా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువ ఇలాంటివే కనిపిస్తుంటాయి. కానీ, కొన్ని మార్కెట్ గుర్తింపు లేకపోవడం వల్ల కూడా తక్కువ వేల్యుయేషన్ల వద్ద లభిస్తుంటాయి. లేదంటే అప్పటి వ్యాపార స్థాయి ఆధారంగా చిన్న కంపెనీలుగా ఉండి ఉండొచ్చు. ఇలాంటి నాణ్యమైన కొన్ని ఆణిముత్యాలను ఎంపిక చేసుకోవడం వల్ల భవిష్యత్తులో మల్టీబ్యాగర్ రాబడులు సంపాదించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఇన్వెస్టర్లలో ఒక ధోరణి కనిపిస్తుంది. స్టాక్ ధర రూ.100 లోపు లేదా రూ.10–50 లోపు ఉంటే చౌక అని భావిస్తుంటారు. రేటు తక్కువలో ఉంటే ఎక్కువ స్టాక్స్ వస్తాయని, వేగంగా రెండు మూడు రెట్లు పెరుగుతాయనే అపోహ ఉంటుంది. స్మాల్‌క్యాప్ కంపెనీయే అయినా ఒక్కో షేరు రూ.5,000 ఉండొచ్చు. మరో కంపెనీ షేరు ధర రూ.10 ఉండొచ్చు. షేరు ధర కంపెనీ ఆర్థిక మూలాలనే ప్రతిఫలిస్తుందన్నది మర్చిపోవద్దు. షేరు ధర తక్కువ, ఎక్కువలో ఉండడం అన్నది చౌక, ఖరీదైన దానికి నిదర్శనం కాదు. ఉదాహరణకు.. 'ఏ' అనే కంపెనీ మూలధనం రూ.10కోట్లు. షేరు ముఖ విలువ రూ.10 అప్పుడు కోటి షేర్లు ఉంటాయి. 'బీ' అనే కంపెనీ మూలధనం కూడా రూ.10 కోట్లు. కానీ షేరు ముఖ విలువ ఒక్కరూపాయే. కనుక 10 కోట్ల షేర్లు ఉంటాయని తెలుసుకోవాలి. కేవలం పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్స్ రేషియో/ఆర్జనకు షేరు ఎన్ని రెట్లు ఉంది) చూసి, తక్కువలో ఉందని కొనుగోలు చేయడం కూడా అన్ని సందర్భాల్లో సరైన ఫలితం ఇవ్వదని నిపుణులు చెబుతున్నారు. స్మాల్‌క్యాప్ అనేది పెద్ద ప్రపంచం. టాప్ 250 కాకుండా మార్కెట్లో ఉన్న మిగిలినవన్నీ కూడా స్మాల్‌క్యాప్ విభాగంలోకే వస్తాయి. అన్ని వందలు, వేల కంపెనీల నుంచి మాణిక్యాలను (చెత్త నుంచి మణి) వెలికితీయాలంటే లోతైన పరిశోధన అవసరం.



నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ నుంచి 10–15 ఏళ్ల కాలంలో కొన్ని మల్టీబ్యాగర్ అవుతాయి. అవి పదుల సంఖ్యలో ఉండొచ్చు. అదే సమయంలో కొన్ని ఇన్వెస్టర్ల పెట్టుబడిని కూడా హరించివేస్తుంటాయి. ఇక్కడ అగాధాలు, పర్వత శిఖరాలూ ఉంటాయి.

నాణేనికి రెండు వైపులు

బాలాజీ అమైన్స్ షేరు ధర 2010 జనవరి 4న రూ.33.57. 13 ఏళ్ల తర్వాత చూస్తే ఇప్పుడు రూ.2,200 దరిదాపుల్లో ఉంది. కీ ఇండస్ట్రీస్ షేరు ధర కూడా ఇదే కాలంలో రూ.33.30 నుంచి రూ.2,200కు పెరిగింది. గ్రాన్యూల్స్ ఇండియా ధర రూ.9.09 నుంచి రూ.290కు చేరింది. నాణేన్ని మరోవైపు అదే కాలంలో 98% వరకు నష్టపోయినవీ, మార్కెట్ నుంచి కనుమరుగు అయినవీ ఉన్నాయి.

మెరుగైన అవకాశాలు

రూ.16,472 కోట్ల వరకు స్మాల్‌క్యాప్ కంపెనీల కిందకే వస్తున్నాయి కనుక ఈ విభాగంలో ఇప్పుడు పెద్ద కంపెనీలు కూడా వస్తున్నాయి. నిర్వచనం మార్చడం వల్ల స్మాల్‌క్యాప్ ప్రపంచం ఇప్పుడు మరింత విస్తృతం అయింది. మన మార్కెట్ విస్తృతి పెరిగింది. వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా, మరి కొన్ని దశాబ్దాల్లో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించొచ్చు. కనుక దీర్ఘదృష్టితో ఆలోచించి, ఇప్పుడు స్మాల్‌క్యాప్ ప్రపంచంలో కొంచెం పెద్ద కంపెనీలను ఎంపిక చేసుకున్నా.. అవి జెయింట్ క్యాప్ కంపెనీలుగా మారే అవకాశాలు లేకపోలేదు. 2012 జనవరి 10 నుంచి 2022 జనవరి 10 వరకు గణాంకాలను పరిశీలించి చూస్తే.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ నుంచి మూడు కంపెనీలు లార్జ్‌క్యాప్ కంపెనీలుగా అవతరించాయి. అవి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్, ఎస్ఆర్ఎఫ్, పీఐ ఇండస్ట్రీస్. ఇక స్మాల్‌క్యాప్ నుంచి మరో 21 కంపెనీలు మిడ్‌క్యాప్ కంపెనీలుగా అవతరించాయి. 72 కంపెనీలు అదే స్థాయిలో ఉంటే, 64 కంపెనీలు మైక్రోక్యాప్ (మరీ చిన్నవి)గా కరిగిపోయాయి.



ఎంపిక ఎలా..?


''చిన్న కంపెనీలు అధిక వృద్ధి సామర్థ్యాలతో ఉంటాయి. దాదాపు ఇవి అనలిస్టుల సెల్ కాల్ పరిధిలో ఉండవు. కనుక స్మాల్ క్యాప్ కంపెనీలను అధ్యయనం చేసేందుకు ప్రాథమిక పరిశోధన అవసరం. అన్ని మార్కెట్ సైకిల్స్‌లోనూ ఇవి అధిక రాబడులను ఇవ్వగలవు'' అని ఓపీసీ అస్సెట్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అజయ్ బగ్గా పేర్కొన్నారు. ప్రముఖ మార్కెట్ అనలిస్ట్ అంబరీశ్ బలిగ అభిప్రాయంలో.. ''స్మాల్‌క్యాప్ స్టాక్ ఎంపికకు ఏ ఒక్క విధానం అంటూ లేదు. కాకపోతే నేను అనుసరించే మార్గదర్శకాలు ఏమిటంటే.. ఎంపిక చేసుకోబోయే స్టాక్ మంచి పనితీరు చూపిస్తున్న రంగానికి చెందినదై ఉండాలి. లేదా మంచి పనితీరు చూపించేందుకు అవకాశం ఉన్న రంగంలో పనిచేస్తూ ఉండాలి. ఆయా కంపెనీ ఏదైనా ఉప విభాగంలో లీడర్‌గా ఉందా అని చూస్తాను. లేదంటే లీడర్‌గా ఎదిగే అవకాశాలున్నాయా అని పరిశీలిస్తాను. ఆయా రంగం వృద్ధికి మించి పనితీరు చూపిస్తూ ఉండాలి''అని వివరించారు. ఇక స్మాల్‌క్యాప్ కంపెనీల విషయంలో లిక్విడిటీ (షేర్ల లభ్యత) కూడా కీలకమేనని అంబరీశ్ తెలిపారు. ''బ్యాలన్స్ షీటులో రుణ భారం ఎక్కువగా ఉండకూడదు. రుణ భారం ఉంటే, భవిష్యత్తులో పెరిగే నగదు ప్రవాహాల పట్ల స్పష్టత ఉండాలి. అప్పుడే ఈక్విటీ–రుణభారం నిష్పత్తి దిగొస్తుంది'' అని వివరించారు. లిక్విడిటీ తక్కువగా ఉన్నప్పుడు ఏదైనా ప్రతికూల పరిస్థితి ఏర్పడితే అది షేరు ధర పతనానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నాణ్యతపై దృష్టి కీలకం

''స్మాల్‌క్యాప్ కంపెనీలు ఎప్పుడూ కూడా లిక్విడిటీ పరంగా సవాళ్లను ఎదుర్కొంటూ ఉంటాయి. లిక్విడిటీ తక్కువగా ఉంటే ర్యాలీ ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే, షేరు ధర వేగంగా పడిపోయే అవకాశాలు సైతం ఉంటాయి. స్మాల్‌క్యాప్ పరంగా ఉండే కీలకమైన అంశం ఇదే. అందుకే మార్కెట్లో వాటి ధరలు మానిప్యులేషన్‌కు లోనవుతుంటాయి''అని కేఆర్ చోక్సే ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దేవేన్ చోక్సే వివరించారు. ఇక యాజమాన్యం సమర్థత, నిజాయితీ తదితర అంశాలు కూడా ఈ విభాగంలో కీలకంగా పనిచేస్తాయని అంబరీష్ బలిగ వివరించారు. యాజమాన్యం విషయంలో కనిపించని విషయాలను వెలికితీసే ప్రయత్నం చేయాలని సూచించారు. షేరు ధర చౌకగా ఉందా లేక స్మాల్‌క్యాప్ అని కాకుండా, నాణ్యతకు సంబంధించిన అంశాలు చూడాలని నిపుణుల సూచన. యాజమాన్యానికి తగిన సామర్థ్యాలు ఉన్నాయా? కంపెనీ భిన్నంగా ఏదైనా చేయగలదా? పోటీ తత్వం లేదా టైఅప్‌ల ద్వారా భిన్నంగా ప్రయత్నించగలదా? పరిమిత మూలధన నిధులతోనే వృద్ధి చెందగలదా? భారీ వృద్ధికి అవకాశం ఉన్న రంగంలోనే పనిచేస్తుందా? అన్న అంశాలను చూడాలి. ఎంపిక చేసుకునే కంపెనీకి ఇన్ని ప్రత్యేకతలు ఉన్నప్పుడు మధ్యలో తాత్కాలికంగా ఏవైనా ఆటుపోట్లతో దారి తప్పినా.. తిరిగి మళ్లీ గాడిలో పడి దూసుకుపోయే అవకాశాలుంటాయి. యాజమాన్యం సామార్థ్యాలు, బలాలకు తోడు ఆ వ్యాపారం విస్తరణకు అవకాశం ఉందా? అప్పటికే ఆ కంపెనీలో ఇనిస్టిట్యూషన్స్ లేదా హెచ్ఎన్ఐలకు (బడా ఇన్వెస్టర్లు) వాటాలున్నాయా అనే అంశాలను కూడా పరిశీలించాలి. ఆయా కంపెనీ కస్టమర్లు, వెండర్లు, పోటీ కంపెనీలను కలసి మాట్లాడడం ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చని అంబరీష్ బలిగ సూచించారు. పైగా అన్ని సానుకూలతలు ఉండి, కంపెనీని ఎంపిక చేసుకున్న తర్వాత ఫలితం వచ్చే వరకు వేచి చూసే ఓపిక కూడా దండిగా ఉండాలన్నది మార్కెట్ పండితుల స్వీయ అనుభవం. ఎవ్రీ డాగ్ హ్యాజ్ ఏ డే అన్న చందంగా ప్రతీ నాణ్యమైన కంపెనీకి అనుకూల తరుణం వచ్చే వరకు ఆగాల్సిందే. పైగా ఒక్కసారి పెట్టుబడి పెట్టి రిలాక్స్ అయ్యే ధోరణి స్మాల్‌క్యాప్ కంపెనీలకు అస్సలే పనికిరాదు. ఎలాంటి సానుకూలతలు చూసి, సంబంధిత కంపెనీలో పెట్టుబడి పెట్టారో.. వాటిల్లో మార్పు లేనంత వరకు పెట్టుబడులను కొనసాగించుకోవచ్చు. తేడా వస్తే బయటకు వచ్చేందుకు సిద్ధంగానూ ఉండాలి. కంపెనీ వృద్ధి పథంలో సాగుతున్నంత కాలం ర్యాలీ చేస్తున్నప్పటికీ ఆ పెట్టుబడితో కొనసాగొచ్చు. అలాంటప్పుడే అవి మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్‌గా అవతరించగలవు. అలా మంచి పనితీరును క్రమం తప్పకుండా కొనసాగిస్తున్న సమయంలో మరింత మంది ఇన్వెస్టర్లు ఆయా కంపెనీల్లో పెట్టుబడులకు ముందుకు వస్తారు. దీంతో విస్తృతి పెరుగుతుంది.

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ అనుకూలమేనా..?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను వచ్చే 15 ఏళ్లలో రూ.2.5–3 కోట్ల వరకు విలువ చేసే ఇంటిని కొనుగోలు చేద్దామని అనుకుంటున్నాను. డౌన్‌పేమెంట్ సమకూర్చుకునేందుకు... టాటా స్మాల్‌క్యాప్ లేదంటే ఎడెల్‌వీజ్ స్మాల్‌క్యాప్, మిరే అస్సెట్ మిడ్‌క్యాప్ లేదా పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ అన్నవి మంచి ఎంపికలేనా? – ఆదిత్య బి

మీరు ఇప్పటి నుంచి 10–15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేయాలనే ప్రణాళికతో ఉంటే సరైన ట్రాక్‌లో ఉన్నట్టుగానే భావించాలి. ఎందుకంటే మీ పెట్టుబడులు వృద్ధి చెందేందుకు తగినంత వ్యవధి ఉంది. ఈక్విటీ ఫండ్స్‌లో మోస్తరు రాబడులకు ఇంతకాలం అనుకూలమని చెప్పుకోవచ్చు. దీంతో మీ ఇంటి కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్ మొత్తాన్ని సమకూర్చుకోవచ్చు. మీరు గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇంటి కొనుగోలుకు అయ్యే ధరను ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం అంచనా వేస్తున్నట్టు అయితే, దీనికి రియల్ ఎస్టేట్‌లో ఉండే సగటు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని జోడించాల్సి ఉంటుంది. అప్పుడు వాస్తవ కొనుగోలు ధర్‌పై అంచనాకు రావాలి. దీనివల్ల డౌన్ పేమెంట్ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు నెలవారీగా ఎంత మేర సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేయాలన్న దానిపై స్పష్టత సాధించొచ్చు. సిప్ మొత్తాన్ని రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఒకటి రెండు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ పథకాలను కూడా జోడించుకోవచ్చు. కాకపోతే వీటిల్లో 25–30 శాతానికి మించి కేటాయింపులు చేసుకోవద్దు. మీ రిస్క్ సామర్థ్యం, ఈక్విటీ ఫండ్స్ పట్ల మీకు ఉన్న గత అనుభవం ఆధారంగా కేటాయింపులపై నిర్ణయానికి రావాలి. గృహ రుణానికి చెల్లించే ఈఎంఐ మీ నెలవారీ ఆదాయంలో మూడింట ఒక వంతు మించకుండా చూసుకోండి. ఇందుకు గాను కావాల్సినంత డౌన్ పేమెంట్‌ను ముందే సమకూర్చుకోవాలి. మరోవైపు ఇంటిని పెట్టుబడిగా చూడడం మంచి ఆలోచన కాదు. రియల్ ఎస్టేట్‌లో లిక్విడిటీ చాలా తక్కువ. ఇంటిని కొనుగోలు చేయడం, విక్రయించడం అంత సులభం కాదు. కనుక ఇంటి కొనుగోలు నివాసం కోణం నుంచే చూడాలి.

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అంటే ఏమిటి? వాటిల్లో ట్రేడ్ చేయవచ్చా? – యోగేష్

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అన్నవి రెండు ప్రముఖ డెరివేటివ్ సాధనాలు. స్టాక్స్‌లో ముందస్తుగా అంగీకరించిన ధరకు, భవిష్యత్తు తేదీపై ట్రేడ్ చేయడం. షేర్లు కొనుగోలు చేయాలంటే విలువ మేర మొత్తం ముందే చెల్లించాలి. కానీ, ఫ్యూచర్స్‌లో అయితే మొత్తం కాంట్రాక్టు విలువలో నిర్దేశిత శాతం ముందు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఫ్యూచర్స్‌లోని స్టాక్ కాంట్రాక్టు విలువలో 20 శాతం అనుకుంటే, అచ్చమైన ఈక్విటీలో కొనుగోలు చేసే విలువతో (క్యాష్ మార్కెట్) ఫ్యూచర్స్‌లో అదే మొత్తంతో ఐదు రెట్లు అధికంగా ట్రేడ్ చేసుకోవచ్చు. ఈక్విటీలో రూ.లక్ష కొనుగోలు చేసుకునేట్టు అయితే, అంతే మొత్తంలో ఫ్యూచర్స్‌లో రూ.5 లక్షల విలువ మేర ట్రేడ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ప్రధాన ఉద్దేశ్యం మీ పోర్ట్‌ఫోలియో విలువకు హెడ్జ్ చేసుకోవడమే. కానీ, చాలా మంది వేగంగా డబ్బు సంపాదించేందుకు స్పెక్యులేటివ్‌గా దీన్ని చూస్తుంటారు. ట్రేడింగ్ విజయవంతం అయితే గణనీయమైన లాభాలు వస్తాయి. కానీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ అన్నది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. ఒక్క ట్రేడ్ బెడిసికొట్టినా అప్పటి వరకు ఎన్నో రోజులుగా సంపాదించిన మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ పథకాలు.. ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్ ఫండ్స్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ హెడ్జింగ్‌ను ఒక విధానంగా ఉపయోగిస్తాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఆకర్షణీయంగా, సులభంగా డబ్బులు సంపాదించే మార్గంగా అనిపించొచ్చు. కానీ ఇది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. గ్యాంబ్లింగ్ కంటే తక్కువేమీ కాదు. ఓ ప్రముఖ ఆన్‌లైన్ బ్రోకర్ సీఈవో సైతం తమ క్లయింట్లలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో బ్యాంక్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ప్రకటించడాన్ని అర్థం చేసుకోవాలి. రిటైల్ ఇన్వెస్టర్లు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమే సరైనది.

లెమన్ ట్రీ హోటల్స్	ఐసీఐసీఐ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 95

టార్గెట్: రూ. 137

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో లెమన్ ట్రీ హోటల్స్ సంస్థ చరిత్రలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 880 కోట్ల ఆదాయం, రూ. 450 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ప్రకటించింది. వార్షికంగా ఆదాయ అంచనాలను అధిగమిస్తూ 100 శాతం వృద్ధిని అందుకుంది. 50 శాతం ఇబిటా మార్జిన్లను సాధించింది. కోవిడ్–19 ప్రభావం తదుపరి గతేడాది రికవరీ సంవత్సరంగా ఆవిర్భవించింది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఆతిథ్య రంగ పరిశ్రమపై ప్రత్యేక దృష్టికి తెరలేచింది. 2023–27 మధ్య కాలంలో హోటల్ పరిశ్రమ సగటున 10 శాతంపైగా వార్షిక వృద్ధిని సాధించనున్నట్లు అంచనా. అయితే సరఫరాలు 4–5 శాతంస్థాయిలోనే మెరుగుపడే వీలుంది. దీంతో 2025 కల్లా అదనంగా 2,800 గదుల ఏర్పాటుపై కంపెనీ దృష్టి సారించింది. తద్వారా మొత్తం నిర్వహణలోని గదుల సంఖ్యను 11,000కుపైగా చేర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 669 రూములతో కూడిన ఆరికా ముంబై ఎయిర్‌పోర్ట్ హోటల్‌ను ప్రారంభించనుంది. ప్రధానంగా 2024కల్లా పూర్తికానున్న ముంబై హోటల్‌కు సంబంధించి రూ. 300 కోట్ల పెట్టుబడి వ్యయాలు పెండింగ్ ఉన్న నేపథ్యంలో 2025 నుంచి ఆర్గానిక్ రుణ భారాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోనుంది. వినియోగ వ్యయాలు మందగించడం, ఆక్యుపెన్సీలు తగ్గడం, ద్రవ్యోల్బణ వ్యయాలు, గదుల అద్దెలు నీరసించడం వంటి అంశాలను కీలక రిస్కులుగా పేర్కొనవచ్చు.



ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్	హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 576

టార్గెట్: రూ. 630

ఎందుకంటే: రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో రూ. 12,900 కోట్ల విలువైన వార్షిక ముందస్తు అమ్మకాలు సాధించింది. కంపెనీ చరిత్రలోనే ఇవి అత్యధికంకాగా.. వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధిని అందుకుంది. ఇందుకు 16 మిలియన్ చదరపు అడుగుల(ఎంఎస్ఎఫ్) రియల్టీను ప్రవేశపెట్టడం, ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం(ఎంఎంఆర్)లో నమోదైన రూ. 2,700 కోట్ల విలువైన ముందస్తు అమ్మకాలు సహకరించాయి. ఈ నేపథ్యంలో బెంగళూరుకాకుండా ఇతర ప్రాంతాలలోని అమ్మకాలు సైతం 41 శాతానికి ఎగశాయి. అంతక్రితం ఏడాది ఇవి కేవలం 20 శాతంగా నమోదయ్యాయి. ఈ బాటలో ప్రస్తుత ఏడాది(2023–24) వార్షిక ముందస్తు అమ్మకాలలో 25 శాతం పురోగతిని అంచనా వేస్తోంది. ఇందుకు 76 ఎంఎస్ఎఫ్ ఆస్తుల(రియల్టీ)ను ప్రవేశపెట్టనుండటం దన్నుగా నిలిచే వీలున్నట్లు భావిస్తోంది. ప్రధానంగా ముంబై ఎంఎంఆర్, హైదరాబాద్ కీలకంగా నిలవనున్నాయి. కొత్త ప్రాజెక్టుల విడుదల తగ్గనున్నప్పటికీ బెంగళూరు నుంచి సైతం పటిష్ట అమ్మకాలు సాధించే వీలుంది. రెండు కీలక లావాదేవీల ద్వారా డీబీ రియల్టీ నుంచి బీకేసీ(రూ. 900 కోట్లు), మహాలక్ష్మీ ప్రాజెక్ట్(రూ. 200 కోట్లు)లలో మిగిలిన వాటాలను కొనుగోలు చేసింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయాలు రూ. 7,500 కోట్లుకాగా.. ప్రెస్టీజ్ తాజా రూ. 1,100 కోట్లతో కలిపి రూ. 3,000 కోట్లు వెచ్చించింది. బీకేసీ ప్రాజెక్ట్ ద్వారా నెలవారీ అద్దె ఆదాయం ఒక్కో చదరపు అడుగుకీ రూ. 25 పెరిగి రూ. 350కు చేరనున్నట్లు అంచనా వేస్తోంది. దీంతో వీటి విలువ రూ. 3500 కోట్లకు చేరే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆకర్షణీయంగా ఆల్టర్నేటివ్ ఫండ్స్

● ఇతర సాధనాలకు దీటుగా మెరుగైన రాబడులు
● దేశీ మదుపరుల భారీ ఇన్వెస్ట్‌మెంట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలకు దేశీయంగా డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. సంప్రదాయ పెట్టుబడి సాధనాలకు దీటుగా, కొన్నిసార్లు అంతకు మించిన రాబడులు అందిస్తూ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) ఆకట్టుకుంటున్నాయి. దీంతో వీటిలో పెట్టుబడులపై దేశీ ఇన్వెస్టర్లలోనూ ఆసక్తి పెరుగుతోంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గణాంకాల ప్రకారం దాదాపు రెండేళ్ల క్రితం వరకు రూ. 4.5 లక్షల కోట్లుగా ఉన్న ఏఐఎఫ్‌ల నిధులు గతేడాది ఆఖరు నాటికి రూ. 7 లక్షల కోట్లకు చేరాయి. రాబోయే రోజుల్లో ఇది 4–5 రెట్లు పైగా పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రూ. 40 లక్షల కోట్లుగా ఉన్న మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ స్థాయికి చేరవచ్చని లెక్క వేస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం దాకా ఎక్కువగా విదేశాల నుంచి పెట్టుబడులు వస్తుండగా ప్రస్తుతం 80–90% నిధులు దేశీయంగా సమీకరించినవే ఉంటున్నాయి. అత్యంత సంపన్నులతో పాటు ఒక మోస్తరు ఇన్వెస్టర్లు కూడా వీటిలో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

మూడు రకాలు: ఈక్విటీలు, బాండ్లు, రియల్టీ వంటి సంప్రదాయ సాధనాలకే పరిమితం కాకుండా ఇతరత్రా మరిన్ని ప్రత్యామ్నాయ సాధనాల్లోను ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులను అందుకోవాలనుకునే ఇన్వెస్టర్ల కోసం ఉద్దేశించినవి ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు. సంప్రదాయ ఫండ్స్‌తో పోలిస్తే భిన్నమైన వ్యూహాలతో, విభిన్న సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులను ఆర్జించడం వీటి లక్ష్యం. రిస్కులు ఉన్నప్పటికీ దానికి తగ్గట్లుగా మరింత రాబడులు పొందేందుకు అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్లు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం దేశీయంగా మూడు కేటగిరీల కింద దాదాపు 4,000 పైచిలుకు ఏఐఎఫ్‌లు ఉన్నాయి. ఏఐఎఫ్‌ల్లో ప్రధానంగా మూడు రకాలు ఉన్నాయి. కేటగిరీ 1 తరహా ఏఐఎఫ్‌లు ప్రధానంగా స్టార్టప్‌లు, చిన్న .. మధ్య తరహా సంస్థలు లేదా లాభదాయకమైనవిగా ప్రభుత్వం పరిగణించే రంగాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. ఇక రెండో కేటగిరీ ఫండ్‌లో ప్రైవేట్ ఈక్విటీ, డెట్ ఫండ్స్ లాంటివి ఉంటాయి. మూడో కేటగిరీలో హెడ్జ్ ఫండ్స్, స్వల్పకాలికంగా రాబడులు అందించే ఉద్దేశంతో ఏర్పాటయ్యే ఫండ్స్ మొదలైనవి ఉంటాయి. తొలి రెండు కేటగిరీల్లోని ఏఐఎఫ్ స్కీములు క్లోజ్ ఎండెడ్‌గా ఉంటాయి. కాల వ్యవధి పరిమితి కనీసం మూడేళ్లుగా ఉంటుంది. మూడో కేటరిగీ ఫండ్‌లు ఓపెన్ ఎండెడ్ లేదా క్లోజ్ ఎండెడ్‌గానైనా ఉండొచ్చు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఏఐఎఫ్ బెంచ్‌మార్క్ నివేదిక ప్రకారం మూడో కేటగిరీ ఏఐఎఫ్‌లు కాల వ్యవధిని బట్టి 10 శాతం నుంచి 23 శాతం వరకు రాబడులు ఇచ్చాయి.

టెక్నాలజీతో అధిక రాబడులకు ఆస్కారం..

సరైన వ్యూహాలు పాటిస్తే ఏఐఎఫ్‌ల ద్వారా మార్కెట్‌కు మించి రాబడులు అందుకోవడానికి ఆస్కారం ఉందని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న షేర్స్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) భూపాల్ నానావత్ తెలిపారు. ''దాదాపు రూ. 3,900 కోట్ల ఫండ్స్ నిర్వహిస్తున్నాం. కొత్తగా మరో రూ. 1,000 కోట్ల ఫండ్‌కి నిధులను సమీకరిస్తున్నాం. ఏఐఎఫ్ 3 కేటగిరీ కింద లిస్టెడ్ కంపెనీల్లో మేము ఇన్వెస్ట్ చేస్తాము. అల్గోరిథమ్‌ల వంటి అధునాతన సాంకేతికతలతో, రోబోటిక్ సిస్టమ్‌లతో రిస్కులను సమర్ధంగా ఎదుర్కొనే వ్యూహాలను అమలుపర్చడం ద్వారా ఇన్వెస్టర్లకు అధిక రాబడులను అందిస్తున్నాం. దీనితో 30 శాతం పైగా రాబడులు పొందడానికి ఆస్కారం ఉంటుంది'' అని ఆయన వివరించారు. వీటిలో రూ. కోటి నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చని, హెడ్జ్ ఫండ్స్ కేటగిరీ కింద షేర్లు, బాండ్లు, డెరివేటివ్‌లు, కమోడిటీలు వంటి విస్తృత సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నామని తెలిపారు. ఫిక్సిడ్ డిపాజిట్లు, మార్కెట్లకు మించిన రాబడులు అందించే సాధనాలేవీ లేవంటూ ఇన్వెస్టర్లలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు, ఏఐఎఫ్‌లు వంటి సాధనాలపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామని నానావత్ చెప్పారు.




భూపాల్ నానావత్
షేర్స్‌బజార్ ఎండీ

క్లుప్తంగా...


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు

అరుణాచలగిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



సాక్షి, హైదరాబాద్: జూలై 3వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు (సర్వీసు నంబర్ 98889) జూలై 2న ఉదయం 6 గంటలకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి బయలేర్దనుంది. కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనానంతరం అదేరోజు రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుంది. జూలై 3వ తేదీ ఉదయం గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ కు వెళ్తుంది. అక్కడ దర్శనానంతరం మర్నాడు జూలై 4వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ.2600 చొప్పున ఉంటుంది. టూర్ ప్యాకేజీ కోసం టీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ www.tsrtconline.inలో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్ నగర్‌లోని రిజర్వేషన్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 9959226257, 9959224911 నంబర్లను సంప్రదించాలి.

డేటింగ్.. చీటింగ్

ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల పేరిట వలపు వల వేస్తున్న సైబర్ నేరగాళ్లు

- యువతుల ద్వారా రెచ్చగొట్టి న్యూడ్ కాల్స్ రికార్డు చేస్తూ డబ్బు కోసం బెదిరింపులు
- పరువు పోతుందన్న భయంతో రూ. లక్షలు సమర్పించుకుంటున్న బాధితులు

సాక్షి, హైదరాబాద్: సరదా కోసమో.. కాలక్షేపం కోసమో చేసే కొన్ని పనులు కొత్త తలనొప్పులు తెచ్చిపెడతాయనడానికి డేటింగ్ యాప్స్ వ్యవహారం ఓ ఉదాహరణ. ఏదో కాసేపు టైంపాస్ చేద్దామని కొందరు.. ఒంటరితనంతో మరికొందరు ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల వలలో చిక్కుతున్నారు. ఈ తరహా మోసాలకు గురవుతున్న వారిలో యువకుల నుంచి వయోవృద్ధులు వరకు ఉంటున్నారు. ఎదుటివారి బలహీనతలను అనుకూలంగా మార్చుకుంటున్న సైబర్ నేరగాళ్లు... అందమైన యువతులతో న్యూడ్ వీడియోకాల్స్ మాట్లాడిస్తున్నారు. ఎదుటి వ్యక్తిని మాటల్లో దింపి రెచ్చగొట్టి తర్వాత వారిని నగ్నంగా వీడియోకాల్స్ మాట్లాడేలా చేస్తున్నారు. ఆ వీడియోలను రికార్డు చేసి, ఆపై సోషల్ మీడియాలో పెడతామని, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు పంపుతామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పరువు పోతుందని భావించి బాధితులు సైబర్ నేరస్తులు డిమాండ్ చేసినట్లు రూ. లక్షలు సమర్పిస్తున్నారు.



లింక్‌లు పంపి..

మనకు డేటింగ్ యాప్‌లపై ఆసక్తి లేకున్నా సోషల్ మీడియాలో మన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని కూడా కొందరు సైబర్ నేరగాళ్లు ఈ తరహా లింక్‌లు పంపి రెచ్చిగొట్టి ఆ తర్వాత మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నారాయణగూడ ప్రాంతానికి చెందిన 78 ఏళ్ల ఓ వృద్ధుడికి వీడియోకాల్ చేసిన ఓ యువతి.. ఆ వృద్ధుడిని నగ్నంగా ఫోన్ మాట్లాడేలా చేసి దాన్ని వీడియో తీసి బెదిరింపులకు దిగింది. ఇలా రూ. లక్షల్లో డబ్బు పోగొట్టుకున్న ఆ వృద్ధుడు చివరకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. లాలాపేటకు చెందిన 59 ఏళ్ల బీమా కంపెనీ ఉద్యోగి సైతం రూ. 8 లక్షలు ఇదే రీతిలో పోగొట్టుకున్నాడు. సైబర్ నేరగాళ్లు ప్రజల సోషల్ మీడియా ఖాతాల నుంచి సమాచారం సేకరించి వాటి ఆధారంగా డేటింగ్ యాప్ లింక్‌లు, వాట్సాప్ వీడియో న్యూడ్‌కాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. అప్రమత్తంగా ఉండటం ద్వారానే ఇలాంటి ముప్పు నుంచి బయటపడగలుగుతామని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు మరవొద్దు...

- మన మానసిక పరిస్థితి ఏదైనా సరే ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లలో అపరిచిత వ్యక్తులతో స్నేహాలు అవసరమా అన్నది ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. ఆన్‌లైన్ స్నేహాల వల్ల మోసపోయే కంటే నిజమైన స్నేహితులను, సన్నిహితులను గుర్తించడం ఉత్తమమన్నది తెలుసుకోవాలి.
- ఆన్‌లైన్ మోసగాళ్లకు సోషల్ మీడియా అనేది ప్రధాన వేదిక. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం వంటి సోషల్ మీడియా ఖాతాల్లో మనం పెట్టే వ్యక్తిగత సమాచారం, ఫాలో అవుతున్న వ్యక్తులను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు డేటింగ్ యాప్‌ల లింక్‌లు పంపి మోసాలకు తెరతీస్తున్నారు. సోషల్ మీడియాలో పరిమితికి మించి వ్యక్తిగత సమాచారం ఇవ్వకపోవడం ఉత్తమం.
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఇతర సోషల్ మీడియా ఖాతాల్లో మన ఫొటోలు, వీడియోలు కేవలం స్నేహితులకే కనపించేలా ప్రొఫైల్ ప్రైవసీ ఆప్షన్లు వాడాలి. దీనివల్ల ఇతరులకు మన వ్యక్తిగత అంశాలు వెల్లకుండా నిరోధించవచ్చు.
- అందమైన యువతుల ప్రొఫైల్ ఫొటోలతో (ఫేక్ ప్రొఫైల్స్‌తో) కొందరు సైబర్ నేరగాళ్లు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఇలా వారి వలలో పడే అమాయకులను మోసగిస్తున్నారు. అందువల్ల అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించవద్దు.
- మొబైల్‌ఫోన్, ల్యాప్‌లాప్, డెస్క్‌టాప్‌లకు సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. దీనివల్ల సైబర్ నేరగాళ్లు పంపే ఫిషింగ్ లింక్స్, మాల్‌వేర్స్ నుంచి రక్షణ ఉంటుంది.
- డేటింగ్ యాప్స్ పేరిట లింక్‌లు పంపి స్నేహాలు చేసే వారిని వీలైనంత వరకు వ్యక్తిగత సమాచారం అడిగేందుకు ప్రయత్నించాలి. ప్రశ్నించడం ప్రారంభిస్తే ఫేక్‌గాళ్లు వెంటనే మిమ్మల్ని బ్లాక్ చేస్తారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో పరిచయం అయ్యే స్నేహితులకు ఎట్టిపరిస్థితుల్లోనూ డబ్బులు పంపవద్దు. ఏ రకమైన ఆన్‌లైన్ యాప్‌లోనూ డబ్బు లావాదేవీలు చేయవద్దు.

రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

- ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలకు అవకాశం
- వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం



ప్రాంతం	జిల్లా	వర్షపాతం
(శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షపాతం)		(సెం.మీ.)
నార్నూర్	ఆదిలాబాద్	3.85
సిర్పూర్	ఆసిఫాబాద్	3.40
అలుబాక	ములుగు	2.13
ఆసిఫాబాద్	ఆసిఫాబాద్	2.08

సాక్షి, హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనంఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్రమట్టం నుంచి 7.6 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉంది. ఒడిశా, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో కొనసాగుతున్న ఈ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కానున్నట్లు పేర్కొంది. కుమ్రంభీం-ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు సైతం కురుస్తాయని అంచనా వేసింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 0.9 సెం.మీ.వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 5.3 సెం.మీ.వర్షపాతం నమోదు కాగా, 51 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

రైతులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఉచిత న్యాయ సేవల కోసం న్యాయ సేవాసంస్థను సంప్రదించాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్ రావు



వరంగల్ లీగల్/పాలకుర్తి: చట్టాల ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ న్యాయ సేవల అథారిటీ, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా బమ్మెర-పాలకుర్తి సరిహద్దులో చట్టాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అలాగే వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు 70 లీగల్ అగ్రి ఎయిడ్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రైతులు ఎక్కడైనా మోసపోతే వెంటనే ఈ సంస్థను సంప్రదించాలని సూచించారు. రైతుల తరఫున పోరాడేందుకు 124 చట్టాలు ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. డబ్బుల్లేక న్యాయ సహాయం పొందలేని వారికి ఉచిత న్యాయం అందించేందుకు న్యాయ సేవా సంస్థ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య న్యాయమూర్తి రవీంద్ర శర్మ, నల్సార్ వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవ రాయ, రైతు చట్టాల డైరెక్టర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు పూర్వ వైభవం



బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నీరా పాలసీతో వేలాది మందికి ఉపాధి

- అందరూ ఆత్మ గౌరవంతో బతుకుతున్నారు
- గౌడ ఆత్మగౌరవ భవన శంకుస్థాపనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మణికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని కుల వృత్తులకు పూర్వ వైభవం వస్తోందని, అందరూ ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ నగరశివారు కోకాపేటలో గౌడ్‌లకు కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో ఆత్మగౌరవ భవనానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రప్రభుత్వం వైన్స్‌ల కేటాయింపులో గౌడ్‌లకు 15శాతం రిజర్వేషన్ కల్పిస్తోందని, నీరా పాలసీతో వేలాది మంది ఉపాధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఎప్పటినుంచో ఉన్న కల్లు దుఖాణాలను తాడి బార్‌లుగా మార్చాలనే ఆలోచన చేస్తున్నామని, నీరా కేఫ్‌లను జిల్లా స్థాయిలోనూ ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.30 కోట్ల తాటి, ఈత మొక్కలను నాటామని, కల్లు అంటే ఉన్న చులకన భావం పోగొట్టి, కల్లు దుఖాణాల రూపురేఖలను మార్చితే మరింత మందికి ఉపాధి కలుగుతుందన్నారు. గౌడ్‌ల అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలను తేవాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని కులవృత్తుల వారు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని, వారంతా ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, కల్లుగీత సహకార సంఘం చైర్మన్ పల్లె రవికుమార్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అంజయ్యగౌడ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బి.భిక్షమయ్య, సత్యనారాయణ, గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణ్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, వనజ ఆంజనేయులుగౌడ్, పెద్ద ఎత్తున గౌడ కులస్తులు పాల్గొన్నారు.

బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: బీఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీ నాలుగేళ్ల కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తూ అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్‌సీఆర్ఐ) ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంసెట్ ర్యాంక్ ఆధారంగా బైపీసీ విద్యార్థులకు 75%, ఎంపీసీ విద్యార్థులకు 25% కేటాయించే ఈ సీట్ల కోసం ఈ నెల 14 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది. www.fcrits.in వెబ్‌సైట్‌లో దరఖాస్తును నింపి సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని సూచించింది. అదే విధంగా మరిన్ని వివరాల కోసం 8074350866, 8919477851 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపింది.

తప్పుడు ఆరోపణలతో మా కుటుంబానికి హాని

- డ్రగ్స్ వివాదంలోకి మా పేర్లు లాగడం సరికాదు
- సినీనటి సురేఖ వాణి

సాక్షి,హైదరాబాద్: డ్రగ్స్ కేసులో టాలీవుడ్ నిర్మాత కేపీ చౌదరి పట్టుబడినప్పట్నుంచి డ్రగ్స్ వ్యవహారంతో తమకు సంబంధాలున్నాయంటూ మీడియా తమ పేర్లు జొప్పించడం సరికాదని సినీనటి సురేఖ వాణి పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యవహారంలో తమకు ఎటువంటి సంబంధంలేదని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం వల్ల తమ కుటుంబానికి హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. గత కొద్దిరోజులుగా మీడియాలో తమ కుటుంబంపై వస్తున్న ఆరోపణల కారణంగా స్నేహితులు, బంధువులు ఆందోళనతో ఫోన్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సినీ, మీడియా రంగంలో అందరితోనూ స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయని, అయినప్పటికీ తమపై ఇటువంటి దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని కోరారు.

జడ్జీలకు సహాయ, సహకారాలు అందిస్తా

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి
- పదవీవిరమణ సందర్భంగా ఘన సత్కారం


తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం


లక్డీకాపూల్: పదవీ విరమణ పొందినప్పటికీ న్యాయమూర్తుల కష్టనష్టాలు తెలిసిన వ్యక్తిగా వారికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. సంతోష్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన పదవీ విరమణను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ న్యాయమూర్తుల సంఘం, న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీలు జస్టిస్ సంతోష్‌రెడ్డిని ఘనంగా సత్కరించాయి. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు నందికొండ నర్సింగ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తుల సంక్షేమం కోసం, న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జస్టిస్ సంతోష్‌రెడ్డి చేసిన సేవలను పలువురు న్యాయమూర్తులు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జస్టిస్ సంతోష్‌రెడ్డి 32 ఏళ్లపాటు మేజిస్ట్రేట్ కోర్టు మొదలు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా, న్యాయశాఖ కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం న్యాయమూర్తిగా సేవలు అందించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తుల సంఘంలో పలు బాధ్యతలు చేపట్టడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేసి న్యాయమూర్తులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. తొలుత వేద పండితుల ఆశీర్వచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి జీవన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఉపాధ్యక్షులు కె. ప్రభాకర్‌రావు, సుదర్శన్, న్యాయమూర్తుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహన్, సహాయ కార్యదర్శి దశరథరామయ్య సభ్యులు శ్రీవాణి, వేంకటేశ్వరరావు, హౌసింగ్ సొసైటీ సభ్యుడు కుంచాల సునీత కె.పట్టాభిరామారావు, న్యాయమూర్తుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా జడ్జీలు ప్రతిమ, బాల భాస్కరరావు, శ్రీదేవి తదితరులు జస్టిస్ ఎ. సంతోష్‌రెడ్డిని సన్మానించారు. న్యాయమూర్తులు గజమాలతో జస్టిస్ సంతోష్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంతోష్‌రెడ్డి న్యాయమూర్తిగా తన అనుభవాలను పంచుకున్నారు. తనను సన్మానించిన న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైరయ్యాక కూడా తమ సమస్యల పరిష్కారం కోసం న్యాయమూర్తుల సంఘానికి గౌరవ బాధ్యతలు స్వీకరించాల్సిందిగా న్యాయమూర్తుల సంఘం, సొసైటీ చేసిన విజ్ఞప్తికి జస్టిస్ సంతోష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

కాన్సులేట్ కార్యాలయాల కోసం ఎదురుచూపులు

- ప్రతిపాదనలకే పరిమితమైన హైదరాబాద్‌లో సౌదీ, కువైట్ రాయబార కార్యాలయాలు
- యూఏఈ కాన్సులేట్ కార్యాలయం ఇటీవలే ప్రారంభం

మోర్తాడ్(బాల్కొండ): దక్షిణాది రాష్ట్రాల వలస కార్మికులతో పాటు రిక్రూటింగ్ ఏజెన్సీలకు ఎంతో ప్రయోజనం కలిగించే సౌదీ అరేబియా, కువైట్ కాన్సులేట్ కార్యాలయాల ఏర్పాటు ప్రతిపాదనకు మోక్షం లభించడం లేదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) రాయబార కార్యాలయాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి ఇటీవల ప్రారంభించారు. యూఏఈ కాన్సులేట్ కార్యాలయం ప్రారంభం కావడంతో సౌదీ, కువైట్ దేశాల ఎంబసీలను కూడా ప్రారంభించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. హైదరాబాద్‌లో అమెరికా ఎంబసీ కార్యాలయం 14 ఏళ్ల నుంచి సేవలు అందిస్తోంది. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా కంటే సౌదీ, కువైట్‌లకు వలసలు ఎక్కువగా సాగుతున్నాయి. కువైట్ ఎంబసీ ద్వారా పని కావాలంటే వలస కార్మికులు కేరళలోని తిరువనంతపురం లేదా ఢిల్లీకి వెళ్లాల్సి వస్తుంది. సౌదీ రాయబార కార్యాలయంలో పని చేయించుకోవాలన్నా కేరళ లేదా ఢిల్లీకి ప్రయాణం చేయాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో రెండు దేశాల రాయబార కార్యాలయాలను ఏర్పాటు చేస్తే వలస కార్మికులకు ఆయా దేశాలు జారీచేసే వీసాల స్టాంపింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. రెండు దేశాల కాన్సులేట్ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదన ఎప్పుడో చేశారు. సౌదీ కాన్సులేట్ కార్యాలయానికి సంబంధించిన ప్రతిపాదన 2019లోనే జరిగింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఇందుకోసం అంగీకారం కూడా తెలిపింది. కరోనా కారణంగా ఈ ప్రతిపాదన మరుగునపడిపోయింది. కరోనా వైరస్ తగ్గుముఖం పట్టిన తర్వాత గల్ఫ్ దేశాలకు వలసల సంఖ్య గణనీయంగా పెరిగింది. వలస కార్మికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో రెండు దేశాల ఎంబసీల కోసం ప్రయత్నించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయి



తెలంగాణ నుంచి వలసల సంఖ్య పెరిగిన దృష్ట్యా రెండు దేశాల కాన్సులేట్ కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాన్సులేట్ కార్యాలయాల కోసం కేంద్రం ద్వారా రెండు దేశాలతో సంప్రదింపులు జరిపించాలి. హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల ఎంబసీలను ఏర్పాటు చేస్తే తెలంగాణకు అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయి. **– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు**

ఎంసెట్ కౌన్సెలింగ్.. గందరగోళం!

28 నుంచి ఆప్షన్లు మొదలు.. ఇప్పటికీ స్పష్టత లేని సీట్ల వివరాలు

- కొన్ని కాలేజీల్లో పూర్తవ్వని అఫిలియేషన్
- అన్ని సీట్లూ మొదటి దశలో రావడం కష్టమే
- కాలేజీల్లో బ్రాంచీల మార్పిడిపై నిర్ణయం ఎప్పుడు?
- కంప్యూటర్ కోర్సుల్లో ఎన్ని సీట్లు పెరుగుతాయి?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి మొదలవనుంది. ఎంసెట్ అర్హులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 28 నుంచి అభ్యర్థులు అవసరమైన ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఉన్నత విద్యామండలి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది. అయితే ఇప్పటివరకూ కౌన్సెలింగ్‌లో పాల్గొనే కాలేజీలు, ఉండే సీట్ల వివరాలు మాత్రం ఎంసెట్ కౌన్సెలింగ్ విభాగానికి అందలేదు. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో దాదాపు 145 కాలేజీలు పాల్గొంటాయి. వాటికి సంబంధించిన జాబితాను గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలు ఎంసెట్ కౌన్సెలింగ్‌కు పంపాల్సి ఉంటుంది. వాటిల్లో ఎన్ని సీట్లు ఉన్నాయి? ఏయే బ్రాంచీల్లో సీట్లు ఉన్నాయి? అనే వివరాలు అందించాలి. దీని ఆధారంగా కౌన్సెలింగ్ చేపడతారు. సకాలంలో ఆప్షన్లు ఇస్తే తప్ప వచ్చే నెల మొదటి వారంలో తొలిదశ సీట్లు వెల్లడించడం సాధ్యం కాదు. ఆప్షన్లు ఇవ్వడానికి అన్ని కాలేజీలు, సీట్ల వివరాలు పొందుపర్చకపోతే ఎలా సాధ్యమని అధికారులే అంటున్నారు. కొన్ని కాలేజీల్లో ఇప్పటికీ విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపు ప్రక్రియ పూర్తవ్వలేదు. ఈ ఏడాది ఎంసెట్‌కు 1,95,275 మంది హాజరైతే 1,56,879 మంది అర్హత సాధించారు. వారంతా ఇప్పుడు కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నారు.



ఏ బ్రాంచిలో ఎన్ని సీట్లు ఉంటాయో?

అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం చాలా కాలేజీలు డిమాండ్ లేని కోర్సుల్లో సీట్లు తగ్గించుకొని డిమాండ్ ఉన్న కోర్సుల్లో పెంచుకొనేందుకు అనుమతి కోరుతున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో సీట్లు తగ్గించుకొని, సీఎస్‌సీ, సీఎస్‌సీ సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి బ్రాంచీల్లో సీట్లు పెంచాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. గతేడాది 95 శాతం కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్ బ్రాంచీల్లో కనీసం 50 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. అయితే ఒకేసారి సంప్రదాయ కోర్సులను ఎత్తేస్తే ఇబ్బంది ఉంటుందని విశ్వవిద్యాలయాలు అనుమతులు ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా దాదాపు 100 కాలేజీలు బ్రాంచీల మార్పు కోసం ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ అధికారులు సంబంధిత కాలేజీలకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. మౌలికవసతులు, ఫ్యాకల్టీ ఉన్న కాలేజీలకే అనుబంధ గుర్తింపుతోపాటు సీట్ల మార్పిడిని పరిశీలిస్తామని చెప్పారు. దీంతో ఏయే కాలేజీలు ఈ జాబితాలో ఉన్నాయనేది స్పష్టం చేయాల్సి ఉంటుంది.

స్పష్టత లేకుండా ముందుకెళ్లడం ఎలా?

రాష్ట్రవ్యాప్తంగా 1.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. తొలిదశలో సాధారణంగా 75 వేల సీట్లను కౌన్సెలింగ్‌లో ఉంచుతారు. కొన్ని కాలేజీల్లో అఫిలియేషన్ పూర్తవ్వకపోవడం, మౌలికవసతులు, ఫ్యాకల్టీ సమకూర్చుకొనేందుకు ఆయా కాలేజీలకు మరికొంత అవకాశం ఇవ్వడంతో మొదటి విడత కౌన్సెలింగ్‌లో కొన్ని కాలేజీలను చేర్చరు. అయితే ఈసారి పెద్ద మొత్తంలో కాలేజీల జాబితా అందలేదని అధికారులు చెబుతున్నారు. వాటిని రెండో విడతలో చేర్చడం వల్ల కొందరు విద్యార్థులకు నష్టం జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. సాధారణంగా తొలి విడతలో కొంతమంది ఆప్షన్లు ఇవ్వరు. దీని వల్ల తక్కువ ర్యాంకు ఉన్న వాళ్లకు కూడా మంచి కాలేజీ, మంచి బ్రాంచీల్లో సీట్లు వచ్చే వీలుంది. ఇప్పుడు అన్ని కాలేజీలు, సీట్లు అందుబాటులో లేకపోతే అలాంటి వాళ్లకు ఇబ్బంది కలిగే వీలుంది. ఆప్షన్లు ఇచ్చే సమయానికైనా అన్ని సీట్లు, కాలేజీల వివరాలు పంపాలని ఉన్నత విద్యామండలి అన్ని యూనివర్సిటీలపై ఒత్తిడి తెస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. లేనిపక్షంలో ఆప్షన్లు ఇచ్చే గడువు పొడిగింపుపై ఆలోచించక తప్పదని అధికార వర్గాలు అంటున్నాయి.

జైన విగ్రహాలతో చెరువు తూము

- మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలో వింత
- వెయ్యేళ్లనాటి జైన శిల్పాలను గుర్తించిన పరిశోధకులు


చెరువు తూము భాగంలో జైన చౌముఖి శిల్పాలను చూపుతున్న ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అదో చెరువు.. అంతగా సాగునీటి వనరులు లేని ఆ గ్రామంలో ఆ చెరువు నీళ్లే వ్యవసాయానికి ఆధారం.. అందుకోసం పల్లంగా ఉన్న ప్రాంతానికి నీటి నిల్వను చెరువుగా చేసి పక్కాగా కట్టకట్టి నీటి విడుదలకు తూము నిర్మించారు. ఇదంతా వందేళ్ల నాటి సంగతి. ఇప్పుడు ఆ చెరువుతో పనిలేదు. అయితే, తూము నిర్మాణానికి వినియోగించిన రాళ్లు మామూలువి కాదని, అవి ఓ జైన క్షేత్రం శిల్పాలతో కూడిన శిలలని తేలింది.

వాన నీరు... చెట్టు నీడన

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామ చెరువు కట్ట తూము నిర్మాణంలో రాళ్లుగా వినియోగించిన వెయ్యేళ్లనాటి జైన శిల్పాలు ఇప్పుడు వెలుగు చూశాయి. క్రీ.శ. 9–10 శతాబ్దాల నాటి జైన బసది కేంద్రంలో ఉన్న జైన చౌముఖి శిల్పాలను ఈ చెరువు తూములో వినియోగించినట్టు చరిత్ర పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఔత్సాహిక పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఇటీవల ఎన్కేపల్లి గ్రామానికి వెళ్లారు. ఆ సమయంలో వాన కురుస్తుండటంతో చెట్టునీడన నిలబడి ఉండగా, సమీపంలోని చెరువుకట్టలో శిల్పాలు కనిపించాయి. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు శివనాగిరెడ్డి ఆదివారం ఆ చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా, అవి జౌన చౌముఖి శిల్పాలుగా గుర్తించారు. శిలలపై ఆదినాథ, నేమినాథ, పార్శ్వనాథ, వర్ధమాన మహావీరులు ధ్యానముద్రలో ఉన్నట్టు, పైన కీర్తిముఖాలతో మలిచి ఉన్నట్లు శివనాగిరెడ్డి చెప్పారు. వాటిపై 9–10 శతాబ్దాల నాటి తెలుగు, కన్నడ లిపిలో శాసనాలు కూడా చెక్కి ఉన్నాయన్నారు. ఆ శాసనభాగాలు చెరువుగట్టు గోడలోకి చొచ్చుకుపోయి ఉన్నందున చదవటం వీలు కావటం లేదని, జైన బసదికి చెందిన దానశాసనాలు అయి ఉండే అవకాశం ఉందన్నారు. వాటిని బయటకు తీస్తే స్థానిక చరిత్రకు సంబంధించిన వివరాలు వెలుగుచూసే అవకాశం ఉందని తెలిపారు.

ఆ ప్రాంతం జైన కేంద్రం..

మొయినాబాద్ ప్రాంతం ఒకప్పుడు జైన కేంద్రం. సమీపంలోని చిలుకూరు ప్రాంతం రాష్ట్రకూట, వేములవాడ చాళుక్యుల కాలంలో సుప్రసిద్ధ జైన కేంద్రమని పేర్కొంటూ ఇటీవలే ఆ ఊళ్లోని జైన దేవాలయ జాడలను వెలుగులోకి తెచ్చారు. చిలుకూరుకు అతి సమీపంలో ఉన్న ఎన్కేపల్లి గ్రామంలో కూడా జైన బసది కేంద్రం ఉండేదని, దానికి సంబంధించిన చౌముఖి శిల్పాలని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆ జైన బసది, దాని అనుబంధ దేవాలయం ధ్వంసమైన నేపథ్యంలో, వాటి శిథిల శిల్పాలను చెరువు తూముకు వినియోగించి ఉంటారన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.